ఆదివారం గత వారం సంచిక
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 208 పేజీలు: 8+4 వెల: 6.50

**పిల్లల్ని కంటే రూ. 55 లక్షలు ప్రోత్సాహకం!**
5లో

**ప్రపంచవ్యాప్తంగా అమెరికా వీసా అపాయింట్‌మెంట్ల వాయిదా**

# జనవరి 1 నుంచి 'సంజీవని'

## ఎఐ ఆధారిత వైద్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం

వైద్య సేవల్లో ఎపిని మోడల్‌గా 'సంజీవన్ని విజయవంతం చేయాలి

కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ చేపట్టండి

వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు

వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఉన్నత సమీక్ష


బుధవారం విజయవాడలో 'సంజీవని' ప్రాజెక్ట్‌పై అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష దృశ్యం

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన 'సంజీవన్ని ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఎపిని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవన్ని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సిఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవన్ని ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరి కొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

**డేటా గోప్యత, భద్రతకు ప్రాధాన్యం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఎఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్థవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాల్లి అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**వ్యాధుల నియంత్రణకు దోహదం**

కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తు >>2



## సాగర్ నీళ్ల కోసం జలజగడం

ఎన్ఎస్‌పి కుడి కాలువకు నీటి విడుదల

అనుమతి లేదంటూ అడ్డుకున్న తెలంగాణ

ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వాదనలు

ఎడమ కాలువకు నీరు వదిలిన తెలంగాణ

సెప్టెంబర్ 4న కెఆర్ఎంబి త్రిసభ్య కమిటీ భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** నాగార్జున సాగర్ కుడి కాలువకు బుధవారం ఆంధ్రప్రదేశ్ అధికారులు నీటిని విడుదల చేయడంతో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి జల జగడానికి తెరలేచింది. కెఆర్ఎంబి అనుమతి లేకుండా ఆంధ్ర ప్రదేశ్ అధికారులు నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయడాన్ని తెలంగాణ అధికారులు అడ్డుకోవడంతో సాగర్ డ్యామ్ వద్ద ఉద్రికత్త పరిస్థితులు తలెత్తాయి. ఎన్ఎస్‌పి కుడికాలువకు 2 వేల క్యూసెక్కులు ఎపి ప్రభుత్వం విడుదల చేయడంతో తెలంగాణ కూడా ఎడమకాలువకు 2 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. త్రిపురారం మండలం పెద్ద దేవులపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఆ జలాశయాన్ని నింపడం కోసం ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నాలుగు రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మొదట 5వందల క్యూసెక్కులు విడుదల చేసి క్రమంగాపెంచుతున్నారు. పెద్దదేవుల పల్లి రిజర్వాయర్ నిండిన తరు వాత ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తరిలించి >>2

23రోజుల తర్వాత శుభవార్త 2లో

## మత్స్యకారులు క్షేమం!

● పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురూ సురక్షితం ● బోటు ఎలా తప్పిపోయింది? ఏ మార్గంలో వెళ్లింది? అన్ని కోణాల్లో పరిశీలన ● స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ కావడం పట్ల వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో వారికుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారని, వారిని త్వరగా స్వస్థలాలకు తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ >>2

## హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తూ తెల్లారిన బతుకులు

కంటైనర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ఆరుగురు మృతి, 20 మందికి గాయాలు

మృతులు, క్షతగాత్రులంతా ఎపి వాసులే

సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి, విచారం



ప్రమాదంలో ధ్వంసమైన ప్రైవేటు బస్సు

**సూర్యాపేట/కోదాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త:** హైదరాబాద్– విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఐరన్ పిల్లర్లతో వెళ్తున్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బుధవారం నుంచి వరుసగా నాలుగు రోజుల సెలవులు ఉండటంతో కుటుంబాలతో కలిసి సంతోషంగా గడిపేందుకు వెళ్తున్నవారిని ఈ ప్రమాదంరూపంలో మృత్యువు కబళించింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఘటనాస్థలంలోనే మృతి చెందారు. >>2

వరద కల్లోలం

## నేపాల్ అతలాకుతలం


నేపాల్‌లో పలు గ్రామాలను వరదలు ముంచెత్తిన దృశ్యం

భోటేకోశి నది పొంగిపొర్లడంతో తుడిచిపెట్టుకు పోయిన పలు గ్రామాలు

400 మంది పైగా మానస్ సరోవర్ యాత్రికుల గల్లంతు

133 మంది భారతీయుల కోసం అన్వేషణ

ఆకస్మిక వరదలకు ముందు భూకంపం కూడా..

మృతులు 98 మంది పైనే..

నేపాల్ ప్రధానికి మోడీ ఫోన్, అండగా ఉంటామని భరోసా 3లో

భారతీయుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్లు


బుధవారం అమరావతిలో నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్‌తో కీలక జరుపుతున్న అసెంబ్లీ స్పీకరు అయ్యన్నపాత్రుడు, మంత్రులు పి.నారాయణ,నాదెండ్ల మనోహర్

ఆ దిశగా నిర్మాణమే సిఎం చంద్రబాబు లక్ష్యం

అసెంబ్లీ భవన రూపకల్పనపై కీలక చర్చలు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన మంత్రులు నారాయణ, మనోహర్, నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్ట్‌నర్స్‌తో సమాలోచనలు

వివరాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్

## ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి

**అమరావతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా రాజధానిలోని శాసనసభ భవనాన్ని అత్యున్నత ప్రమాణాలతో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించేందుకు రూపకల్పనపై కీలక చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ ఆర్కిటెక్చర్‌సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతోమాట్లాడుతూ అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న శాసనసభ భవనానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయి ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో పలు అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. శాసనసభ భవనం పైన ప్రత్యేక టవర్‌ను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి అమరావతి రాజధాని మొత్తాన్ని వీక్షించేలా నిర్మాణ రూప >>2

## ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

డి.సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ

రూ.30.66 కోట్లు నిధులు కేటాయింపు

24 దేవాలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు

టిటిడి కల్యాణ మండపానికి రూ.2 కోట్లు

3లో


పిఠాపురంలో ఆలయాలను అభివృద్ధి చేస్తున్న దృశ్యం



ఇంటరాక్టివ్ సెషన్‌లో శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు బదులిస్తున్నమంత్రి లోకేష్

పెట్టుబడులకు

## '3-ఎస్' మంత్రం

స్పీడ్... సర్వీస్... స్టెబిలిటీ

● వేగంగా వ్యాపార అనుమతులు, పెట్టుబడిదారులకు నిరంతర సేవలు ● పాలసీ స్థిరత్వంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచుతున్నాం ● పెట్టుబడుల పురోగతిపై ఇన్వెస్టర్లతో నేరుగా సంప్రదింపులు ● ప్రతి శనివారం పెట్టుబడిదారులకు వ్యక్తిగతంగా మెసేజ్ చేస్తున్నా ● చంద్రబాబు బ్రాండ్... ఆయన ట్రాక్ రికార్డే ఎపికి బలం ● రేపటితరం గర్వపడేలా అమరావతి చరిత్ర సృష్టించబోతోంది ● ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఎపిలో సృష్టించాలనేది మా లక్ష్యం ● ఫార్చ్యూన్ ఇండియా '40 అండర్ 40' కార్యక్రమంలో మంత్రి లోకేష్

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశంలో అత్యంత ప్రతిభావంతులైన యువనాయకులు, చేంజ్ మేకర్లు, బిజినెస్ మైండ్స్‌కు ఫార్చ్యూన్ ఇండియా '40 అండర్ 40' పేరిట ముంబైలో అవార్డులను ప్రదానంచేసింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. దేశంలో డైరీ వాల్యూయాడెడ్ ఉత్పత్తుల్లో ప్రత్యేకత సాధించిన హెరిటేజ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ నారా బ్రాహ్మణికి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఆర్‌పిఎస్‌జి గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగినప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలిచ్చారు. దేశంలోని మిగతా రాష్ట్రాలకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ వేగంగా పెట్టుబడుల ఆకర్షణకు రెండు ప్రధాన కారణాలను మంత్రి లోకేష్ తెలిపారు. స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ తమ విజయ రహస్యమని తెలిపారు. 'వ్యాపారం అయినా, రాజకీయాలు అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేఅని నేనునమ్ముతాను. అదే విధానాన్ని రాజకీయాల్లో కూడా అవలంబిస్తున్నాం. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యా శాఖకు సంరక్షకుడిగా మాత్రమే. నాకు అప్పగించిన >>2


నేపాల్‌లో సంభవించిన వరదల దృశ్యం

# జనవరి 1 నుంచి 'సంజీవని'

>> న్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం, హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఎఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీళ్లకోసం జలజగడం

>> నింపే అవకాశం ఉంది. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వ తక్కువగా ఉంది. సెప్టెంబర్ 4న కెఆర్ఎంబి సమావేశమై నీటి వాటాలు నిర్ణయించే అవకాశం ఉంది. తెలంగాణ 50శాతం చొప్పున ఉన్ననీటిని పంచుకోవాలని వాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్ మాత్రం అక్టోబర్ వరకు తమకు 47 టిఎంసిలు కావాలని కోరింది. అంతేకాదు 50:50 చొప్పున పంచుకోమని 64:36 చొప్పున నీటి వాటా ఉండాలని అంటున్నది. దీనితో ఏ నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్ 4కు వాయిదా వేశారు. శ్రీశైలం నాగార్జునసాగర్ నీటిని తాగునీటికి మాత్రమే వాడాలని నిర్ణయించినా కుడకాల్వకు ఆంధ్రప్రదేశ్ అధికారులు నీటిని విడుదల చేయడంతో ఆందోళన చెలరేగింది.

## కోనసీమ మత్స్యకారుల ఆచూకీ లభ్యతపై సిఎం చంద్రబాబు హర్షం

**విజయవాడ ఆగస్టు 26,ప్రభాతవార్తప్రతినిధి:** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఒడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ కోల్పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. పడవతో పాటు ఆచూకీ కోల్పోయిన ఏడుగురిలో అంతా సురక్షితంగా ఉండడంపై సిఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరం శ్రమించిన గాలింపు బృందాలకు, అధికార యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఒడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లిన బోటు సాకేంతిక లోపంతో పనిచేయక, గాలులకు వేరే ప్రాంతానికి కొట్టుకుపోయింది. నిర్ణీత గడువు దాటినా తిరిగి రాలేదనే విషయం తెలిసిన వెంటనే సిఎం చంద్రబాబు... దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. స్వయంగా మంత్రులను పంపి గాలింపును పర్యవేక్షించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్ని మార్గాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఘటనపై సిఎం మూడు సార్లు సమీక్షించి రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. ఏమాత్రం నిరాశ చెందకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నేవీ, కోస్ట్ గార్డ్, సెంట్రల్ మెరైన్ విభాగాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం సంప్రదింపులు జరిపింది. కోనసీమ తీరం నుంచి పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండొచ్చనే అంచనాతో పశ్చిమ బెంగాల్ కోస్ట్ గార్డ్ విభాగాలను, అక్కడ స్థానికంగా ఉన్న శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులను అప్రమత్తంచేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల సహకారాన్ని కూడా తీసుకున్నారు. అన్ని ప్రయత్నాలు ఫలించి శంకర్‌పూర్ సమీపంలో బోటును, అందులోని ఏడుగురు మత్స్యకారులను రక్షించగలిగారు. అలాగే మత్స్యకారుల ఆచూకీ లభ్యమైన వెంటనే ఆ వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

## తెలంగాణలో కొత్త పూలమొక్క 'అమ్మానియా తెలంగానెన్సిస్'



**హైదరాబాద్, అగస్టు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో ఒక కొత్త పుష్పించే మొక్క జాతిని కనుగొన్నారు. పరిశోధకులు దీనికి రాష్ట్ర పేరును కలుపుతూ 'అమ్మానియా తెలంగానెన్సిస్' అని నామకరణం చేశారు. రంగారెడ్డి జిల్లాలోని జలాశయాలు, తడి ప్రాంతాలతో పాటు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఈ మంచినీటి మొక్కను గుర్తించారు. లైథ్రేసియే కుటుంబానికి చెందినదిగా ఈ జాతి గుర్తించారు. హైదరాబాద్‌లోని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా దక్కన్ రీజినల్ సెంటర్‌కు చెందిన అరికృష్ణన్ పార్థిబన్, లదన్ రసింగం, హైదరాబాద్ విశ్వ విద్యాలయానికి చెందిన సిద్ధార్థన్ సర్వేశ్వరన్, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన దేవర సంధ్యా దీపిక దీనిపై అధ్యయనం చేశారు. క్షేత్ర సర్వేలు, సంబంధిత జాతులు, హెర్బేరియం నమూనాలతో పోలికలను సరిచూసిన తరువాత ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ సేకరణలు, తెలిసిన ఏ అమ్మానియా జాతితోనూ సరిపోలడం లేదని ఆ అధ్యయనంలో తేలింది. టైప్ నమూనాను 2025 జనవరి 4న అమ్రాబాద్‌లోని వత్వార్లపల్లె సమీపంలో సేకరించగా, ఇతర నమూనాలు రంగారెడ్డి జిల్లాలోని నర్సింగి, గచ్చిబౌలి నుండి లభించాయి.

అమ్మానియా ప్రజాతి తడి, జల ఆవాసాలతో సంబంధం ఉన్న గుల్మ జాతి మొక్కలను కలిగి ఉంటుంది. తెలంగాణ నమూనాలు అమ్మానియా కార్డాటా, అమ్మానియా ప్రోస్ట్రాటాలను పోలి ఉన్నాయి, కానీ కాడలతో కూడిన పుష్పగుచ్ఛాలు, ముదురు గులాబీ రంగు రేకులు, విలక్షణమైన ఆకులు, రక్షక పత్రాలు, అసాధారణమైన విత్తన కవచ నమూనా వంటి విలక్షణమైన లక్షణాలను కలిగి ఉన్నాయి. ఈ మొక్క కాలానుగుణంగా ప్రవహించే వాగుల వెంబడి, నీటి వనరుల అంచులలో, తడి ఇసుక నేలల్లో, అమ్మానియా మల్టిఫ్లోరా, రోటాలా జాతుల వంటి చిత్తడి నేల మొక్కలతో పాటు పెరుగుతుంది. ఇది నవంబర్, ఫిబ్రవరి నెలల మధ్య పూలు పూసి, ఫలాలను ఇస్తుందని పరిశోధకులు తెలిపారు.

# మత్స్యకారులు క్షేమం!

>> నెల 3న ఒడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు బోటులో సముద్ర వేటకు వెళ్లారని మంత్రి తెలిపారు. నిర్ణీత సమయంలో బోటు తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించి, మత్స్యకారుల ఆచూకీ కోసం ఎలాంటి ఆలస్యం చేయకుండా అన్ని విధాలుగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారని చెప్పారు. మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి చూపిన ప్రత్యేక చొరవ, శ్రద్ధ అభినందనీయమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటూ, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని, నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను కూడా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ కేంద్ర అధికారులు, నేవీ, కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడినట్లు మంత్రి వెల్లడించారు.

మత్స్యకారుల ఆచూకీ కోసం సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు, బోటు ఎలా తప్పిపోయింది, ఏ మార్గంలో ప్రయాణించి ఉండవచ్చు, ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉండే అవకాశం ఉందన్న అంశాలపై అన్ని కోణాల్లో పరిశీలన జరిపామని మంత్రి తెలిపారు. బోటులో సాంకేతిక సమస్య తలెత్తి ఉండే అవకాశం సహా ప్రతి అంశాన్ని నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో సమన్వయంతో పరిశీలించామని చెప్పారు. గాలి దిశ, వేగం, సముద్ర ప్రవాహాలు, బోటు డ్రిఫ్ట్ అయ్యే అవకాశం వంటి అంశాలను కూడా శాస్త్రీయంగా విశ్లేషించి, బోటు పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండవచ్చన్న అంచనాతో ఆ ప్రాంతంలోని కోస్ట్‌గార్డ్ యూనిట్లు, స్థానిక మత్స్యకారులను అప్రమత్తం చేశామని మంత్రి తెలిపారు. ఈ సమన్వయ కృషి ఫలితంగానే శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ సమీపంలో బోటును గుర్తించి, అందులోని ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా రక్షించగలిగామని చెప్పారు. బోటు యజమాని సోదరుడు భవానీ ప్రసాద్‌తో మాట్లాడి ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో క్షేమంగా ఉన్న విషయాన్ని నిర్ధారించుకున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగా ఉన్నారని, వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడించామని చెప్పారు. మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

ఈ గాలింపు చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, ఎపి ఆర్‌టిజిఎస్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేశాయని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్, జాయింట్ డైరెక్టర్, అల్లవరం ఎఫ్‌డిఓతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన కృషిని మంత్రి అభినందించారు. "మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చూపిన ప్రత్యేక శ్రద్ధకు ధన్యవాదాలు. మత్స్యకారుల ఆచూకీ కోసం మొదటి నుంచి చివరి వరకు ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించింది. ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారనే శుభవార్త రావడం ఎంతో సంతోషంగా ఉంది" అని మంత్రి అన్నారు. "మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. మత్స్యకారులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

ఇకడాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఒడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 3న సముద్రంలో వేటకు వెళ్లారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు గంట తర్వాత నుంచి స్థానికులకు అందుబాటులోకి రాలేదు. వేట ముగించుకుని 10 రోజుల్లో రావాల్సిన వారు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన మత్స్యకారుల కోసం దాదాపు 10 రోజులు గాలింపు చర్యలు చేపట్టారు. ఏడుగురు మత్స్యకారులు బెంగాల్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మత్స్యకారులంతా సురక్షి తంగా ఉన్నారని వెల్లడించారు. బోటులో సాంకేతిక సమస్య ఏర్పడడంతో బెంగాల్ తీరానికి చేరినట్లు పేర్కొన్నారు.

## మరో ప్రమాదంలో సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు

**సఖినేటిపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** కాకినాడకు చెందిన ఏడుగురు మత్స్యకారులు వారం రోజుల తరువాత ప్రమాదం నుంచి బయట పడి అంతర్వేది పల్లెపాలెం హార్బర్‌కు చేరుకున్న ఘటన ఇది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వారం రోజుల క్రితం కాకినాడలో చేపల వేటకు ఏడుగురు మత్స్యకారులతో, ఇండియా ఎపి ఇ2 యం.యం 78 నెంబర్ గల బోటు బయలుదేరింది. చేపల వేట అనంతరం అంతర్వేది హార్బర్‌లో చేపలు అమ్మే ప్రయత్నంలో గల్లు రావాలని ప్రయత్నించగా సముద్రంలో ఆటుపోటులకు ఇసుక దిబ్బలు ఎక్కువగా ఉండటంతో బోటు ఇసుకకు తగిలి ఇరుక్కొని పోయింది. దాంతో చేసేది లేక లంగరు వేసి అక్కడే ఉండిపోయారు. మరుసటి రోజు మళ్లీ ఆటు పోటులకు బోటు తేలింది. కానీ పంఖా ఇరిగటం వల్ల ఆరోజు కూడా లంగరు సాయంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మంగళవారం ఒక బోటు వేటకు వెళ్లే సమయంలో నిలిచిపోయిన బోటును చూసి ఆ వాళ్లతో మాట్లాడి వేదారు సమయం కావటంతో అక్కడే ఉండమని చెప్పి బోటులో ఉన్నవాళ్లు వేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆగిపోయిన బోటును తమ బోటుకు కట్టుకొని వచ్చే సమయంలో మళ్లీ బోటు ఇసుకలో చిక్కుకుంది. పడవకు రంధ్రం పడింది. వెంటనే మెరైన్ స్టేషన్‌కు సమాచారం అందించారు. రాత్రి 7 గంటల సమయంలో విషయం తెలుసుకున్న మెరైన్ పోలీస్ సిబ్బంది మరో బోటుతో అక్కడికి చేరుకున్నారు. ఆ బోటు సాయంతో రంధ్రం పడిన బోటును అంతర్వేది హార్బర్‌కు తీసుకు తరలించారు. సిఐ నవీన్ నరసింహ మూర్తి ఆదేశాలతో మత్స్యకారులను వేములదీవి ఒడ్డుకు తరలించి నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు అనంతరం వారి గృహాలకు తరలించారు. ఇలా కాకినాడ హార్బర్ నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారులు సంగాని సూర్యచంద్ర, పేసు కామేశ్వరరావు, వానుపల్లి శ్రీనివాసు, దున్నా రాజు, పెదిరెంగ జగ్గారావు, పెమ్మిడి స్వామి, కర్రి శ్రీనులు ప్రమాదం నుండి బయట పడి వారం రోజులకు తమ ఇళ్లకు చేరటంతో కథ సుఖాంతమైంది.

## అమరావతి శాసనసభ భవనానికి ప్రపంచస్థాయి రూపకల్పన

### నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్‌తో కీలక చర్చలు

**అమరావతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని శాసనసభ భవనాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ఆధునిక వాస్తుశిల్పం- తెలుగు సంస్కృతి సమ్మేళనంగా, రాష్ట్ర ప్రజాస్వామ్య వైభవానికి ప్రతీకగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా శాసనసభ భవన డిజైన్, నిర్మాణ ప్రణాళిక, ఇంటీరియర్ డిజైన్, ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, సుస్థిర నిర్మాణ విధానాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై ప్రముఖ అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, ఫోస్టర్స్ అండ్ పార్ట్‌నర్స్, సంస్థ ప్రతినిధులతో పాటు సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, సిఆర్‌డిఎ చీఫ్ ఇంజనీర్ ఏ.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శాసనసభ భవనం ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి, కళా వారసత్వం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఆధునిక అభివృద్ధి ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపకల్పన చేయడంపై విస్తృతంగా చర్చించారు. ఆధునిక వాస్తుశిల్ప సౌందర్యంతో పాటు, భవనం వినియోగించే ప్రతి వర్గానికి సౌకర్యవంతంగా, సమర్థవంతంగా ఉండేలా నిర్మాణ ప్రణాళిక రూపొందించాలని అభిప్రాయపడ్డారు. శాసనసభ సముదాయంలో ముఖ్యమంత్రి ఛాంబర్, స్పీకర్ ఛాంబర్, డిప్యూటీ స్పీకర్ ఛాంబర్, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్‌కార్యాలయం, బిజినెస్ అడ్వైజరీ కమిటీసమావేశ మందిరం, మంత్రులు, శాసనసభ్యుల కార్యాలయాలు, వివిధ శాసనసభ కమిటీల సమావేశ మందిరాలు తదితర విభాగాలను సమగ్రంగా ఏర్పాటు చేసే అంశాలపై చర్చించారు. అదేవిధంగా ప్రధాన సభా మందిరం, కమిటీ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్స్, శాసనసభ్యుల లాబీలు, ప్రోటోకాల్ ప్రాంతాలు, మీడియా సెంటర్, ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్, మీడియా వర్క్‌స్టేషన్లు, మీడియా బ్రీఫింగ్ సదుపాయాలు, సందర్శకుల గ్యాలరీలు, పబ్లిక్ లాంజ్‌లు, విజిటర్స్ రిసెప్షన్ ప్రాంతాలు వంటి కీలక సౌకర్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడంపై ప్రతినిధులతో అభిప్రాయాలు పంచుకున్నారు. శాసనసభ కార్యకలాపాలను ఆధునిక పద్ధతుల్లో నిర్వహించేందుకు ఆడియో-విజువల్ వ్యవస్థలు, డిజిటల్ ఓటింగ్, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, ఆధునిక కమ్యూనికేషన్ నెట్‌వర్క్, లైవ్ టెలికాస్ట్, బ్రాడ్‌కాస్టింగ్ సదుపాయాలు, డిజిటల్ శాసన వ్యవస్థలు వంటి సాంకేతిక మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయడంపై దృష్టి సారించారు.

ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, సందర్శకుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ప్రోటోకాల్ మూవ్‌మెంట్, యాక్సెస్ కంట్రోల్, భద్రతా జోన్లు, పార్కింగ్, డ్రాప్-ఆఫ్, పికప్ ప్రాంతాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అండ్ లైఫ్ సేఫ్టీ వ్యవస్థలు వంటి అంశాలను డిజైన్‌లో సమర్థవంతంగా సమన్వయం చేయాలని చర్చించారు. అంతర్గత రూపకల్పనలో సభా మందిరం, ముఖ్యమంత్రి, స్పీకర్ ఛాంబర్లు, మంత్రులు-శాసనసభ్యుల కార్యాలయాలు, బిఏసి సమావేశ మందిరం, ఇతర కమిటీ హాళ్లు, మీడియా సెంటర్ తదితర విభాగాలకు తగిన గౌరవం, సౌకర్యం, కార్యాచరణ సామర్థ్యం కల్పించడంతో పాటు, తెలుగు సంస్కృతి, కళలు, శిల్పకళ, చారిత్రక వారసత్వాన్ని ఆధునిక వాస్తుశిల్పంతో మేళవించేలా ఇంటీరియర్ డిజైన్ రూపొందించడంపై ప్రత్యేకంగా చర్చించారు. అన్ని వర్గాల ప్రజలకు సులభమైన వినియోగాన్ని కల్పించేలా యూనివర్సల్ యాక్సెస్‌బులిటీ ప్రమాణాలు, ర్యాంపులు, లిఫ్టులు, ఆధునిక శానిటేషన్ సదుపాయాలు, సులభమైన అంతర్గత రాకపోకల మార్గాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో సహజ కాంతి-గాలి ప్రసరణ, నీటి సంరక్షణ, వర్షపు నీటి నిర్వహణ, పర్యావరణహిత నిర్మాణ విధానాలు, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు వంటి సుస్థిరత అంశాలను కూడా డిజైన్‌లో అంతర్భాగం చేయాలని చర్చించారు.

భద్రతకు సంబంధించి సిసిటివి నిఘా, యాక్సెస్ కంట్రోల్, ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, ఫైర్ సేఫ్టీ తదితర ఆధునిక వ్యవస్థలను సమగ్రంగా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సమావేశంలో వివరించారు. శాసనసభ భవనం కేవలం పరిపాలనా నిర్మాణంగా కాకుండా రాష్ట్ర ప్రజాస్వామ్య స్ఫూర్తికి, తెలుగు సంస్కృతి-వారసత్వానికి, ఆధునిక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలకు చిరస్థాయి ప్రతీకగా నిలిచేలా నిర్మాణ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో దృష్టి సారించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా.. తెలుగు సంస్కృతికి అద్దంగా.. ఆధునిక ఆంధ్రప్రదేశ్ ప్రగతికి చిరునామాగా.. అమరావతి శాసనసభ భవనం రూపుదిద్దుకునేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

### వారం - వర్జ్యం

27-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.చతుర్దశి ఉ.9.07
న.ధనిష్ఠ రా.2.13
వ. లేదు
దు1. ఉ.10.03-ఉ.10.53
దు2. మ.3.04-మ.3.54
రాహు. మ.1.30-మ.3.00 శుభ లేదు

### వార్తాఫలం

**మేషం:** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**వృషభం :** మీకు ఇష్టం లేని పనిని ఇతరుల ఒత్తిడి మేరకు గత్యంతరం లేక చేయవలసి వస్తుంది. ఆస్తి వివాదాలు తీరుతాయి.

**మిథునం :** ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఉద్యోగులకు స్థాన చలనం ఉంటుంది.

**కర్కాటకం :** మంచి ఫలితాలను సాధించాలంటే, మంచి పరిచయాలు కూడా అవసరమేనని భావిస్తారు. ఆభరణాలు కొనుగోలు.

**సింహం :** మీ పరోక్షంలో జరుగుతున్న అన్యాయాలు వెలుగు చూస్తాయి. ఆరోగ్యం జాగ్రత్త. కొత్త ఋణం తీసుకుంటారు.

**కన్య :** స్త్రీల, వృద్ధుల సహకారంతో కొంత ఊరట చెందుతారు. కోర్ట్ కేస్‌ల నుండి క్షేమంగా బయటపడతారు.

**తుల :** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడపగలుగుతారు. నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారంలో లాభం.

**వృశ్చికం :** మంచి చెడులను విశ్లేషించుకొని అడుగులను జాగ్రత్తగా ముందుకు వేస్తారు. ఆస్తులు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

**ధనుస్సు :** వృత్తిఉద్యోగాల పరంగా ఒడిదుడుకులేవీ ఏర్పడవు. ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. క్రొత్త బ్రాంచీల ఏర్పాటు.

**మకరం :** కళలు, రాజకీయ, రంగాలలోని వాడి సన్మానయోగం. భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**కుంభం :** వివాహాది శుభకార్యాలు సానుకూల పడతాయి. జీవితాశయం నెరవేరుతుంది. కుటుంబ సభ్యుల నుండి సహాయం.

**మీనం :** వృత్తి వ్యాపారాలు అనుకూలంగా వుంటాయి. పేయింటింగ్, ఆర్ట్, డిజైనింగ్‌లో మంచి పేరు ప్రఖ్యాతి సాధిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


ఫార్చ్యూన్‌ఇండియా 40 అండర్ 40 అవార్డును అందుకుంటున్న నారా బ్రాహ్మణి

# పెట్టుబడులకు '3-ఎస్' మంత్రం

>> బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లాలన్నదే నా ఆలోచన. గతంలో వ్యాపారంలోనూ ఇదే విధానాన్ని అనుసరించాను. ఇప్పుడు అధికారిక బాధ్యతలోనూ ఇదే విధానంతో ముందుకు వెళ్తున్నాను. మనందరం, ముఖ్యంగా రాజకీయ నాయకులు సంస్థలను నిర్మించే వ్యక్తులుగా ఉండాలి అని నేను బలంగా నమ్ముతున్నాను. ఎపి అభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది మేము అనుసరిస్తున్న '3-ఎస్‌'ల విధానం.. స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే విధానాలు. మొదటిది వేగం, మేము ఎంత వేగంగా పని చేస్తున్నామో ఇక్కడ ఉన్న అనేక పరిశ్రమల ప్రతినిధులు స్వయంగా చూశారు. రెండోది సర్వీస్, చాలా మంది పెట్టుబడిదారులకు వారి పెట్టుబడుల ప్రస్తుతస్థితిపై నేను స్వయంగా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ ఇస్తుంటాను. దాదాపు ప్రతి శనివారం రాత్రి వారికి వ్యక్తిగతంగా మెసేజ్ పంపుతాను. పెట్టుబడిదారులు కోరుకునేది ఇదే అని నేను నమ్ముతున్నాను. మూడోది పాలసీ స్థిరత్వం అంటే విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ పెట్టుబడిదారులు కోరుకునేది స్థిరమైన పాలసీ ఫ్రేమ్‌వర్క్. మా నాయకత్వం గతంలో తీసుకొచ్చిన విధానాలు రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడ్డాయి. ప్రభుత్వాలు మారవచ్చు, కానీ మా విధానాలు మాత్రం కొనసాగుతాయి.

రెండో కారణం సిఎం చంద్రబాబు నాయుడు. సిబిఎన్ అంటే ఒక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడుల కోసం అవసరమైన తలుపులు తెరవగలిగే ముఖ్యమంత్రి ఉండటం వల్ల మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం నేను సమావేశ మందిరంలోకి వెళ్లినపుడు ఒప్పందాన్ని ఖరారు చేస్తాను. మేమిద్దరం కలిసి ఈవిధంగా పనిచేస్తున్నాం. ఈ భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది. సిఎం చంద్రబాబు మంత్రివర్గంలో తాను పనిచేస్తున్నానంటే ఆయన దగ్గర నేను నేర్చుకోవాల్సి ఉంది. తండ్రిగా ఆయన చూసి చాలా నేర్చుకున్నాను. మంత్రిగా ఆయన మాకు సిఎం, ఆయనది దూరదృష్టి, ఆ దిశలో ఆయన మా అభిప్రాయాలు చెబుతామన్నారు. అన్నింటిని ఆయన వింటారు. ఆచరణకు అవకాశం కల్పిస్తారు. ప్రతిరోజూ తీసుకునే నిర్ణయాల విషయంలో మనం మన తల్లిదండ్రులతో విభేదించే సందర్భాలు ఉంటాయి. అయితే నా అభిప్రాయం కుటుంబ వ్యాపారాల్లో ఉన్న యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలి. కొత్త రంగాల్లో, కొత్త వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలి. పరిశోధనపై పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఇది చాలా కీలకం. ఇక్కడే విద్య ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. వివిధ ఖండాల్లో ఉన్న సంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య అనుసంధానం కల్పించి, పరిశోధన, కొత్త రంగాల్లో మరింత దృష్టి పెట్టవచ్చు. అది అంతరిక్ష రంగం కావచ్చు, క్వాంటమ్ టెక్నాలజీ కావచ్చు, మెటీరియల్ సైన్సెస్ కావచ్చు భారతదేశం చేయగలిగేది ఎంతో ఉంది. మనమంతా కలిసి దీన్ని సాధించగలం. ఇక రాష్ట్రం తరఫున నేను కోరేది ఒక్కటే ఈ మార్పులో మీరు కూడా భాగస్వాములు కండి. మనం వివిధ దేశాలు, వివిధ నగరాల గురించి, అక్కడ జరుగుతున్న మార్పుల గురించి మాట్లాడుతుంటాం. నేను మీకు అందిస్తున్న వేదిక ఆంధ్రప్రదేశ్. మేము పూర్తిగా పరిపూర్ణంగా ఉన్నామని చెప్పడం లేదు. కానీ మేము చేసే ప్రతి తప్పునుంచి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా ఎలా తీర్చిదిద్దాలి? అనే విషయంలో మీ అభిప్రాయాలను స్వీకరించడానికి, మీతో కలిసి పనిచేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. రేపటి భారతదేశం, మన తర్వాత తరం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి అనే నగరం మరోసారి చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఆంధ్రప్రదేశ్‌లో సృష్టించాలనేది మా లక్ష్యం. ఈరోజు ఇక్కడ ఉన్న 40 ఏళ్ల లోపు యువత నుంచి నేను కోరేది కూడా ఇద్దే అని నారా లోకేష్ వివరించారు.

# తెల్లారిన బతుకులు

>> మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బస్సు అతివేగంగా కంటైనర్‌ను ఢీకొనడంతో కంటైనర్‌లోని ఐరన్ పిల్లర్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో పాటు కొన్ని పిల్లర్లు బస్సులోకి చొచ్చుకుపోయాయి. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా ఆరుగురు మృతి చెందారు. ఘటనా స్థలంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోవడంతో భయానక వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును పోలీసులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పట్టణ, రూరల్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో కృష్ణా జిల్లా వంగటూరు మండలం తెలప్రోలు గ్రామానికి చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడ కానూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బొల్లిపోగు మేరీ జోష్ణ (29), పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన సురావరపు శకిన (24), కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం పడమటి లంకపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెన్నకేశవుల నాగేంద్రబాబు (31), విజయవాడ జయప్రకాష్ నగర్‌కు చెందిన పిడికిటి లక్ష్మి (30), విజయవాడ సింగ్ నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి కొండూరు భావన వర్ష (25) ఉన్నారు. కంటైనర్ డ్రైవర్, బస్సు డ్రైవర్ల ఆచూకీ తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## కోదాడ బస్సు ప్రమాదంపై సిఎం చంద్రబాబు విచారం

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** కోదాడ సమీపంలో జరిగిన బస్సు ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు.

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి**

సూర్యాపేట జిల్లాలోని కోదాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందిన ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెదడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలను అధికారుల ద్వారా పవన్ తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర అధికారులతో ఎపి యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి: మంత్రి లోకేష్**

సూర్యాపేట జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోదాడ దగ్గర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి మండిపల్లి**

సూర్యాపేట జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా అన్ని బస్సుల యాజమాన్యం, డ్రైవర్లు వ్యవహరించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.

# ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి

>> కల్పన చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో నియోజకవర్గాల డీలిమిటేషన్ వల్ల ఏర్పడే మార్పులను దృష్టిలో ఉంచుకుని, దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా భవన డిజైన్లను రూపొందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 265 శాసనసభ స్థానాలు, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా శాసనసభభవనాన్ని డిజైన్ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రజలు శాసనసభను సందర్శించినప్పుడు రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసన ప్రక్రియపై అవగాహన కలిగేలా, వారికి మంచి అనుభూతిని అందించే విధంగా ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గవర్నర్ ప్రసంగించే సందర్భాల్లో శాసనసభ, శాసనమండలి ఉభయ సభల సభ్యులందరూ ఒకే చోట కూర్చునేలా సెంట్రల్ హాల్ ఏర్పాటు చేసేవిధంగా డిజైన్ రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. శాసనసభ ప్రాంగణం పూర్తిగా ఆధునిక సౌకర్యాలతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగి ఉండాలని సిఎం సూచించారని తెలిపారు. అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి, పైభాగంలో పచ్చదనంతో కూడిన గార్డెన్ తరహా ప్రాంగణంగా అభివృద్ధి చేయాలన్నది సిఎం ఆలోచనగా మంత్రి వెల్లడించారు.



## ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** "చరిత్ర ఉన్న చోట పరిరక్షణ ఉండాలి. సంస్కృతి ఉన్న చోట అది మరింత శోభిల్లాలి" అనేది ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృఢ సంకల్పం. లక్షలాది భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు, ఆధ్యాత్మికత శోభాయమైన క్షేత్రంలో అభివృద్ధి ఉండాలి అన్నదే ఆయన లక్ష్యం. ఈ మేరకు డి.సిఎం కార్యాలయం కీలక ప్రకటన విడుదల చేసింది. పిఠాపురం నియోజకవర్గ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, ఆ వైభవాన్ని భవిష్యత్ తరాలకు మరింత ఘనంగా అందించాలనే ఆయన కార్యాచరణ ఇప్పుడు క్షేత్రస్థాయిలో రూపుదాలుస్తోందని తెలిపింది.. పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రత్యేక చొరవ తీసుకొని, నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి, భజన మందిరాల నిర్మాణం, కళ్యాణ మండపాల ఏర్పాటు కోసం ఏకంగా రూ.30.66 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఆయన నిరంతర పర్యవేక్షణలో ఈ అభివృద్ధి పనులు ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్నాయి.

### భక్తుల రద్దీకి తగ్గట్టు ఆలయాల ఆధునీకరణ

పిఠాపురం నియోజకవర్గంలోని 24 ప్రముఖ దేవాలయాల అభివృద్ధి కోసం రూ.17.06 కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులతో ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. గొల్లప్రోలు సీతారామస్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరింది. కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం కొత్తపల్లి వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల క్వార్టర్ల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. శ్రీ కుంతీ మాధవస్వామి ఆలయంలో కల్యాణ మండపం, రామకృష్ణాపూర్ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాజగోపుర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. శ్రీకుక్కుటేశ్వర స్వామి ఆలయానికి రూ.5 కోట్లు, శ్రీ పాద శ్రీవల్లభ దేవస్థానానికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు మొదలు కానున్నాయి. పునరుద్ధరణ జరుగుతున్న ఆలయాల్లో శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పిఠాపురంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన 10వ శతాబ్దం నాటి శ్రీ కుంతీమాధవ స్వామి ఆలయంతోపాటు, పిఠాపురం మహారాజుల కాలం నాటి అనేక పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్ట్ ద్వారా సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు ఏటా సుమారు 13.76 లక్షల నుంచి 18.07 లక్షల మంది భక్తులు వస్తుంటారు. సాధారణ రోజుల్లోనే కాకుండా పండుగలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. ఆయా పర్వదినాల్లో రోజుకు 20 వేల నుంచి ఏకంగా 50 వేల మంది వరకు భక్తులు తరలివస్తుంటారు. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు.

### అత్యాధునిక వసతులతో టీటీడీ కళ్యాణ మండపం

పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో గతంలో పాడా ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలో టీటీడీ కళ్యాణ మండపాన్ని అన్ని ఆధునిక వసతులతో పునర్నిర్మించారు. అలాగే, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ మాడ వీధుల విస్తరణ పనులను విజయవంతంగా పూర్తి చేశారు. ఇక ప్రస్తుతం యు.కొత్తపల్లి మండలంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. వివాహాలు, ధార్మిక కార్యక్రమాలు, ఇతర సామాజిక అవసరాలకు అనువైన అత్యాధునిక వసతులతో ఈ కళ్యాణ మండపాన్ని నిర్మించనున్నారు.

### భజన మందిరాలతో పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ



కాకినాడ జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో 419 భజన మందిరాలను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో తొలి దశలో 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ భజన మందిరాలు కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా భజనలు, ఆధ్యాత్మిక సమావేశాలు, స్థానిక సాంస్కృతిక వేడుకలు, గ్రామస్థాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నారు. మొత్తంగా రూ.30.66 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు పిఠాపురం ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణతోపాటు ఆలయాల ఆధునీకరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, గ్రామీణ సామాజిక వేదికల బలోపేతానికి దోహదపడనున్నాయి.

# వర్షాభావ పరిస్థితుల్లోనూ ఖరీఫ్ సాగుకు ప్రత్యేక చర్యలు

- ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక
- 20.35 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు, పప్పుధాన్యాల సాగులో 23.6శాతం వృద్ధి
- పంటల బీమా పరిధి 108శాతం పెరుగుదల
- రైతుల కోసం ఇంతటి ముందస్తు ప్రణాళిక జగన్ పాలనలో ఎక్కడుంది?: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగును ఎక్కడా విఘాతం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు చేపట్టిందని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ఇబ్బంది కలగకుండా నిరంతరం పనిచేస్తుంటే, వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే తగదని అన్నారు. రైతు గురించి మాట్లాడే ముందు జగన్ తన ఐదేళ్ల పాలనను ఒకసారి గుర్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. 2026 జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు 25వరకు రాష్ట్రంలో 192.8మి.మీ. వర్షపాతం నమోదైందని, ఇదే కాలానికి సాధారణ వర్షపాతం 393.7మి.మీ. కాగా, సాధారణంతో పోలిస్తే 51శాతం లోటు నమోదైందని మంత్రి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ పప్పు ధాన్యాల సాగులో 23.6శాతం వృద్ధి నమోదు కావడం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికకు నిదర్శనమని మంత్రి అన్నారు. గత ఏడాది ఆగస్టు 25 నాటికి పప్పుధాన్యాల సాగు 2.16 లక్షల హెక్టార్లు కాగా, ఈ ఏడాది అదే తేదీ నాటికి 2.66 లక్షల హెక్టార్లకు పెరిగిందని తెలిపారు. పంటల వారీగా కంది 1.92 లక్షల హెక్టార్ల నుంచి 2.30 లక్షల హెక్టార్లకు, మినుము / బ్లాక్‌గ్రామ్ 0.17 లక్షల హెక్టార్ల నుంచి 0.30 లక్షల హెక్టార్లకు, పెసలు 0.041 లక్షల హెక్టార్ల నుంచి 0.061 లక్షల హెక్టార్లకు, సోయాబీన్ 0.048 లక్షల హెక్టార్ల నుంచి 0.100 లక్షల హెక్టార్లకు పెరిగినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రధాన పంటల సాగు విస్తీర్ణం వరి 10.37 లక్షల హెక్టార్లు, కంది 2.30 లక్షల హెక్టార్లు, వేరుశనగ 1.37 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.00 లక్షల హెక్టార్లు, మినుము 0.30 లక్షల హెక్టార్లు, పెసలు 0.061 లక్షల హెక్టార్లుగా ఉందని తెలిపారు. పత్తి సాగు కూడా గత ఏడాది 25.08.2025 నాటికి 3.96 లక్షల హెక్టార్లు ఉండగా, ఈ ఏడాది 3.97 లక్షల హెక్టార్లకు చేరిందని, స్వల్ప పెరుగుదల నమోదైందని మంత్రి చెప్పారు. సాధారణ సీజన్ లక్ష్యం 5.15 లక్షల హెక్టార్లు అని తెలిపారు. నెల్లూరు, తిరుపతి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే అధిక స్థాయిలో నమోదైందన్నారు.





**ఫిబ్రవరి నుంచే ఎల్‌నినోపై అప్రమత్తం:** ఎల్‌నినో గురించి కేంద్రం అలర్ట్ చేసినప్పటి నుంచే, అంటే ఫిబ్రవరి 2026 నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించామని చెప్పారు. నీటిని ఎక్కువగా వినియోగించే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఖరీఫ్ 2026కు సంబంధించి జిల్లాల వారీగా కరువు నివారణ ప్రణాళికలు రూపొందించామని మంత్రి చెప్పారు.

**పేరుకే ఉచిత పంటల బీమా.. కానీ రైతులకు చేసింది అంతా మోసం:** "జగన్ హయాంలో ఐదేళ్లలో ఒక్క రబీ సీజన్‌లో కూడా ఒక్క రైతుకు ఒక్క పైసా పంటల బీమా పరిహారం ఇవ్వలేదు. ఖరీఫ్‌లో కూడా ఐదేళ్లలో కేవలం రెండేళ్లు మాత్రమే ప్రీమియం చెల్లించి, మూడు సంవత్సరాలు ప్రభుత్వం తన వాటా ప్రీమియం కూడా చెల్లించలేదు. రైతులకు ఉచిత పంటల బీమా అని ప్రచారం చేసుకోవడం తప్ప, ఆచరణలో రైతులకు బీమా భరోసా కల్పించలేదు. ఇదేనా రైతుల పట్ల మీకున్న చిత్తశుద్ధి జగన్ ?. రైతులపై పంటల బీమా ప్రీమియం చెల్లించాలంటూ తమ ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడి తీసుకు రావడం లేద్దు అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులపై భారం మోపడం తమ ప్రభుత్వ విధానం కాదని, అత్యల్ప ప్రీమియంతో స్వచ్ఛందంగా పంటల బీమాలో చేరేలా రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జగన్ నీ హయాంలో రైతుల పంటలకు బీమా భరోసా ఏమైంది? అని మంత్రి ప్రశ్నించారు. రైతుల నుంచి ప్రీమియం వసూలు చేయడమే తప్ప, ప్రభుత్వం తన వాటా ప్రీమియాన్ని సక్రమంగా చెల్లించని పరిస్థితి మీ పాలనలో ఎందుకు ఏర్పడిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుపై భారం వేయడం మా విధానం కాదు... రైతుకు భరోసా ఇవ్వడం మా విధానం. రైతుల పంటకు బీమా రక్షణ, రైతు కుటుంబానికి భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# రేపు సంపూర్ణ చంద్రగ్రహణం

## భారత్ సహా ఆసియా దేశాల్లో కనిపించదు..

## అదే రోజు రక్షాబంధన్ వేడుక



చంద్ర గ్రహణంపై నాసా విడుదల చేసిన ఫోటో


**హైదరాబాద్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీన ఆకాశంలో మరో ఖగోళ అద్భుతం ఆవిష్కృతం కానుంది. హైందవ సాంప్రదాయంలో ఎంతో ముఖ్యమైన రక్షా బంధన్, శ్రావణ శుక్రవారం సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్ప డనున్నది. అయితే ఉదయం వేళ చంద్ర గ్రహ ణం ఏర్ప డనుండడంతో భారత్ సహా ఆసియా దేశాల్లో ఇది కనిపించదు. ఉత్తర, దక్షిణ, మధ్య అమెరికాలో పూర్తిగానూ యూరప్, ఆఫ్రికాలో దేశాల్లో పాక్షికంగానూ ఈ గ్రహణం కనువిందు చేయనుంది. ప్రపంచ వ్యాప్తంగా 44 శాతం మంది ప్రజలు ఈ గ్రహణాన్ని వీక్షించే అవకాశం వుందని అంతరిక్ష పరిశోధన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఏడాది రెండవ సంపూర్ణ చంద్ర గ్రహణం శుక్రవారం ఏర్పడనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం ఆరుగంటల 53 నిమిషాలకు గ్రహణం మొదలై మధ్యాహ్నం 12.32 గంటలకు ముగుస్తుంది. పాక్షికంగా కనిపించడం ఉదయం 8.04గం టలకు మొదలవుతుంది. ఉదయం 9.43 గంటలకు పూర్తిగా కనిపిస్తుంది. ఉదయం వేళ అయినందున భారత్ సహా ఆసియా దేశాల్లో ఈ గ్రహణం కనిపించదు. ఈ గ్రహణం ఉత్తర, దక్షిణ, మధ్య అమెరికాలో పూర్తిగా కనిపించనుంది. న్యూయార్క్‌తో పాటు అట్లాంటా, మియామీ, చికాగో, డల్లాస్, హౌ స్టన్, లాస్ఎంజిల్స్, సీట్టల్ నగరాలలో పూర్తిగా కనిపించనుండడంతో గ్రహణాన్ని అన్ని కోణాల్లో వీక్షించేందుకు శాస్త్రవేత్తలు ఇప్పటికే అక్కడకు చేరుకున్నారు. ఇదే సమయంలో యూరప్‌లోని స్పెయిన్, పోర్చుగల్ సహా ఆఫ్రికా దేశాలలో చంద్ర గ్రహణం పాక్షికంగా కనిపించనుంది. భార త్‌లో చంద్రగ్రహణం కనిపించనందున ఇక్కడ సూతక్ కాలం వుండదని ఆగమన పం డితులు చెబుతున్నారు. ఈ గ్రహణం కుంభ రాశిలో శతబిషా, ధనిష్టా నక్షత్రాల పరిధిలో ఏర్పతుం దని, ఈ నక్షత్రాల వారు ఆలయాల్లో పూజలు చేయించడం మం చిదని పండితులు చెబుతున్నారు. సూతక్ కాలం భారత్‌లో లేనం దున శ్రావణ శుక్రవారం పూజలు చేయవచ్చని, రక్షాబంధన్ పండగ జరుపుకోవచ్చని వారు తెలి పారు. గ్రహణం రోజున మనకు ఎలాంటి భద్రకా లంవుండబోదని పండితులు తెలిపారు. ఈ ఏడాది మార్చి మూడవ తేదీన సంభవించిన సంపూర్ణ చంద్ర గ్రహణం భారత్‌లో ముగింపు సమ యం లో పాక్షికంగా కనిపించడం తెలిసిందే. దీని తరు వాత వచ్చే ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుండగా ఇది కూడా భారత్‌లో కనిపించబోదు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు తెలంగాణ యువకుల మృతి

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** అమెరికా లోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ యువకులు దుర్మరణం చె ందారు. భారత కాలమానం ప్రకారం మంగళ వారం అర్థరాత్రి దాటిన తరువాత (అమెరికాలో ఉదయం పది గంటల సమయం) ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ఒకరిని నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన రాహుల్ (30)గా గుర్తించగా మిగతా ఇద్దరిని ఇంకా గుర్తించలేదు. వివరా లు ఇలావున్నాయి. ఫ్లోరిడాలోని ట్రెవార్ట్ కౌంటిలో ఇంటర్‌స్టేట్ 95 (ఐ..95) జాతీయ రహదారిపై ముగ్గురు యువకులు తాము పనిచేస్తున్న ప్రాం తం నుంచి కారులో మరోచోటికి వెళుతుండగా పామ్ టీ ప్రాంతంలో 172 మైలురాయి వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టు ను ఢీకొంది. ఈ ఘటనలో కారుకు మంటలు అంటుకోగా అందులో చిక్కుకున్న ముగ్గురిలో ఇద్దరు ఘటనా స్థలంలోనే మరణించగా మూడవ వ్యక్తి ఆసుపత్రిలో చనిపోయాడు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్థానికులు బాధితులను ఆసు పత్రికి తరలించేందుకు పోలీసులకు సహాయం అందించారు. మృతుల్లో ఒకరైన రాహుల్ నిజా మాబాద్ జిల్లా నవీపేట మండలం నారాయణ పూర్ (నాడాపూర్) గ్రామానికి చెందినవాడు. హరిబాబు, నాగమణి దంపతుల కుమారుడైన రాహుల్ మూడు నెలల క్రితమే ఉన్నత చదు వులకోసం అమెరికాకు వెళ్లాడు. బుధవారం తెల్ల వారుజామున తనకు ప్రమాదం గురించి ఫోన్ వచ్చిందని రాహుల్ తండ్రి హరిబాబు మీడి యాకు తెలిపారు. కాగా మిగతా ఇద్దరిని గుర్తిం చేందుకు అమెరికాలోని తెలుగు సాంస్కృతిక సంస్థ తానా సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పాటు ముగ్గురి మృతదేహాలను భారత్‌కు పంపేందుకు వారు దౌత్య అధికారులతో సంప్రదింపులుజరుపుతున్నారు.కాగా ఈఘటన రాష్ట్రం లోని ఆయా ప్రాంతాలలో విషాదం నింపింది.

## మంగళగిరిలో అధునాతన మోడల్ రైతు బజార్

- రూ.18.కోట్లతో 5.90 ఎకరాల్లో నిర్మాణం
- నేడు మంత్రి లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామిక పురోగతికి, మౌలిక వసతుల కల్పనకు ఈ ప్రాంతం కేరాఫ్ అడ్రస్‌గా మంగళగిరి మారుతోంది. ప్రజాదరణతో పాటు పరిపాలనా దక్షత తోడవడంతో మంగళగిరి నియోజకవర్గం సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ వద్ద మోడల్ రైతు బజార్ నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. ఆధునిక హంగులతో చేపట్టే రిటైల్ అండ్ హోల్ సేల్ వెజిటబుల్ మార్కెట్ నిర్మాణ పనులకు గురువారం మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు.

**రూ.18 కోట్లతో 5.90 ఎకరాల్లో నిర్మాణం**



మంగళగిరిలో ఏర్పాటుచేయనున్న మోడల్ రైతు బజార్‌ను 5.90 ఎకరాల విస్తీర్ణంలో రూ.18 కోట్ల అరబిందో ఫార్మా ట్రస్ట్ సిఎస్ఆర్ నిధులతో నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో పరిశుభ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌ను నిర్మించనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 71,925 చదరపు అడుగులుగా ఉండనుంది. రిటైల్ మార్కెట్‌లో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాల కోసం 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటుచేయనున్నారు. ఇతర రకాల వస్తువుల కోసం మొత్తం 60షాపులు ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా హోల్‌సేల్ మార్కెట్‌లో అన్ లోడింగ్ ప్లాట్ ఫామ్స్ 18, కూరగాయల షాపులు 23 ఉండనున్నాయి. 61.4 చ.మీల విస్తీర్ణంలో కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాస్, 144.6 చ.మీ విస్తీర్ణంలో అడ్మిన్, మెయింటెనెన్స్ ఏరియాస్, 190 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్యాంటీన్, ప్రజల కోసం 130 చ.మీల విస్తీర్ణంలో మరుగుదొడ్లు నిర్మించనున్నారు. సరుకులు తరలించే వాహనాలు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కోసం పార్కింగ్ సౌకర్యం ఏర్పాటుచేయనున్నారు. వాటర్ సంప్, ఓవర్ హెడ్ ట్యాంక్, సెప్టిక్ ట్యాంక్, ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్, గార్బేజ్ కలెక్షన్, ఆర్గానిక్ కన్వర్టర్, టెర్రస్ సోలార్ ఎనర్జీ ప్యానల్స్ వంటి సదుపాయాల కోసం ప్రత్యేక స్థలం కేటాయించారు.



# వరద కల్లోలం

# నేపాల్ అతలాకుతలం



- పొంగిపొర్లిన భోటెకోశి నది
- కొట్టుకుపోయిన పలు గ్రామాలు
- 400 మందికి పైగా మానస సరోవర్ యాత్రికుల గల్లంతు
- 133 మంది భారతీయుల కోసం అన్వేషణ
- ఆకస్మిక వరదల ముందు భూకంపం కూడా
- మృతులు 95మందిపైనే..
- నేపాల్ ప్రధానికి నరేంద్ర మోడీ ఫోన్
- అండగా ఉంటామని భరోసా

**కాఠ్మండు, ఆగస్టు 26:** టిబెట్ సరిహద్దుల్లో ఉన్న నేపాల్‌లోని రాసువా జిల్లాను మెరుపు వరదలు ముంచెత్తాయి. మానస సరోవర్ యాత్ర, గోసైంకుండ యాత్రలకు కీలకంగా రాసువా జిల్లా ఉంది. రాసువా జిల్లా మీదుగానే ఈ యాత్రలకు విదేశీయులు వెళ్తుంటారు. మెరుపు వరదలు వచ్చే ముందు టిమురే, స్యాబ్రుబేసి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో విదేశీ టూరిస్టులు ఉన్నారు. మానస సరోవర్ యాత్రకు వెళ్తున్న 400 మందికి పైగా యాత్రికులు గల్లంతైనట్లు తెలుస్తోంది. వీరిలో 133 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు వెల్లడించిన వివరాలప్రకారం ఇప్పటివరకూ 95 మంది మృతిచెందినట్లు తేలింది. వరద ధాటికి భోటేకోశి నది పరివాహక ప్రాంతాలు, నది ఒడ్డున ఉన్న గ్రామాలు తుడిచి పెట్టుకుపోయాయి. తిమురే బజార్, సరిహద్దు కస్టమ్స్ ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. వాహనాలు, సరకుల రవాణా వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి. గతేడాది వరదల తర్వాత పునర్నిర్మించిన రసువాగఢి ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జ్ కూడా ఈ వరదల్లో తుడిచిపెట్టుకుపోయింది. మూడు నేపాల్ పోలీస్ కార్యాలయాలు దెబ్బతిన్నాయి. టిబెట్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మంది ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది గల్లంతయ్యారు. వరదల కారణంగా 11 జల విద్యుత్ కేంద్రాలు నాశనమయ్యాయి. సుమారు 430 మెగావాట్ల విద్యుత్ సరఫరా ప్రభావితంనేపాల్‌లో భోటేకోశి నది పెను విధ్వంసాన్ని సృష్టించింది. టిబెట్ సరిహద్దుల్లో ఉన్న నేపాల్ జిల్లాల్లో ఒక్కసారిగా నది ఉప్పొంగటంతో అనేక గ్రామాలు, వంతెనలు కొట్టుకుపోయాయి. మరోవైపు, ఈ నది ప్రవాహం దిగువన ఉన్న భారత్ లోని బీహార్, యూపీల్లోకి వచ్చే ప్రమదం ఉండటంతో ఆయా రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కోసి, గండర్ నదుల ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. నేపాల్ జలప్రళయానికి ముందు భూకంపం సంభవించినట్లు తెలుస్తోంది. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం, ఈ ఘటనకు సుమారు ఏడు నిమిషాల ముందు 4.4తీవ్రతతో భూకంపం సంభవించింది. ఫ్లాష్ ఫ్లడ్స్‌కు 7నిమిషాల ముందు భూకంప వచ్చినట్లు తెలుస్తోంది. భూప్రకంపనలతో చైనాలోని టిబెట్ ప్రాంతంలోని హిమాలయాల్లో ఉన్న సుప్రాగ్లేషియల్ సరస్సు బద్ధలవ్వడంతోనే ఒక్కసారిగా లెహెండే ఖోలా నదిలో ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగినట్లు తెలుస్తోంది. ఈ నదికి దిగువనే ఉన్న భోటేకోశి నదిలోకి నీరు పోటెత్తడంతో వరద విరుచుకుపడింది. ఉత్తరగయ గ్రామీణ మునిసిపాలిటీ ఉపాధ్యక్షురాలు చమేలీ గురుంగ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్యాఫ్రూబెసి, బెత్రావతి, మైలుంగ్, సల్లెతార్, శాంతిబజార్, పైరెబెసి, ఖాల్తీ బస్తీ, సోలే, త్రిశూలి, బట్టార్ వంటి దాదాపు డజనుకు పైగా గ్రామాలు ఈ హఠాత్ వరద దాటికి గురయ్యాయి. నేపాల్‌లో భోటేకోశి నది పెను విధ్వంసాన్ని సృష్టించింది. ఒక్కసారిగా వచ్చిన మెరుపు వరద నేపాల్‌లోనే గ్రామాలకు గ్రామాలనే కబళించింది. వందలాది మంది గల్లంతయ్యారు. భారత్‌లో కూడా వరద ప్రభావం కనిపించే అవకాశం ఉంది. నేపాల్ ఆర్మీ చీఫ్ వెల్లడించిన సమాచారం ప్రకారం ఈ ఫ్లాష్ ఫ్లడ్స్ వల్ల సుమారు 4,000 మందికి పైగా ప్రజలు తీవ్రంగా ప్రభావితులయ్యారు. పరిస్థితి అత్యంత గంభీరంగా మారడంతో నేపాల్ రెడ్ క్రాస్ తన ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను వెంటనే అప్రమత్తం చేసి, సహాయక చర్యల్లోకి దించింది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. మరోవైపు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, నదీపరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలకు దూరంగావెళ్లి ప్రభుత్వఆదేశాలను పాటించాలని సూచించారు.

### నేపాల్ ప్రధాని బాలెన్ షా అత్యవసర సమావేశం

నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా పరిస్థితిని సమీక్షించేందుకు నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీతో అత్యవసర సమావేశం నిర్వహించారు. వైద్య బృందాలు, స్కౌట్స్, రెడ్ క్రాస్‌తో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. నేపాల్ పోలీసులు ప్రజలను నదీ పరివాహక ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని హెచ్చరించారు. భోటెకోషి నదిలో టిబెట్ వైపు నుంచి భారీగా వరద నీరు ప్రవేశించడంతో త్రిశూలి నది పరివాహక ప్రాంతంలోని నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా తదితర జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

### నేపాల్ ప్రధానికి ప్రధాని మోడీ ఫోన్

నేపాల్ వరద విధ్వంసంపై ఆ దేశ ప్రధాని బాలెన్ షాకు, భారత ప్రధాని నరేంద్రమోడీ ఫోన్ చేశారు. నేపాల్‌లో వరదల కారణంగా జరిగిన ప్రాణనష్టం పట్ల సంతాపం తెలిపారు. నేపాల్‌కు సాధ్యమైనంత మానవతా సహాయం, సహాయక మద్దతు అందిస్తామని మోడీ హామీ ఇచ్చారు. భారత్ ఖాట్మండులో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.

### యుపి, బీహార్ రాష్ట్రాలకు రెడ్ అలర్ట్...

నేపాల్ వరదలు భారతదేశంలో భయాన్ని పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా బీహార్ రాష్ట్రానికి పెను ప్రమాదం పొంచిఉంది. నేపాల్ వరదలకు కారణమైన భోటేకోశి నది టిబెట్‌లో పుట్టి నేపాల్ మీదుగా భారత్‌లోకి ప్రవేశిస్తుంది. బీహార్‌లో దీనిని కోసి నదిగా పిలుస్తారు. కోసి నదిని బీహార్ దుఃఖదాయినిగా పిలుస్తారు. ఈ నది కారణంగా బీహార్ ప్రాంతంలో తరుచుగా వరదలు రావడం, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటం వల్ల దీనికి ఈ పేరు వచ్చింది. నేపాల్ వరదల నేపథ్యంలో బీహార్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు భారీగా పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నేపాల్ నుంచి భారత మైదాన ప్రాంతాల్లోకి ప్రవేశించే నదుల్లో గండక్(నారాయణి), కోసి నదుల ఉన్నాయి. బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చైదరి మాట్లాడుతూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సీఎస్, డీజీపీలతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. అవసరమైతే ప్రభావిత ప్రాంతాలకు తానే వెళ్తానని చెప్పారు. నదీ ప్రవాహక ప్రాంతాల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని మహారాజగంజ్, కుషీనగర్ జిల్లాలను అప్రమత్తం చేసినట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. గండక్, నారాయణి నదులకు వరద పెరిగే అవకాశం ఉంది.

నేపాల్‌లో వరదల వల్ల జరిగిన విధ్వంసం ఆందోళనకరంగా ఉందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. గండక్, నారాయణి నదులలో నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉన్నందున, మహారాజ్‌గంజ్, కుషినగర్‌లోని స్థానిక యంత్రాంగాలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులను ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని యోగి ఆదిత్యనాథ్ కోరారు.


వార్త

మౌనం మనసుకు, శరీరానికి విశ్రాంతినిస్తుంది, విశ్రాంతిని మించిన ఔషధం లేదు.

\- బార్బడోస్

# ప్రాణాలతో చెలగాటమేనా?

విశ్వామిత్ర సృష్టిలో తాము కూడా చేరిపోవాలని నకిలీ డాక్టర్లు ఉవ్విళ్లూరుతున్నారు. కానీ కర్మవశాన వారిలో కొందరు దొరికిపోయారు. హైదరాబాద్ సిటీలో తాజాగా 12 మంది నకిలీ డాక్టర్లు అరెస్టవడం జనం కలవరపడే విషయం. కేవలం నర్సుగానో, కాంపౌండరుగానో ఉన్న పూర్వ అనుభవంతో డాక్టర్‌గా ప్రాక్టీసు మొదలెట్టే ఆర్ఎంపిల గూర్చి తెలుగు రాష్ట్రాలకు బాగా తెలిసిందే. వాళ్లే ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్లుగా చలామణి అయిపోతున్నారు. అసలు సిసలు డాక్టరు కోర్సులు కోట్లాది రూపాయలు పెట్టి చదివినవారెవరూ గ్రామీణ ప్రాంతాలకు ప్రాక్టీసు చేయరు. బహు అరుదు. గ్రామీణ ప్రాంతాల్లో తీసుకోదగిన ఫీజులూ తక్కువే. ఆధునిక వైద్య పరిజ్ఞానంతో రూపొందించబడిన వైద్య చికిత్సా పద్ధతులు, పెద్దపెద్ద ఖరీదైన విదేశీ ఎం.ఎఆర్.ఐ దయాగ్నస్టిక్ విధాన పరికరాలను తెచ్చి పెట్టుకోవాలని ఏ డాక్టరూ సాహసించరు. అందుకే ఏ వృక్షమూ ఎదగని చోట ఆముద వృక్షమే మహావృక్షమన్న చందాన గ్రామీణ ప్రాంతాల అత్యవసర వైద్యానికి అందుబాటులో ఉండేది ఆర్ఎంపి డాక్టర్లే అన్న నిజం అందరికీ తెలిసిందే. అయితే వారు చేసిన వైద్యం వికటించిన సందర్భాలు లేకపోలేదు. కొన్నిసార్లు అనవసర వైద్య చికిత్సల్లో చేయిపెట్టి తర్వాత క్రిమినల్ కేసులు, ఇతరత్రా సంబంధిత చిక్కుల్లో ఇరుక్కుపోవడం చూస్తూనే ఉన్నాం. రానురాను ఈ కాంపౌండర్ డాక్టర్ల ధోరణిలో పట్టు తప్పిపోవడం గమనిస్తేనే ఉన్నాం. హైదరాబాద్ నగరంలో ఎంతో విచిత్రంగా 'అర్హతలేని నకిలీ డాక్టర్ల' వ్యవస్థ ఒకటి చాన్నాళ్లుగా వేళ్లూనుకుపోయి ఉంది. తాజాగా కొంతమంది నకిలీ డాక్టర్లను సిటీ పోలీసులు పట్టుకుని వారి గుట్టువిప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంపౌండరుగా ఉన్న అనుభవంతో ఆడపాదడపా అత్యవసర చికిత్సకు అందుబాటులోకి రావడమనే యోచనకు భిన్నంగా కొంతమంది అసలుసిసలు ఎంబిబిఎస్ డాక్టర్ల వలె నకిలీ డిగ్రీలతో క్లినిక్‌లు నడపడం ఒక ఎత్తయితే, సిటీలో తెల్లకోటు వేషాలతో నిరంతరం పేషంట్‌ల సేవలో తరిస్తున్న వారూ లేకపోలేదు. అన్నీ మంచిగా జరిగినంత సేపు అంతాబాగే, చేసే చికిత్స బెడిసికొట్టిందంటే వారు చేస్తున్న ప్రాక్టీసును స్వాగతించేవారు ఉండరు. హైదరాబాద్ సిటీలో ఈ వారంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక టాక్స్‌ఫోర్స్ దాడుల్లో 12 మంది నకిలీలను పట్టుకున్నారు. పేషంట్లను నమ్మించి వైద్యసేవలు అందించడమే వారి సేవాదృక్పథం. కొందరైతే భారీ ఎత్తున క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు వారే రోగులకు సెలైన్‌లు ఎక్కించడం, ఇంజెక్షన్లు, మందులు ఇస్తూ అసలు సిసలు డాక్టర్ల వలె రోగులతో కలిసిపోవడం వల్లనే వాళ్లు 'నకిలీ'లనే డాక్టర్లెవరూ అనుమానించే పరిస్థితి రావడం లేదనీ తెలుస్తోంది. పోలీసు రికార్డులు పరిశీలిస్తే 'నకిలీ వైద్యుల నిజస్వరూపం బట్టబయలవుతుంది. 2019లో హైదరాబాద్‌కు వచ్చి అంబర్‌పేటలో క్లినిక్ ప్రారంభించిన రాజుగంగారాం అనే వ్యక్తి 2024లో పట్టు బడ్డాడు. యోగా, నేచురోపతి, ఎమెర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 'డిప్లొమో కోర్సులు చేసినట్లుగా కొన్ని సర్టిఫికెట్లున్నప్పటికీ చట్టబద్ధమైన వైద్య డిగ్రీ లేదు. ఈవ్యక్తి ఇలాంటి కేసుల్లో ఇంతకు ముందే రెండుసార్లు అరెస్టయినా, పదే పదే ఆ వృత్తినే చేస్తున్నాడు. ఇలా ఎందుకు జరుగుతోంది అని ఆలోచిస్తే పోలీసుల నిరంతర తనిఖీ లేకపోవడమే. సర్వాంగులూ ఉన్న క్లినిక్‌లలో తమ మేధస్సు అనుభవంతో వైద్యసేవలు అందిస్తున్న మకిలి వ్యవస్థ మరొకటి ఈ వైద్య వ్యవస్థలో ఒకటిగా మనగలుగుతోంది. గచ్చిబౌలిలోని హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, ప్లాస్టిక్ కేంద్రంలో రిసెప్షనిస్ట్‌గా పనిచేసిన అస్లాం షఫీ సయ్యద్ విషయం మరో భయంకర సత్యాన్ని బయటపెడుతుంది. తనే ఓ ప్రసిద్ధి చెందిన 'స్కిన్ డాక్టర్'గా ప్రకటించుకుని ఇంటి వద్దనే 'లైపోమా' చికిత్స మొదలెట్టేసాడు. ఇది మరీ ప్రమాదకరం. రోగికి చికిత్స అందివ్వగల ఏ వైద్య అర్హత అతనికి లేదు. పది మంది తిరిగేచోట వారిని నమ్మిస్తున్న 'క్లినిక్'ను నడుపుతూ ఎవరికీ ఏ అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నారంటే తప్పు అతనిది కాదు. నిరంతర నిఘా వ్యవస్థ నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనం. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రికార్డులు పరిశీలిస్తే మరికొన్ని 'క్వాక్' క్లినిక్‌ల బండారం బయటపడ్తోంది. 2025 మే 21న రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో 'క్వాక్' క్లినిక్‌ల మీద దాడి చేసి లైసెన్స్ లేకుం డా విక్రయిస్తున్న మందుల నిల్వలను కూడా పట్టుకున్నారు. అంతకన్నాముందు 2024జనవరి నుంచి 'క్వాక్' క్లినిక్‌లను పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినా ఈ తరహా 'క్లినిక్'ల నిర్వహణ యాజమాన్యం ఏమాత్రం తగ్గలేదు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశాల విషయంలో కూడా ప్రభుత్వ నిఘా, తనిఖీ చర్యల్లో డొల్లతనం చెప్పుకోవాల్సిందే. ఒక నకిలీ డాక్టర్ తనకున్న అనుభవం చాలక వైద్యచికిత్సల్లో చేయిపెడితే మనిషి చూపుపోవచ్చు. అవయవాలు నిరుపయోగం కావచ్చు. పనిచేయకపోవచ్చు. ఏమాత్రం వ్యవస్థ పట్ల భయం లేకుండా రోగి వైద్యంలో ఏదైనా తేడా జరిగి పట్టుబడితే శంకరగిరి మాన్యాలు తప్ప వని గానీ, శ్రీకృష్ణ జన్మస్థానాన్ని చూడాల్సి వస్తుందని తప్పవని ఎందుకు భయం వేయదో అర్థంకాదు. వారికి చట్టం అంటే భయం లేదని అనుకోవాలా? తమనెవరూ పట్టుకోలేరని భ్రమలో ఉంటారా? అందుకే ఇలాంటి క్లినిక్‌లపై నిరంతర నిఘా ఉంచటం అవసరం. ఈ నకిలీ డాక్టర్లు తమకున్న చిన్నపాటి అనుభవంతో క్లినిక్‌లు తెరవడమే కాకుండా తాము చేసే చిన్నాచితక వైద్యంలో పరిస్థితులు చేయిదాటిపోతే ఆయా పేషంట్లను ఏదో చెప్పి కార్పొరేట్ ఆసుపత్రులకు పంపేస్తున్నారు. ఆ మాత్రపు ఆర్థిక స్తోమత లేకనో, దగ్గర్లో ఉన్న ఆర్ఎంపిలనో 'క్వాక్' క్లినిక్‌లనో ఆశ్రయించే సాధారణ రోగులకు ప్రాణం మీదకు వస్తే కార్పొరేట్ ఆసుపత్రులు కూడా తమకున్న పరిధిలో కాపాడలేకపోవచ్చు. మరి వారి ప్రాణాలు గాలిలో దీపాలేనా?



స్పష్టత లేకుండా దారితప్పి మాట్లాడటం కంటే మౌనం పాటించడం ఉత్తమం.

రమణమహర్షి



ఈ లోకానికి కొత్తవాళ్లంగా వస్తాం, అతిథుల్లా ఉంటాం, స్నేహితుల్లా వెళ్లిపోతాం.

రవీంద్రనాథ్ టాగూర్

# ప్రజావాక్కు

### ఆరోగ్యమే మహా భాగ్యం

"అత్యాశతో సంపాదనే జీవితమని భావించిన కొందరు హైరానా పడి సర్వ రోగాలతో సతమౌతుంటారు. కాని అక్రమ సంపాదనకు ఎగబడటం మానరు. ఒక్కొక్కరి మానసిక స్థితి ఒక్కొక్కలా ఉంటుంది. ఆరోగ్యముంటేనే జీవితానికి అందం. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. ఆరోగ్యం లేని సంపదలెన్నున్నా నిరుపయోగమే. "అజీర్ణే భోజనం విషం' ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలి, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి, తగినంతనీరు త్రాగాలి, ప్రశాంతమైన నిద్రను పొందాలి. ఇవి శరీరానికి శక్తినిచ్చి, రోగాల నుండి కాపాడతాయి. ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తూ సమతుల ఆహారంలో భాగంగా తాజా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు తృణధాన్యాలు తీసుకొని జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. రోజుకు తగినన్ని నీళ్ల త్రాగడం ద్వారా శరీరం హైడ్రేటిక్‌గా ఉంచుకోవచ్చు. ప్రతిదినం నడక లేక ఇష్టమైన పనులతో శారీరక శ్రమ, వ్యాయామం అవసరం. 7నుంచి 8గంటల గాఢమైననిద్ర ఉండేలా చూసుకోవాలి. ధ్యానంతో మనసును ఏకాగ్రతలోకి తెచ్చుకోవచ్చు.

\- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ ప్రజల సమిష్టి బాధ్యతని ప్రజలు, పౌరులు కలిసిఆకుపచ్చ గ్రామాలుగాపట్టణాలలో మొక్కలు నాటడం, ఇంటింటికి తిరిగి బట్టల సంచులు పంపిణీ చేయడం వంటి పనులు చేయాలి. దీంతో భావితరాలకు మంచి వాతావరణం అందించటంతోపాటు ప్రస్తుత వాతావరణం కాలుష్యం నివారణతో పాటు, వర్షాలు పడి పాడి పంటలతో సమాజాభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రతి మనిషి సుమారు 7నుంచి 8మొక్కలునాటితే వారికి జీవితాంతం సరిపోయే ప్రాణవాయువు లభిస్తుంది.

\- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### గ్రామ సభలు నిర్వహించాలి

గ్రామంలోని సమస్యల దృష్ట్యా ప్రతి గ్రామంలో రెండు నెలలకొకసారి గ్రామ సభ ఏర్పాటు చేయాలి. ఏదేని కారణాల దృశ్య వాయిదాపడినా తిరిగి వారంలోగా నిర్వహించాలి. గ్రామసమస్యలను ప్రజలతో చర్చించి సమస్యలను అధిగమించే విధంగా కృషి చేయాలి. ఎవరైనా గ్రామ పంచా యతీ కార్యదర్శి గారు ప్రజల మౌనాన్ని ఆసరాగా చేసుకోవద్దు. ఎక్కడైనా జరిగితే ఫిర్యాదు చేయండి.

\-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### నైపుణ్య విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో యువత, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి ప్రాధాన్యం ఇవ్వడం సమయోచితమైనదే. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాల స్వరూపం కూడా వేగంగా మారుతోంది. ఈమార్పులకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం ఇప్పుడు విద్యా వ్యవస్థ ముందున్న ప్రధాన బాధ్యత. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న వేగానికి, కార్మికుల నైపుణ్యాలు కూడా సమానంగా అభివృద్ధి చెందేలా చర్యలు అవసరం. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నవీకరించాలి. విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, శిక్షణ సంస్థలు కలిసి కోర్సుల రూపకల్పనలో భాగస్వాములుకావాలి. పుస్తక పరిజ్ఞానంతోపాటు ప్రాయోగిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం యువతకు అందాలి. అప్రెంటిస్‌షిప్‌లు, ఉద్యోగ ప్రదేశంలో శిక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వడంతో ఉపాధికి మారేదశను సులభతరమవుతుంది.

\- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### భక్తి,భుక్తి

ప్రసాదం చేతిలోపడగానే మహాప్రసాదం స్వామి అంటూ కళ్ల కద్దుకుని నోట్లో వేసుకోవడం ఆనవాయితీ. మనదగ్గర ఉన్నన్నిదేవాలయాలు ఇతర దేశాలలో లేవంటే అతివయోక్తి కాదు. నిత్యం భక్తిపారవశ్యంలో మునిగి తేలుతున్న వారు కోకొల్లలు. దేవునిసన్నిధిలో సంప్రదాయానికి పెద్దపీట. రద్దీకి మారు పేరుగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల నిత్యన్నదానం భక్తులకు వరప్రసాదం అంటే సందేహం లేదు. ఇప్పటికీ శుచి, రుచికి మరోపేరుగా తిరుపతి లడ్డు కొనసాగుతుండడం ఆ వెంకటేశ్వరస్వామి మహిమగా చెప్పుకుంటారు. స్వామివారి దర్శనం తోపాటులడ్డుకోసమై తోపులాట జరిగినసందర్భాలనేకం.

\- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మీనమేషాలు లెక్కించకుండా ఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్య నభ్యసించేలా సహకరించాలి.

\- బి. కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# అభివృద్ధి పరుగులో భద్రతకు బ్రేక్!

*20 నుంచి 30ఏళ్లకు పైబడిన పాత భవనాలు, నాలాలు చెరువుల సమీపంలోని నిర్మాణాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లోని భవనాలు, అనుమతికి మించి అంతస్తులు నిర్మించిన భవనాలు, చిన్న ప్లాట్లపై భారీ నిర్మాణాలు, హాస్టళ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు, లోతైన సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలు ప్రత్యేక భద్రతా ఆడిట్‌కు లోబడి ఉండాలి. ప్రతి భవనానికి నిర్దిష్ట కాలవ్యవధిలో స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి చేయాలి. ఫైర్ సేఫ్టీ తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించేలా ఉండాలి. హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలి, భారీ పెట్టుబడులు రావాలి, ఆకాశహర్మ్యాలు నిర్మించాలి, కొత్త టౌన్‌షిప్‌లు రావాలి. కానీ ఈ అభివృద్ధికి పునాది ప్రజల ప్రాణ భద్రత కావాలి. భవనం ఎంత ఎత్తుగా ఉందన్నది గొప్ప విషయం కాదు. అది ఎంత సురక్షితంగా ఉందన్నదే గొప్ప విషయం. అభివృద్ధి పరుగులో భద్రత వెనుకబడకూడదు. ఇకనైనా గుణపాఠాలు నేర్చుకుని ప్రమాదం తర్వాత చర్యల నుంచి ప్రమాదం రాకముందే నివారణ వైపు హైదరాబాద్ అడుగులు వేయాలి. అదే నిజమైన మహానగర అభివృద్ధి.*

శెట్టే అంజయ్య

హైదరాబాద్ దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న మహానగరాల్లో ఒకటి. ఐటీ రంగం, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు నగరాన్ని నిరంతరం విస్తరింపజేస్తున్నాయి. జనాభా పెరుగుతోంది. కొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయి. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, హైరైజ్ భవనాలు వరుసగా వెలుస్తున్నాయి. కానీ ఈ అభివృద్ధి వేగానికి తగినంతగా భవనభద్రతా వ్యవస్థలు కూడా బలోపేతం అవుతున్నాయా? అన్న ప్రశ్న మాత్రం ఇప్పుడు అత్యంత ఆందోళన కలిగిస్తోంది. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఆగస్టు 22న నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం కేవలం ఒక నిర్మాణ ప్రమాదంగా చూడలేం. ఇది హైదరాబాద్ నగర నిర్మాణ వ్యవస్థకు ఒక హెచ్చరిక. ఒక భవనం కూలింది. ఇద్దరు ప్రాణాలు పోయాయి. కానీ ఆ భవనం ఎలా నిర్మించబడింది? ఎన్ని అంతస్తులకు అనుమతిఉంది? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు? నిర్మాణ దశలోనే ఉల్లంఘనలు ఎందుకు గుర్తించబడలేదు? నాలాకు ఆనుకుని నిర్మాణం ఎలా సాగింది? వంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి ఉంది. అధికారుల వివరాల ప్రకారం సుమారు 50 చదరపు గజాల స్థలంలో రెండు అంతస్తులకు మాత్రమే అనుమతి తీసుకుని ఏడంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. రెండు అంతస్తుల నిర్మాణానికి సరిపోయే పునాది, పిల్లర్లపై అదనపు అంతస్తులు నిర్మించడం అంటే భవనం నిర్మాణ సామర్థ్యాన్నే ప్రమాదంలోకి నెట్టడం. అంతే కాదు నాలాలు, డ్రైనేజీ మార్గాలు, వరద ప్రవాహప్రాంతాల సమీపంలో నిర్మాణాలు చేపట్టడం భవిష్యత్తులో మరింత తీవ్రమైన ప్రమాదాలకు దారితీయవచ్చు. ఇక్కడ అసలు సమస్య ఒక బిల్డర్ తప్పిదంతో ముగిసిపోదు. అనుమతి ఇచ్చే వ్యవస్థ నుంచి నిర్మాణాన్ని పర్యవేక్షించే వ్యవస్థ వరకు మొత్తం గొలుసును పరిశీలించాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్‌లో భవన నిర్మాణాలకు నిబంధనలు లేవని ఎవరూ చెప్పలేరు. భవనం ఎత్తు, స్థలం విస్తీర్ణం, భవన వినియోగం, నిర్మాణ రకం, రహదారి వెడల్పు, సెట్‌బ్యాక్‌లు, ఫైర్ సేఫ్టీ, స్ట్రక్చరల్ స్టెబిలిటీ వంటి అంశాలపై అనేక నిబంధనలున్నాయి. అవసరమైన చోట సాయిల్ టెస్ట్, స్ట్రక్చరల్ డిజైన్, ఫైర్ సేఫ్టీ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి ప్రక్రియలు కూడా ఉన్నాయి. అయితే సమస్య నిబంధనలు లేకపోవడంలో కాదు. నిబంధనలు అమలు అవుతున్నాయా? అన్నదే అసలు ప్రశ్న. ఒక భవనానికి రెండు అంతస్తులకు అనుమతి ఇచ్చి, నిర్మాణం ఏడంతస్తులకు చేరుకునే వరకు సంబంధిత అధికారులు గుర్తించకపోతే అది కేవలం యజమాని లేదా బిల్డర్ వైఫల్యమేనా? నిర్మాణ దశలో తనిఖీలు జరగలేదా? జరిగితే ఉల్లంఘనలు ఎందుకు ఆపలేకపోయారు? నోటీసులు ఇచ్చి ఉంటే వాటితర్వాత కూడా నిర్మాణం ఎలా కొనసాగింది? ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు తెలియాలి. అంజయ్యనగర్ ఘటన తర్వాత పక్కనే ఉన్న భవనాల భద్రతపై అధికారులు దృష్టి సారించడం స్వాగతించాల్సిన పరిణామమే. ప్రమాదకరంగా ఉన్న మరో భవనాన్ని కూల్చేందుకు చర్యలు చేపట్టడం కూడా అవసరమే. కానీ ఒక ప్రశ్న మాత్రం వెంటాడుతోంది. భవనం కూలిన తర్వాత చుట్టుపక్కల భవనాలను పరిశీలించడంకంటే, ముందుగానే ప్రమాదకర భవనాలనుగుర్తించే వ్యవస్థ ఉండాలి. ఒక నగర పాలక సంస్థ బాధ్యత కేవలం అనుమతులు ఇవ్వడం, పన్నులు వసూలు చేయడం, రోడ్లు వేయడం మాత్రమే కాదు. నగరంలో నివసించే ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. హైదరాబాద్ జనాభా గతదశాబ్దంలో గణనీయంగా పెరి



గింది. నగర పరిధిలో లక్షలాది అపార్ట్‌మెంట్ యూనిట్లు ఉన్నాయి. ఇంకా భారీ సంఖ్యలో కొత్త యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి. హైరైజ్ భవనాల సంఖ్య కూడా నిరంతరం పెరుగుతోంది. ఇది నగర ఆర్థిక అభివృద్ధికి సంకేతం కావచ్చు. కానీ భవనాల సంఖ్య పెరిగే కొద్దీ వాటి భద్రతా తనిఖీల సంఖ్య, నాణ్యత, సాంకేతిక సామర్థ్యం కూడా అదే స్థాయిలో పెరగాలి. ఒక ప్రాంతంలో వందలాది భవనాలు ఉన్నప్పుడు అక్కడి రహదారుల వెడల్పు సరిపోతుందా? అగ్నిమాపక వాహనాలు చేరుకోగలవా? నీటి సరఫరా సరిపోతుందా? డ్రైనేజీ వ్యవస్థపై ఒత్తిడి ఎంత? పార్కింగ్ పరిస్థితి ఏంటి? భవనం అత్యవసర పరిస్థితుల్లో ఖాళీ చేయించేందుకు మార్గాలున్నాయా? వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. నగర అభివృద్ధిని కేవలం చదరపు అడుగుల నిర్మాణంతో కొలవడం ప్రమాదకరం. 2025లోజిహెచ్ఎమ్‌సి నిర్వహించిన సర్వేలో 428 శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించబడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వాటిలో 297 భవనాలను ప్రమాదకరంగా గుర్తించి ఖాళీ చేయించే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. 2026 నాటికి ఆ భవనాల్లో ఎన్ని కూల్చివేశారు? ఎన్ని మరమ్మతుచేశారు? ఇంకా ఎన్ని ప్రమాదకరంగానే ఉన్నాయి? ఈ వివరాలను ప్రజల ముందుంచాలి. ఒకసారి సర్వే చేసి జాబితాతయారు చేయడం సరిపోదు. ప్రతి ప్రమాదకర భవనానికి ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థ ఉండాలి. హైదరాబాద్‌లో ప్రతి భవనానికి ఒక డిజిటల్ భద్రతా రికార్డు ఏర్పాటు చేయాల్సిన సమయం వచ్చింది. ఆ రికార్డులో భవనం వయసు, అనుమతించిన అంతస్తులు, వాస్తవంగా ఉన్న అంతస్తులు, నిర్మాణ స్థిరత్వ ధ్రువీకరణ, ఫైర్ సేఫ్టీ అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, నిర్మాణ స్థలానికి సమీపంలోని నాలా లేదా వరద ప్రాంత వివరాలు, గతంలో ఇచ్చిన నోటీసులు, తనిఖీల వివరాలు ఉండాలి. ప్రతి భవనానికి పచ్చ, పసుపు, ఎరుపు అనే మూడు స్థాయిల భద్రతా రేటింగ్ ఇవ్వవచ్చు. పచ్చ కేటగిరీలో ఉన్న భవనాలకు భద్రతా ధ్రువీకరణ ఇవ్వాలి. పసుపు కేటగిరీలో ఉన్న భవనాలకు నిర్దిష్ట గడువు ఇచ్చి లోపాలు సరిచేయించాలి. ఎరుపు కేటగిరీలో ఉన్న భవనాలను తక్షణం ఖాళీ చేయించి, అవసరమైతే కూల్చివేయాలి. భవనం కూలిన ప్రతిసారీ యజమాని లేదా బిల్డర్‌ను అరెస్టు చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరి. కానీ అదే సమయంలో వ్యవస్థలో ఎక్కడ వైఫల్యం జరిగిందో కూడా గుర్తించాలి. అనుమతి ఎవరు ఇచ్చారు? నిర్మాణాన్ని ఎవరు పర్యవేక్షించారు? ఉల్లంఘనలు జరిగినప్పుడు ఎవరు గుర్తించారు? గుర్తించిన తర్వాత ఏ చర్యలు తీసుకున్నారు? స్ట్రక్చరల్ ఇంజినీర్ ఇచ్చిన ధ్రువీకరణను ఎలా పరిశీలించారు? స్థానిక స్థాయిలో అధికారుల తనిఖీలు ఎంతవరకు జరిగాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. బాధ్యతను ఒకరి మీదకు నెట్టేసి వ్యవస్థను కాపాడుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు ఆగవు. హైదరాబాద్‌కు ఇప్పుడు కావాల్సింది ప్రమాదం తర్వాత స్పందించే పాలన కాదు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి నివారించే పాలన. 20నుంచి 30ఏళ్లకు పైబడిన పాత భవనాలు, నాలాలు చెరువుల సమీపంలోని నిర్మాణాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లోని భవనాలు, అనుమతికి మించి అంతస్తులు నిర్మించిన భవనాలు, చిన్న ప్లాట్లపై భారీ నిర్మాణాలు, హాస్టళ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు, లోతైన సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలు ప్రత్యేక భద్రతా ఆడిట్‌కు లోబడి ఉండాలి. ప్రతి భవనానికి నిర్దిష్ట కాల వ్యవధిలో స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి చేయాలి. ఫైర్ సేఫ్టీ తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించేలా ఉండాలి. హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలి. భారీ పెట్టుబడులు రావాలి. ఆకాశహర్మ్యాలు నిర్మించాలి. కొత్త టౌన్‌షిప్‌లు రావాలి. కానీ ఈ అభివృద్ధికి పునాది ప్రజల ప్రాణ భద్రత కావాలి. భవనం ఎంత ఎత్తుగా ఉందన్నది గొప్ప విషయం కాదు. అది ఎంత సురక్షితంగా ఉందన్నదే గొప్ప విషయం. అభివృద్ధి పరుగులో భద్రత వెనుకబడకూడదు. ఇకనైనా గుణపాఠాలు నేర్చుకుని ప్రమాదం తర్వాత చర్యల నుంచి ప్రమాదం రాకముందే నివారణ వైపు హైదరాబాద్ అడుగులు వేయాలి. అదే నిజమైన మహానగర అభివృద్ధి. ●

# బిసిల లెక్కింపులో ఇంకా వివక్ష తగునా?

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

భారత రాజ్యాంగం సామాజిక న్యాయాన్ని దేశ పాలనా వ్యవస్థకు మూల సూత్రంగా ప్రకటించింది. కానీ ఆ సామాజిక న్యాయానికి ప్రాణాధారమైన గణాంకాలవిషయంలోనే దేశం ఇప్పటికీ చారిత్రక లోటుతో ముందుకు సాగుతోంది. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఇతర వెనుకబడిన తరగతుల (బిసి/ఒబిసి) సంఖ్య ఎంత అన్న ప్రశ్నకు స్వతంత్ర భారతదేశం ఇప్పటికీ ఖచ్చితమైన సమాధానం చెప్పలేని పరిస్థితి దురదృష్టకరం. 1931 తర్వాత తొలిసారిగా 2027 జనగణనలో కుల గణన చేపడుతున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, అదే జనగణన ప్రశ్నావళిలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కోడ్‌లు కేటాయించి, బీసీలకు మాత్రం ప్రత్యేక కాలమ్ ఇవ్వకుండా 'ఓపెన్ కాలమ్'కే పరిమితం చేయడం తీవ్రమైన ఆందోళనలకు తావిస్తోంది. ఇది కేవలంసాంకేతిక లోపమా? లేక సామాజిక న్యాయాన్ని మరోసారి అసంపూర్ణంగా మార్చే పరిపాలనా వైఫల్యమా?అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా బిసి సంఘాలు, సామాజిక విశ్లేషకులు వ్యక్తం చేస్తున్న నిరసనల వెనుక ఉన్న ఆవేదన కూడా ఇదే. దేశంలో సంపూర్ణ కులగణన చివరిసారిగా జరిగింది 1931లోనే. ఆ తర్వాత వచ్చిన ఏ ప్రభుత్వమూ దేశవ్యాప్తంగా బీసీల సంఖ్యను శాస్త్రీయంగా లెక్కించలేదు. ప్రతి సందర్భంలోనూ అంచనాలపైనే పాలన సాగుతోంది. మండల్ కమిషన్ (1980) జనాభా గణన 1931 డేటాను మూలంగా చేసుకుని ఒబిసిల జనాభా దాదాపు 52శాతం ఉంటుందని అంచనా వేసింది. దీని ఆధారంగానే 27శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. ఎన్ఎస్ఎస్ఓ వివిధ సర్వేలు బీసీ జనాభా 36శాతంనుంచి 46శాతం మధ్య ఉంటుందని పేర్కొన్నాయి. బీహార్ ప్రభుత్వం 2023లో నిర్వహించిన కులసర్వే మాత్రం దేశానికి కొత్త వాస్తవాన్ని చూపించింది. అక్కడ ఒబిసి + ఇబిసి కలిపి 63.13శాతం (ఇబిసి 36.01శాతం, ఒబిసి 27.12 శాతం) ఉన్నారని, ఎస్సీలు 19.65శాతం, ఎస్టీలు 1.68 శాతం, జనరల్ వర్గాలు 15.52శాతం ఉన్నారని తేలింది. తెలంగాణలో నిర్వహించిన సమగ్ర కులగణనలో బిసిల జనాభా దాదాపు 56.33శాతంగా నమోదైంది. కేంద్ర ఒబిసి జాబితాలోనే దాదాపు 2,650 కులాలు ఉండగా, రాష్ట్రాల జాబితాల్లో మరింత ఎక్కువ సంఖ్యలో కులాలు ఉన్నాయి. ఈ గణాంకాలన్నీ అంచనాలు వాస్తవాలకు ప్రత్యామ్నాయం కావని, శాస్త్రీయ గణనద్వారానే నిజమైన సామాజిక నిర్మాణం బయటపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. 2026లో మొదటి దశగా గృహ వివరాల సేకరణ, 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు రెండో దశ జనాభా లెక్కింపు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రశ్నావళిలోని 10వ ప్రశ్న (ఎస్సీ, ఎస్టీ కులాల)లో ఎస్సీ, ఎస్టీలకు డ్రాప్‌డౌన్ ఆప్షన్ ఇచ్చి, మిగిలిన వారందరికీ కులం పేరును స్వేచ్ఛగా నమోదు చేసే అవకాశం కల్పించింది. నమోదు చేసిన కులాల పేర్లను అత్యాధునిక డిజిటల్ టూల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో రాష్ట్రాల ఒబిసి జాబితాలతో మ్యాపింగ్ చేసి, బిసిల సంఖ్యను గుర్తిస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ 2011 సామాజిక, ఆర్థిక కులగణనలో దాదాపు 46లక్షల కులాలు, ఉపకులాలు, ఇంటిపేర్లు నమోదై తీవ్ర గందరగోళం ఏర్పడటంతో ఆ డేటాను వినియోగించలేకపోయారు. స్పష్టమైన కాలమ్ లేకుండా మళ్లీ అదేవిధంగా స్వేచ్ఛా నమోదు జరిగితే, లక్షలాది భిన్నమైన నమోదులు రావడం సహజం. అలాంటి సమాచారాన్ని తర్వాత వర్గీకరించడం కంటే, మొదటనుంచే స్పష్టమైన గుర్తింపుతో సమాచారాన్ని సేకరించడమే విశ్వసనీయమైన విధానం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4) విద్యా, ఉద్యోగాల్లో వెనుకబడినతరగతులకు ప్రత్యేక అవకాశాలను కల్పిస్తుండగా, ఆర్టికల్ 243(డి), 243(టి) స్థానికసంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యాన్ని నిర్ధారిస్తున్నాయి. అయితే ఈ రాజ్యాంగ హక్కులు సమర్థవంతంగా అమలు కావాలన్నా, నిధుల కేటాయిం పులు, సంక్షేమ పథకాల రూపకల్పన, బిసిసబ్‌ప్లాన్ల అమలు సరిగ్గా జరగాలన్నా విశ్వసనీయ గణాంకాలు తప్పనిసరి. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు జనగణన ఫారంలో ప్రత్యేక గుర్తింపు ఇవ్వకపోవడం భవిష్యత్ విధానాల విశ్వసనీయతను, సంక్షేమపథకాల పారదర్శకతను దెబ్బతీస్తుంది. జనగణన అనేది కేవలం జనాభా లెక్కింపు కార్యక్రమం కాదు.. అది దేశ భవిష్యత్ విధానాలకు, వనరుల సమానపంపిణీకి, సామాజిక న్యాయ అమలుకు పునాది. 2027 జనగణన రెండో దశ ప్రారంభమయ్యేలోపే కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా పరిగణించాలి. ●

# అణ్వాయుధాల ఆధిపత్యాన్ని నియంత్రించలేమా?

బొల్లిముంత సాంబశివరావు

ఆధునిక కాలంలో సామ్రాజ్యవాదం అంటే, కేవలం భౌగోళికంగా దేశాలను ఆక్రమించుకోవడమేకాదు, సైనిక, ఆర్థిక సాంకేతిక ఆధిపత్యాల ద్వారా ఇతరదేశాలను సామ్రాజ్యవాద దేశాలు తమగుప్పిట్లో ఉంచుకోవడం. ఈ ఆధునిక సామ్రాజ్యవాదానికి అణ్వాయుధాలు అతిపెద్ద ఆయుధాలుగా మారాయి. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌దేశాలు అధికారికంగా అణ్వాయుధాలు కలిగి ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాల తయారీ, నిల్వల్లో రష్యా, అమెరికా అత్యంత అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రపంచంలో ఉన్నమొత్తం అణ్వాయుధాల్లో 90శాతం ఈరెండు దేశాలే కలిగి ఉన్నాయి. ప్రపంచంలోనే రష్యా అత్యధికంగా 5,500లకుపైగా అణ్వాయుధాలు కలిగి ఉంది. 5,044 అణ్వాయుధాలతో అమెరికా రెండవస్థానంలో ఉంది. చైనా 540పైగా అణ్వాయుధాలతో మూడవస్థానంలో ఉంది. ఆ తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్ లున్నాయి. అణ్వాయుధాలపై ఆధిపత్యం కలిగిన దేశాలు ముఖ్యంగా అమెరికా కొత్తగా ఏ దేశం అణుబాంబులుతయారు చేయకుండా అడ్డుకొంటున్నది. ఇది ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. అణ్వాయుధాలతోపాటు ఇతర ఆధునిక ఆయుధాలు కలిగిన అమెరికాకు, ఆధునిక ఆయుధసంపత్తి లేని దేశాలు భయపడాల్సి వస్తున్నది. అసమానతలతో కూడిన ఐక్యరాజ్యసమితి చేసిన అణువ్యాప్తి నిరోధక ఒప్పందం ద్వారా కొత్తగా ఏ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా నిరోధించడం, శాంతియుత అవసరాల కోసం మాత్రమే అణుశక్తిని వినియోగించేలా చేయడం ఈఒప్పందం లక్ష్యంగా ప్రకటించబడింది. ఇది 1970 మార్చి 5నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఐక్యరాజ్యసమితి అణ్వాయుధాలు, అపారసైనిక శక్తి, ఆర్థిక బలం కలిగిన సామ్రాజ్యవాద దేశాలకు ముఖ్యంగా అమెరికాకు వెనుకబడిన దేశాలు లొంగిఉండాలని చెప్పకనేచెబుతున్నది. ఈ ఒప్పందాన్ని అనేక దేశాలు వ్యతిరేకించాయి. ఇతర దేశాలు అణ్వాయుధాలు తయారు చేయకుండా ఒప్పందం నిరోధిస్తున్నప్పుడు, ఏ దేశం దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదు. అమెరికాతోపాటు అణ్వాయుధాలున్న దేశాలన్నీ వాటిని నాశనంచేసే చర్యలు తీసుకోవాలి. కాని అణుఒప్పందంలో అలాంటి అంశంలేదు. అలాంటప్పుడు ప్రపంచ ప్రజలకు అణుయుద్ధ ప్రమాదం పొంచి ఉంటూనే ఉంటుంది. చైనాతోపాటు ప్రపంచదేశాల్లో ఉన్న అణ్వాయుధాలన్నింటిని నాశనం చేద్దాం మావోనాయకత్వాన చైనా ప్రకటించడాన్ని ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం. 1945లో అమెరికా అణుబాంబు తయారు చేసిన తొలిదేశంగా దాని ఆధిపత్యం



కొనసాగింది. ఆతర్వాత బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలు 1949లో తయారు చేశాయి. అమెరికా యుద్ధోన్మాద చర్యలను ఎదుర్కోవడానికి మాత్రమే స్టాలిన్ నాయకత్వాన సోవియట్ యూనియన్ అణుబాంబు తయారుచేసింది. అమెరికా అణ్వాయుధాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా మావో నాయకత్వాన 1964లో చైనా అణుబాంబును తయారుచేసింది. ఆతర్వాత 1974లో భారత్, 1998లో పాక్ అణుబాంబులు తయారు చేశాయి. 2006లో ఉత్తరకొరియా అణుబాంబు తయారీలో విజయవంతమైంది. ఐక్యరాజ్యసమితి ఒప్పందం ప్రకారం అణ్వాయుధాల సంఖ్య కొంత తగ్గినప్పటికీ అమెరికా, రష్యాలు తమవద్ద ఉన్న ఆయుధాలను మరింత అధునాతనంగా, శక్తివంతంగా తయారు చేస్తున్నాయి. ఇందులో అమెరికా అగ్రభాగంలో ఉంది. అలా చేయడం ఐక్యరాజ్యసమితి తీర్మానానికి వ్యతిరేకం. అణు ఉత్పత్తి దేశాలు ముఖ్యంగా అమెరికా, రష్యా దేశాలు అణు పరీక్షలను స్వదేశాల్లో కాకుండా పసిఫిక్ సముద్రంలోని చిన్నదీవుల్లో లేదా తమ ఆధీనంలోని వలస ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాయి. దీనివల్ల ఆయాప్రాంతాల్లో పర్యావరణం నాశనం కావడం, రేడియేషన్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. ముఖ్య అణ్వాయుధాల దేశాలు నేరుగా యుద్ధాలకు తలపడితే పరస్పరం వినాశనం జరుగుతుందని వాటికితెలుసు. అందుకే అలా తలపడటం లేదు. తమ సామ్రాజ్యవాద విస్తరణ కోసం ఆసియా, ఆఫ్రికా మధ్య ప్రాచ్యంలోని చిన్నదేశాలను వేదిక చేసుకుని యుద్ధాలు జరుపుతున్నాయి. జపాన్లోని హిరోషిమా, నాగసాగిపై అణుబాంబుదాడి ద్వారా సోవియట్యూనియన్‌కు తన సైనిక శక్తిని చూపి భయపెట్టడానికేనని రాజకీయవేత్తలు చెప్పారు. కాని సోవియట్యూనియన్‌కే అమెరికా భయం కలిగించింది. ఇరాక్ వద్ద సామూహిక వినాశకర ఆయుధాలు ఉన్నాయనేఅబద్ధపు నెపంతో అమెరికా ఆదేశంపై దాడిచేసి సద్దాంహుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చి ఆయన్ను ఉరితీసింది. ప్రపంచవ్యాప్తంగా అమెరికాకు 800లకుపైగా సైనిక స్థావరాలున్నాయి. రష్యా సరిహద్దులకు సమీపంలోనూ, వ్యూహాత్మక సముద్ర మార్గాల్లోను ఈసైనిక స్థావరాలు ఏర్పాటు చేసింది. అణ్వాయుధాలను అగ్రరాజ్యాలను నియంత్రించడంలో ఐరాస వైఫల్యానికి ప్రధానకారణం వాటి రాజకీయ ఆధిపత్యం, భద్రతా మండలి ఏర్పాటులో ఉన్నలోపాలే కారణం. ప్రపంచ వ్యాప్తంగా అణ్వాయుధవ్యాప్తిని అరికట్టడానికి ఐక్యరాజ్య సమితిలో అనేక ఒప్పందాలు జరిగినా అవి ఆయుధ పోటీని ఆపడంలో వైఫల్యం చెందాయి. అణ్వాయుధ యుద్ధ ప్రమాదాల భయం లేకుండా ప్రపంచదేశాల ప్రజలు ఉండాలంటే, అణ్వాయుధాల తయారీకి వ్యతరేకంగానే కాకుండా, అవి ఉన్న అన్నిదేశాల్లో ప్రజలకు ప్రమాదం రాకుండా చాలా జాగ్రత్తగా నాశనం చేయాలి. అలా జరగాలంటే ప్రపంచ ప్రజలందరూ సామ్రాజ్య వాదానికి ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్య గొంతుతో ఉద్యమించాలి. ●

# పిల్లల్ని కంటే రూ. 55 లక్షలు ప్రోత్సాహకం!



## జననాల రేటు పడిపోవడంతో రంగంలోకి దిగిన సింగపూర్ ప్రభుత్వం

### భారీ కుటుంబ ప్యాకేజీలు, రాయితీలతో యువతకు వల

**సింగపూర్‌సిటీ, ఆగస్టు 26:** ఆర్థిక అద్భుతాలకు, ఆధునిక జీవనశైలికి చిరునామాగా నిలిచే సింగపూర్, ఇప్పుడు ఓ తీవ్రమైన సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో జననాల రేటు రికార్డు స్థాయిలో పడిపోవడంతో, ప్రభుత్వం రంగంలోకి దిగింది. పిల్లల్ని కనేందుకు యువతను ప్రోత్సహించే లక్ష్యంతో మునుపెన్నడూ లేని విధంగా ఓ భారీ కుటుంబ మద్దతు ప్యాకేజీని ప్రకటించింది. సింగపూర్‌లో పుట్టిన ప్రతి బిడ్డకు 17 ఏళ్లు నిండే వరకు దాదాపు 70,000 సింగపూర్ డాలర్లు అంటే సుమారు రూ. 55 లక్షలు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందనుంది. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ జాతీయ దినోత్సవ ర్యాలీలో ఈ ప్రకటన చేశారు. దేశంలో సంతానోత్పత్తి రేటు 0.87తో అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయంతీసుకుంది. ఎన్ని ప్రోత్సాహకాలు ఇచ్చినా యువత పిల్లల్ని కనేందుకు ముందుకు రాకపోవడంతో, ఈసారి మరింత సమగ్రమైన విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కొత్త ప్యాకేజీ కేవలం డబ్బుతో సరిపెట్టడం లేదు. కుటుంబాలపై భారం తగ్గించేలా అనేక అంశాలను ఇందులో చేర్చారు. పుట్టిన ప్రతి బిడ్డకు ప్రభుత్వం 10,000 సింగపూర్ డాలర్ల సుమారు రూ. 7.8 లక్షలు బేబీ గిఫ్ట్ అందిస్తుంది. అదనంగా, ఫస్ట్ స్టెప్ గ్రాంట్ కింద మరో 5,000 డాలర్లు సుమారు రూ. 4 లక్షలు ఇస్తారు. బిడ్డ పెరుగుతున్న కొద్దీ ఏటా చైల్డ్ క్రెడిట్స్ రూపంలో 2,000డాలర్లు సుమారు రూ.1.6 లక్షలు చొప్పున జమ చేస్తారు. వీటన్నింటితో పాటు, శిశు సంరక్షణ (చైల్డ్ కేర్) కేంద్రాల్లో సబ్సిడీలను పెంచనున్నారు. తల్లిదండ్రులకు ఇచ్చే సెలవులను కూడా విస్తరించనున్నారు. ప్రభుత్వం నిర్మించే ఇళ్ల కేటాయింపుల్లో పిల్లలు ఉన్న కుటుంబాలకు అదనపు ప్రాధాన్యం ఇస్తారు. ప్రతి బిడ్డకు లాటరీలో ఒక అదనపు అవకాశం లభిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే కుటుంబ, సంతాన ప్రోత్సాహకాల కోసం ప్రభుత్వం సుమారు 7 బిలియన్ల సింగపూర్ డాలర్లు (సుమారురూ. 5.5 వేలకోట్లు) ఖర్చు చేయనుంది. మీరు పిల్లల్ని కనాలని నిర్ణయించుకుంటే, ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుందని ప్రతి కుటుంబం తెలుసుకోవాలని ప్రధాని వాంగ్ భరోసా ఇచ్చారు. ఒకప్పుడు ఇద్దరు చాలు అంటూ తీవ్రంగా ప్రచారం చేసిన సింగపూర్ ప్రభుత్వమే ఇప్పుడు పిల్లల కోసం ప్రాధేయపడాల్సిన పరిస్థితి రావడం గమనార్హం.

1970లలో అధిక జనాభా దేశాభివృద్ధికి భారమని భావించిన ప్రభుత్వం, 1987 నాటికి తన విధానాన్ని మార్చుకుంది. అప్పటి నుంచి జననాల రేటును పెంచేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, ప్రసూతి సెలవులు వంటి ఎన్నో ప్రయత్నాలు చేసింది. విశ్వవిద్యాలయ పట్టభద్రులకు మ్యాచ్ మేకింగ్ ఈవెంట్లు కూడా నిర్వహించింది. అయినా పరిస్థితి మారలేదు, సంతానోత్పత్తి రేటు పడిపోతూనే ఉంది. ప్రభుత్వం ఇంత భారీగా డబ్బు వెదజల్లడానికి సిద్ధమైనా, ఇది ఎంతవరకు ఫలిస్తుందనేది సందేహంగానే ఉంది. ఇటీవల వెలువడిన ఓ సర్వేలో, దాదాపు మూడింట ఒక వంతు మంది యువత ఏ ప్రభుత్వ విధానం కూడా తమను పిల్లల్ని కనేలా ప్రోత్సహించలేదని స్పష్టం చేశారు. ఖరీదైన జీవనం, పని ఒత్తిడి, పిల్లల పెంపకానికి అయ్యే అధిక ఖర్చులే తమను ఈ నిర్ణయానికి దూరం చేస్తున్నాయని వారు చెబుతున్నారు.

సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ యూజీన్ టాన్ ఈ చర్యలను "సింగపూర్‌కు లభించిన చివరి అవకాశం"గా అభివర్ణించారు. కేవలం ఆర్థిక ప్రోత్సాహకాలే కాకుండా, వివాహం, సంతానం పట్ల సమాజంలో ఉన్న దృక్పథాలు, మనస్తత్వాలు మారినప్పుడే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు, దేశంలో వృద్ధుల జనాభా పెరిగిపోయి, పనిచేసే యువతరం తగ్గిపోతుండటంతో సింగపూర్ భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, వలసదారులను ఆహ్వానించడం కూడా తప్పదని ప్రధాని వాంగ్ సూచించారు.



# కర్ణాటకలో ఇక వందేమాతరం రెండు చరణాలే

## సిఎం డికెశివకుమార్ వెల్లడి

**బెంగళూరు, ఆగస్టు 26:** కర్ణాటకలో ప్రభుత్వ కార్యక్రమాల్లో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించబోమని ముఖ్యమంత్రి డికె శివకుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ నిర్ణయం మేరకు తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని తెలిపారు. ఈ విషయంలో పార్టీ వైఖరికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మొత్తం ఆరు చరణాలు ఆలపించడంపై ప్రశ్నించగా తనకు తెలియకుండానే ఆ నిర్ణయం జరిగి ఉండొచ్చని శివకుమార్ అన్నారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం గతంలో నిర్ణయించిన విధంగానే తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల 1937లో తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి సమర్థించింది. బహిరంగ, జాతీయ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలుమాత్రమే ఆలపించాలని అప్పట్లో నిర్ణయించినట్లుపేర్కొంది. మొత్తం చరణాలు పాడాలంటూ కొత్త వందేమాతరం బిల్లు రావడం నేపథ్యంలో ఈఅంశంపై కాంగ్రెస్, బిజెపి మధ్య రాజకీయ వివాదం కొనసాగుతోంది. కాంగ్రెస్ నిర్ణయాన్ని బిజెపి తప్పుబట్టింది. జాతీయ గేయాన్ని అవమానిస్తున్నారని విమర్శించింది. ఓటుబ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించింది. ఈ విమర్శలపై శివకుమార్ స్పందించారు. భారత్ భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలతో కూడిన దేశమని అన్నారు. ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. బిజెపి ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వందేమాతరం తరువాతి చరణాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతల ప్రస్తావన ఉందని కాంగ్రెస్‌చెబుతోంది. ఇతర వర్గాలకు అవి అభ్యంతరకరంగా ఉండొచ్చన్న కారణంతో తొలి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించింది.

## లడఖ్‌లో డిఆర్‌డివో పారాచూట్ పరీక్ష విజయవంతం




**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ స్వదేశీ మిలిటరీ కంబాట్ పారాచూట్ సిస్టమ్‌కు సంబంధించిన అధిక ఎత్తు పరీక్షను బుధవారం విజయవంతంగా నిర్వహించింది. లడఖ్‌లోని లేహ్ జిల్లాలో న్యోమాముధ్ డ్రాప్ జోన్‌లో ఈ పరీక్ష చేపట్టారు. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఈ ట్రయల్ నిర్వహించారు. సముద్ర మట్టానికి 22,000 అడుగుల ఎత్తు నుంచి టెస్ట్ జంప్ నిర్వహించగా, అక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ 15 డిగ్రీల సెల్సియస్కు పడిపోయాయి. ఈ వ్యవస్థను డిఆర్‌డివోకు చెందిన ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ రూపొందించి అభివృద్ధి చేసింది. సంస్థకు చెందిన ముగ్గురు టెస్ట్ జంపర్లు ఈ ప్రయోగంలో పాల్గొన్నారు. చీఫ్ టెస్ట్ జంపర్ వింగ్ కమాండర్ రాహుల్ ఝా, ఎండబ్ల్యువో ఆర్.జే. సింగ్, విఎంజె, ఎండబ్ల్యు వివేక్ తివారీ ఈ జంప్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ట్రయల్‌లో డిఆర్డీవో పాటు స్వదేశీ పారా కంప్యూటర్, ఆక్సిజన్ వ్యవస్థ, ప్రత్యేకంగా రూపొందించిన జంప్‌సూట్లను వినియోగించారు. 20వేల అడుగుల ఎత్తులో పారాచూట్‌ను తెరవగా, జంపర్లు 13,700 అడుగుల ఎత్తులో సురక్షితంగా ల్యాండ్ అయ్యారు. తీవ్ర పరిస్థితుల్లో వ్యవస్థ సామర్థ్యానికి అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ డిఆర్‌డివో సమర్థత, విశ్వసనీయత, వ్యూహాత్మక వినియోగ సామర్థ్యాన్ని ఈ విజయవంతమైన పరీక్ష నిరూపించిందని డిఆర్‌డివో తెలిపింది. ప్రత్యేకించి క్లిష్టమైన అధిక ఎత్తు ప్రాంతాల్లో కార్యకలాపాల కోసం భారతదేశం అభివృద్ధి చేస్తున్న స్వదేశీ రక్షణ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యాన్ని ఈ పరీక్ష చాటిచెప్పింది. కీలక రక్షణ సాంకేతికతలు, అధిక ఎత్తు వైమానిక సరఫరా వ్యవస్థల్లో ఆత్మనిర్భరతను మరింత బలోపేతం చేసే దిశగా ఈ విజయవంతమైన ప్రయోగం కీలక ముందడుగుగా నిలుస్తుందని డిఆర్‌డివో పేర్కొంది.




# కర్ణాటకలో కలకలం

## భూతనాళ సరస్సులో ఆరు మృతదేహాలు

### సామూహిక ఆత్మహత్యగా పోలీసుల అనుమానం

### మృతులు విజయపుర జిల్లా వాసులుగా గుర్తింపు

**విజయపుర (కర్ణాటక), ఆగస్టు 26:** ఉత్తర కర్ణాటకలోని విజయపుర నగర శివార్లలోఉన్న భూతనాళ సరస్సులో ఆరు మృతదేహాలు తేలియాడడటం కలకలంసృష్టించింది. ఉదయం 8.45గంటల ప్రాంతంలో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర సేవల సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను సరస్సును వెలికితీశారు. మృతులను గుర్తింపు ప్రక్రియను ప్రారంభించగా, ప్రాథమిక దర్యాప్తులో సోమవారమే విజయపుర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆరుగురు అదృశ్యంపై కేసు నమోదైనట్లు గుర్తించారు. శోభ భర్త బీమరాయ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. దాని ఆధారంగా పోలీసులు వివరాలు రాబట్టారు. మృతులు విజయపుర జిల్లా టికోటా తాలూకా తోరవి గ్రామ వాసులుగా గుర్తించారు. శోభ జలగేరి, ఆమె పిల్లలు విద్య, సువర్ణ(14), గౌడేశ్(10), వికాస్(5), సానిక(7)గా గుర్తించారు. మిస్సింగ్ కేసు ఆధారంగా ఆగస్టు 24న శోభ తన భర్తతో గొడవపడినట్లు తేలింది. తాను ఇంటిని వదిలి వెళ్లిపోతానని, పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుంటానని ఆమె అతనికి చెప్పినట్లు సమాచారం. గొడవ జరిగిన తర్వాత శోభ ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయలుదేరి, మొదట నలుగురు పిల్లలను తనతో తీసుకెళ్లిందని ఎస్పీ లక్ష్మణ్ నింబార్గి తెలిపారు. ఆ తర్వాత, వినికిడి లోపం ఉండి ఒక రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న తన మరో కుమారుడిని కూడా ఆమె తనతోతీసుకెళ్లింది. ఆ కుటుంబం ఎక్కడికి వెళ్లిందనే విషయాన్ని తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నించారు, కానీ శోభ తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే వదిలి వెళ్లడంతో వారి ఆచూకీని కనుగొనలేకపోయారు. మరణాలకు దారితీసిన ఖచ్చితమైన పరిస్థితులు ఇంకా తెలియరాలేదు అయినప్పటికీ, పోలీసులు ప్రస్తుతం ఈ ఘటనను అనుమానాస్పద ఆత్మహత్యగా పరిగణిస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం పరీక్ష కోసం తరలించారు. కుటుంబ కలహాల కారణంగా ఈ మరణాలు సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# హెచ్‌ఐవి కట్టడికి ఇంజెక్షన్ వచ్చేస్తోంది

## 'లెనాకాపవీర్' ఉత్పత్తి విక్రయానికి రెడ్డీస్‌కు అనుమతులు

**హైదరాబాద్, ఆగస్టు 26:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ హెచ్‌ఐవీ వ్యాప్తిని నివారించే లెనాకాపవిర్ జెనరిక్ ఇంజెక్షన్‌ను భారత్‌లో తయారు చేసి, విక్రయించేందుకు అనుమతి పొందింది. ఈ విషయంలో మూడోదశ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించకుండానే ఉత్పత్తికి, మార్కెటింగ్‌కు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ నిపుణుల కమిటీ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇంజెక్షన్ ధర భారీగా తగ్గే అవకాశంఏర్పడింది. డాక్టర్ రెడ్డీస్‌తోపాటు ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్‌కు కూడా నిపుణుల కమిటీ ఈ అనుమతిని మంజూరు చేసింది. అయితే, మార్కెట్లోకి విడుదల చేశాక నాలుగో దశ క్లినికల్ పరీక్షలు నిర్వహించి, ఆ డేటాను సమర్పించాలని కంపెనీలను ఆదేశించింది. ఈఇంజెక్షన్‌ను హెచ్‌ఐవీ ముప్పు అధికంగా ఉన్నవారు (కనీసం 35కిలోల బరువుఉండాలి) ఏడాదికి రెండుసార్లు తీసుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ ఫార్మా సంస్థ గిలీడ్ సైన్సెస్‌కు 'లెనాకాపవిర్' ఔషధంపై పేటెంట్‌ఉంది. అయితే, ఎలాంటి రాయల్టీ తీసుకోకుండా భారత్‌తో పాటు 120 అల్పాదాయ దేశాల్లో ఈ మందును తయారు చేసేందుకు గిలీడ్ పలు కంపెనీలకు లైసెన్సులు మంజూరు చేసింది. అమెరికా, ఈయూ దేశాల్లో దీని వార్షిక ఖర్చు రూ.27 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉండగా, జెనరిక్ రాకతో భారత్‌లో ప్రస్తుతం ఉన్న ధర కంటే 50 నుంచి 70 శాతం వరకు తగ్గుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**అరిజెన్‌కు భారీ కాంట్రాక్టు**

డాక్టర్ రెడ్డీస్ అనుబంధ సంస్థ అయిన అరిజెన్ ఫార్మా ఒక అంతర్జాతీయ కంపెనీ నుంచి భారీ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ ఒప్పందం కింద దీర్ఘకాలం పాటు స్టెరైల్ ఇంజెక్టబుల్స్, బయోలాజిక్స్ తయారు చేసి సరఫరా చేయనుంది. కాంట్రాక్టులోని షరతుల కారణంగా భాగస్వామ్య కంపెనీ పేరును వెల్లడించలేదు.

# ప్రపంచవ్యాప్తంగా అమెరికా వీసా అపాయింట్‌మెంట్ల వాయిదా




**వాషింగ్టన్,ఆగస్టు 26:** అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొనసాగుతున్న వలస వ్యతిరేక చర్యల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో వీసా అపాయింట్‌మెంట్లను తాత్కాలికంగా నిలిపివేయడం ప్రారంభించారు. అమెరికా విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం అన్ని విదేశీ దౌత్య కార్యాలయాల్లో చేపడుతున్న గ్లోబల్ శిక్షణ కార్యక్రమానికి అనుగుణంగా వీసా సేవల అపాయింట్‌మెంట్లలో మార్పులు చేస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం కారణంగా వీసా సేవల అపాయింట్‌మెంట్లను సర్దుబాటు చేస్తున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈమార్పులు ఎంతకాలం కొనసాగుతాయన్న దానిపై స్పష్టమైన గడువును ప్రకటించలేదు. అమెరికా ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందని భావించే దరఖాస్తుదారులను గుర్తించడంతో పాటు, వీసాఅభ్యర్థులను సమగ్రంగా, ఒకే విధమైన ప్రమాణాలతో పరిశీలించేందుకు కాన్సులర్ అధికారులకు శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొంది. ఇప్పటికే ఇంటర్వ్యూలకు అపాయింట్‌మెంట్లు పొందిన వలస వీసా దరఖాస్తుదారులకు అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు ఈమెయిళ్లు పంపినట్లు తెలిపింది. వారి అపాయింట్‌మెంట్లను రీషెడ్యూల్ చేస్తున్నామని, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని అందులో పేర్కొన్నట్లు వెల్లడించింది. ట్రంప్ కఠిన వలస విధానంట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులపై భారీ స్థాయిలో దేశ బహిష్కరణ చర్యలను చేపడుతోంది. ఇందులో వీసాలు, గ్రీన్ కార్డుల రద్దు, వివిధ కారణాలతో వలస దరఖాస్తుల తిరస్కరణ వంటి చర్యలు ఉన్నాయి. రాజకీయ అభిప్రాయాలు, అమెరికా మిత్రదేశమైన ఇజ్రాయెల్ గాజాపై జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా నిర్వహించిన పాలస్తీనా అనుకూల నిరసనల్లో పాల్గొనడం వంటి అంశాలు కూడా కొన్ని సందర్భాల్లో కారణాలుగా మారుతున్నాయి. వేలాది మంది భారతీయ నిపుణులు వినియోగించే హెచ్1బీ వీసా కార్యక్రమంలో కీలక మార్పులు తీసుకురావడానికి ఉద్దేశించిన కొత్త ప్రతిపాదనపై ట్రంప్ ప్రభుత్వం ఈ వారం వైట్‌హౌస్ స్థాయిలో సమీక్ష ప్రారంభించింది. ఈ ప్రతిపాదనను ఆర్థికంగా కీలకమైనదిగా వర్గీకరించారు. అంటే ఏడాదికి కనీసం 100 మిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని చూపే లేదా ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాలు, ఉత్పాదకత, పోటీ లేదా ప్రధాన ఆర్థిక రంగంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉన్న ప్రతిపాదనగా దీనిని పరిగణిస్తున్నారు.

# అంతర్గత భద్రత పటిష్టతే వికసిత్ భారత్‌కు పునాదులు: హోం మంత్రి అమిత్‌షా




**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యానికి పటిష్ఠ అంతర్గత భద్రతే పునాది అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, భవిష్యత్ భద్రతా సవాళ్లపై ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఇంటెలిజెన్స్ బ్యూరో జాతీయ భద్రతా సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో 15 నుంచి 20 యేళ్లలో ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఇప్పటి నుంచే గుర్తించాలని అమిత్ షా సూచించారు. అవి పెద్ద సంక్షోభాలుగా మారకముందే తిప్పికొట్టే వ్యూహాలు సిద్ధం చేయాలని చెప్పారు. దేశంలో మూడు ప్రధాన అంతర్గత భద్రతా హాట్‌స్పాట్ల నుంచి ఎదురైన ముప్పులను సమర్థంగా అధిగమించామని పేర్కొన్నారు. సరిహద్దు భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని షా తెలిపారు. ఎనిమిది నెలలుగా అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. నాలుగు అంచెల సరిహద్దు భద్రతా ప్రణాళికను రాష్ట్రాలకు అందించామని వెల్లడించారు. ఇది ధర్మశాల కాదు. ఈ దేశ పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉందని షా వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాటుదారులు జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు ముప్పని హెచ్చరించారు. కొత్తగా తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వచ్చే ఏడాదిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షాచెప్పారు. క్రిమినల్ కేసులు సుప్రీంకోర్టు స్థాయి వరకు మూడేళ్లలో పరిష్కారమయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షల శాతాన్ని 25 శాతం పెంచడమూ లక్ష్యమేనన్నారు. పిఎఫ్ఐపై నిషేధం తర్వాత చేపట్టిన చర్యలను కేంద్రరాష్ట్ర సమన్వయానికి ఉదాహరణగా షా పేర్కొన్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగాధ్వంసంచేసేందుకు ప్రహార్ వ్యూహాన్ని రోజువారీ భద్రతా కార్యకలాపాల్లో అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలపై డిటెక్ట్, డిస్‌రప్ట్, డిస్ట్రాయ్ విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకుపిలుపునిచ్చారు. 2026–29 మాదకద్రవ్య నియంత్రణ విజన్ డాక్యుమెంట్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్, నాట్‌గ్రిడ్, నాఫిస్ డేటాబేస్‌ల అనుసంధానంతో శక్తిమంతమైన నిఘా వ్యవస్థ ఏర్పడిందని షా తెలిపారు. కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ, ప్రవర్తనా సరళి అధ్యయనం ద్వారా భవిష్యత్ ముప్పులను ముందే గుర్తించాలని సూచించారు.

# పుట్టింటికెళ్లడానికి భర్త అనుమతి అక్కర్లేదు

## ఇంటి పనులు చేయాలని బలవంతం చేయలేరు

### తల్లిదండ్రులను చూసుకోవాలని ఆదేశించలేరు: కర్ణాటక హైకోర్టు



**బెంగళూరు, ఆగస్టు 26:** వివాహం అనేది అవతలి వ్యక్తిని నియంత్రించడానికి ఇచ్చే లైసెన్స్ కాదని, భర్తతో సహా ఎవరూ కూడా ఇంటి పనులు చేయాలని లేదా తన తల్లిదండ్రులను చూసుకోవాలని భార్యను ఆదేశించలేరని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. భరణం కోసం బిఎన్ఎస్ఎస్ 2023లోని సెక్షన్ 144(1) కింద దాఖలు చేసిన పిటిషన్‌ను పాక్షికంగా అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా, ఫ్యామిలీ కోర్ట్స్ యాక్ట్‌లోని సెక్షన్ 19(4) కింద దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు పరిశీలిస్తూ జస్టిస్ చిల్లకూరు సుమలత నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "భారతీయ మహిళ తనకిష్టమైనప్పుడు పుట్టింటికి వెళ్లాలనే ప్రాథమిక కోరికను తీర్చుకోవడానికి, అత్తవారింట్లో ఉన్నవారి అనుమతి ఎందుకు తీసుకోవాల్సి వస్తుందో ఈ కోర్టుకు అర్థం కావడం లేదు. భర్తతో సహా ఎవరూ కూడా, భార్యతో సహా ఏ మహిళనైనా ఇంటి పనులు చేయమని లేదా తన తల్లిదండ్రులను చూసుకోమని ఆదేశించకూడదని లేదా డిమాండ్ చేయకూడదని ఈ కోర్టు భావిస్తోంది. ఇంటి పనులను స్త్రీ పురుషులు సమానంగా పంచుకోవాలి. తల్లిదండ్రులను చూసుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు, ఆ బాధ్యత ప్రధానంగా కుమారుడు లేదా కుమార్తెపై ఉంటుంది తప్ప, అల్లుడు లేదా కోడలిపై కాదు. అత్తమామలను చూసుకోవడం అనేది అల్లుడు లేదా కోడలు స్వచ్ఛందంగా చేయాల్సిన పనికావాలితప్ప, బలవంతంగా చేయించకూడదు" అని పేర్కొంది. "ఒక మహిళకు తన కెరీర్, ఆర్థిక విషయాలు మొదలైన వాటికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ప్రాథమిక, సంపూర్ణ హక్కు ఉంటుంది. తన కోరికలు, అంచనాలకు అనుగుణంగా జీవించేలా భర్త తన భార్యను బలవంతం చేయలేడు" అని స్పష్టం చేసింది. "వివాహం అనేది అవతలి వ్యక్తి వ్యక్తిత్వం, స్వేచ్ఛ, సంకల్పాలను నియంత్రించడానికి, శాసించడానికి, ఆధిపత్యం చెలాయించడానికి లేదా అణచివేయడానికి ఇచ్చే అనుమతిపత్రం కాదు" అని అది పేర్కొంది. "కేవలం లింగభేదం ఆధారంగా మహిళ స్వయంప్రతిపత్తిని హరించడానికి లేదా ఆమె స్వేచ్ఛను పరిమితం చేయడానికి చేసే ఏ ప్రయత్నమైనా సమానత్వ సూత్రాలకు విరుద్ధం. మానవ గౌరవం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం" అని ధర్మాసనం అభిప్రాయపడింది.

# సంక్షిప్త వార్తలు

## ఆస్పత్రిలో అగ్నిప్రమాదం: 15మంది శిశువులు మృతి



**ఇస్లామాబాద్, ఆగస్టు 26:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని బుధవారం ఉదయం ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలోని లోపం కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కనీసం 15 మంది శిశువులు మరణించారు. పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్) ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య వార్డు మూడవ అంతస్తులో ఉదయం ఉదయం 6:45 గంటల ప్రాంతంలో నర్సరీ లోపల ఎయిర్ కండిషనింగ్ యూనిట్ పేలడంతో మంటలు చెలరేగాయని సహాయక సిబ్బంది తెలిపారు. ఆ సమయంలో వార్డులో 16 మంది నవజాత శిశువులు ఉన్నారని, వారిలో ఒకరిని రక్షించామని అధికారులు తెలిపారు.

## పంజాబ్‌లో నేడు ఉద్యోగులు, పెన్షనర్ల మహాబంద్

**అమృత్‌సర్, ఆగస్టు 26:** పంజాబ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కనున్నారు. గురువారం రాష్ట్రవ్యాప్త మహాబంద్‌కు పిలుపునిచ్చారు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి 4 లక్షల మంది ఈ బంద్‌లో పాల్గొననున్నారు. ఆప్ ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన డిఎలు ఇంకా విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ వారు ఈ ఆందోళన చేపట్టనున్నారు. దీంతో గురువారం మొత్తం ప్రభుత్వ కార్యకలాపాలతోపాటు, ప్రైవేటు కార్యకలాపాలు కూడా స్తంభించే అవకాశాలున్నాయి.

## రాజీనామాకు సిద్ధమైన కర్ణాటక మంత్రి నాగేంద్ర

**బెంగళూరు, ఆగస్టు 26:** కర్ణాటక మంత్రి బి.నాగేంద్ర రాజీనామాకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. గిరిజన సంక్షేమ శాఖలో అక్రమాల ఆరోపణల కేసులో నిందితుడిగా ఉన్న ఆయనపై విపక్షాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. మంత్రివర్గంలోకి తీసుకోవడంపై సొంత పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. నాగేంద్ర మంగళవారం ముఖ్యమంత్రి డికె శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. తన కొనసాగింపు పార్టీకి ఇబ్బందిగా మారుతోందని చెప్పినట్లు తెలుస్తోంది. బిజెపి తనను లక్ష్యంగా చేసుకుంటోందని, పార్టీ ప్రతిష్ఠ కోసం పదవి నుంచి తప్పుకొనేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పినట్లు సమాచారం.

## జాత్యహంకార వ్యాఖ్యలపై ఉషావాన్స్ కౌంటర్

**న్యూయార్కు, ఆగస్టు 26:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ జాతి వివక్ష వ్యాఖ్యలను ఎదుర్కొన్నారు. ఆమె భారతీయ మూలాలను ఉద్దేశిస్తూ మిచిగాన్ డెమొక్రాటిక్ సెనేట్ అభ్యర్థి అబ్దుల్ ఎల్‌సయీద్ చేసిన వ్యాఖ్యలు అమెరికా రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ విమర్శలపై ఉషా వాన్స్ ఎంతో హుందాగా, గట్టిగా స్పందించారు. ఇటీవల ఒక ర్యాలీలో జేడీ వాన్స్, అబ్దుల్ ఎల్ సయీద్పై విమర్శనాస్త్రాలు సంధించారు. షరియా చట్టంపై విమర్శలను శ్వేతజాత్యహంకారంతో ముడిపెడుతూ గతంలో ఎల్‌సయీద్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు.

## ఇమ్రాన్ ఆరోగ్యంపై కుమారుడి ఆందోళన

**ఇస్లామాబాద్, ఆగస్టు 26:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్‌ఏఇన్సాఫ్ అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆయన కుమారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జైలులో ఏకాంత నిర్బంధంలో ఉన్న తమ తండ్రికి సరైన వైద్యం అందకపోతే ఆయన ప్రాణాలకే ప్రమాదం జరగవచ్చని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన మీడియాసమావేశంలో ఇమ్రాన్‌కుమారులు ఖాసిం, సులేమాన్ ఈవ్యాఖ్యలు చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయన జైలునుంచి ప్రాణాలతోబయటపడటం కష్టంగానే కనిపిస్తోందని ఖాసిం వ్యాఖ్యానించారు.

## ఫైరింజన్ నీళ్లతో ఎమ్మెల్యే కారు శుభ్రం

**సింగ్రౌలీ, ఆగస్టు 14:** మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీకి చెందిన బిజెపి ఎమ్మెల్యే రామ్ నివాస్ షా కారును ఫైరింజిన్ నీటితో శుభ్రం చేశారు. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ అయింది. అగ్నిప్రమాద సమయంలో ఎమర్జెన్సీ కోసం వినియోగించే ఫైరింజిన్ నీటితో కారును క్లీన్ చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ నివాసం ఆవరణలో టొయోటా ఇన్నోవా కారును క్లీన్ చేశారు. అయితే తనకు తెలియకుండానే కారును శుభ్రం చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

## ‘మదర్ థెరిసా నిస్వార్థ సేవలను మననం చేసుకుందాం’

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పేదలు, అనాథల సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతావాది, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. ప్రేమారాహిత్యంతో బాధపడుతున్న వారిని మదర్ థెరిసా అక్కున చేర్చుకున్నారని తెలిపారు. ఆమె నిస్వార్థ సేవలను స్మరించుకుందాం అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు తెలియజేశారు. సాటిమనిషిలోని బాధను తొలగించడమే దైవత్వం. పేదరికం, ప్రేమరాహిత్యంతో బాధపడుతున్న నిస్సహాయులను అక్కున చేర్చుకుని ప్రేమను పంచి, సపర్యలు చేశారు 'మదర్ థెరిసా'. ఈరోజు ఆ మహనీయురాలి జయంతి సందర్భంగా విశ్వవ్యాప్తమైన ఆమె నిస్వార్థ సేవలను, దివ్య చరితను మననం చేసుకుందాం అంటూ ఎక్స్‌లో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు.

## సిపిఎం నేత మధు సతీమణి సుమతి మృతికి సిఎం సంతాపం

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** సిపిఎం సీనియర్ నేత మధు సతీమణి సుమతి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఐద్వా నాయకురాలిగా మహిళా హక్కుల సాధన కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె నిరంతరం పోరాడారని కొనియాడారు. మరణానంతరం ఆమె భౌతికకాయాన్ని వైద్య పరిశోధనలకు అప్పగించడం అత్యంత ఆదర్శనీయమని ప్రశంసించారు. సుమతి కుటుంబ సభ్యులకు సిఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మానవతా సేవకు ప్రతీకగా రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో సౌమ్య

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** మానవ మహోపకారి, విశ్వ కారుణ్యమూర్తి, జగద్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జన్మదినాన్ని పురస్కరించుకుని నందిగామ పట్టణంలోని ప్రతిభ హైస్కూల్ వేదికగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులతో కలిసి రక్తదాన శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సౌమ్య, రక్తదాతలను అభినందించారు. అత్యవసర సమయంలో ఒకరి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో విలువైన సేవ అని, సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన ప్రేమ, దయ, సేవా భావాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలంతా పరస్పర సహకారం, సోదరభావంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సౌమ్య ఆకాంక్షించారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, మత పెద్దలను, కూటమి నాయకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, రక్తదాతలు పాల్గొన్నారు.


# తిరుమల సమాచారం

## అనూహ్యంగా పెరిగిన రద్దీ
### వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వారాంతం ముందే తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. బుధవారం సెలవు కావడంతో ఉదయానికి తిరుమలలో భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల రెండు కిలోమీటర్లు దూరం చేరాయి. ఇష్టదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు చేరుకోవడంతో కొండపై రద్దీ పెరిగింది. ఉదయం 6గంటలకే తిరుమలలో వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్ నిండిపోయాయి. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 41వేల మంది భక్తులు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.

## 28న మలయప్పస్వామి గరుడసేవ



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామికి ఈనెల 28వ తేదీ శుక్రవారం రాత్రికి గరుడసేవ జరుగుతుంది. సాధారణంగా ప్రతినెలలో పౌర్ణమి గరుడసేవ టిటిడి నిర్వహిస్తుంది. 28న శ్రావణపౌర్ణమి పర్వదినం సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. దివ్యాభరణాలు ధరించి మలయప్పస్వామి జగన్మోహన రూపంలో గరుడ వాహనంపై అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారు.

## “స్వయంభూ” చిత్రం త్వరలోనే విడుదల



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి తన ఇష్టదైవమని, ఆ స్వామిని మనసారా కొలిచి వేడుకుంటే అంతా శుభాలు కలుగుతాయని సినీనటుడు నిఖిల్ సిద్ధార్థ్ తెలిపారు. తాను ఇప్పటికే మూడు చిత్రాల్లో నటిస్తున్నా త్వరలోనే “స్వయంభూ” చిత్రం విడుదల కానుందని నిఖిల్ చెప్పారు. చిత్రం విడుదల తేదీ ప్రకటించడానికి ముందు తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. స్వామివారి ఆశీస్సులతోనే చిత్రాల్లో బిజీగా నటిస్తున్నాని విశ్వాసం వెలిబుచ్చారు. నిర్మాత ఠాగూర్ మధుతో కలిసి బుధవారం ఉదయం తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ఆ స్వామివారి దర్శనం తనకెంతో ఆనందం కలిగించిందని అన్నారు. తాను నటించబోయే రాబోయే కొత్త చిత్రాలు విజయవంతం కావాలని, స్వామివారి ఆశీస్సులు పొందడానికి శ్రీవారి దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. క్యూ లైన్లలో నిఖిల్ చూసిన అభిమానులు, భక్తులు ఆలయ వెలుపల ఆయనతో ఫోటోలు, సెల్ఫీలు దిగడానికి ఆసక్తి చూపించారు.

# సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా జగన్‌రెడ్డి

- మంత్రి కొల్లు రవీంద్ర సవాల్
- ఎన్ని అబద్దాలు చెప్పినా వైసిపిని ప్రజలు నమ్మరని వ్యాఖ్య



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమపై ఇప్పుడు కపట ప్రేమ చూపుతున్న జగన్ రెడ్డి, తన పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు ఎంత ఖర్చు చేశారో చెప్పగలరా అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సవాల్ విసిరారు. ‘గత ఐదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులపై జగన్ రెడ్డి రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ఏకంగా రూ.13,500 కోట్లు ఖర్చు చేసింది. పట్టిసీమ ప్రాజెక్టు దండగ, పంపుల్ని ఇనప సామాన్లకు అమ్ముకోవడం ఉత్తమం అని విమర్శించిన జగన్, ఇప్పుడు అదే ప్రాజెక్టు కృష్ణా డెల్టా ప్రాంతంలో తాగు, సాగునీటి అవసరాలకు అండగా నిలుస్తోందనే విషయం గుర్తుంచుకోవాలి. హంద్రీనీవా ప్రాజెక్టు కోసం వేల కోట్లు ఖర్చు చేస్తూ కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందిస్తున్నాం. వెలిగొండ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.8 వేల కోట్లు ఖర్చు చేశాం. నిర్వాసితులకు పరిహారం అందించే చర్యలు చేపడుతున్నాం. పురుషోత్తపట్నం ద్వారా అనకాపల్లి వరకు నీటిని తీసుకెళ్లే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి 2029 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది’ అని వివరించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, రైతుల సంక్షేమం, బిసి రిజర్వేషన్లు, డ్రగ్స్, మద్యం, పెట్టుబడులు, ఉద్యోగాల అంశాలపై జగన్ చేస్తున్న విమర్శలు రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప ప్రజల కోసం ఏ మాత్రమూ కాదని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగాన్ని, వ్యవసాయాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని పాలన సాగిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. వైసిపి నేతల కల్తీ మద్యం నుండి, గంజాయి గూండాల నుండి, డ్రగ్స్ మాఫియాల నుండి కాపాడుకుంటున్నామన్నారు. జగన్ రెడ్డికి ప్రజల పట్ల చిత్తశుద్ధి, ప్రజాస్వామ్యం పట్ల బాధ్యత ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. అంతేగానీ ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. కరువు పరిస్థితులు, వర్షాభావం వంటి అంశాలపై అసెంబ్లీలో క్షుణ్ణంగా చర్చించాం. ఆ సమయంలో జగన్ రెడ్డి సహా వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. రాష్ట్రంలో మంచినీటి అవసరాలు తీర్చి వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల్ని ప్రోత్సహిస్తున్నాం. గత ప్రభుత్వం రైతులకు ఏం మేలు చేసిందో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు.

# రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే ప్రభుత్వం స్పందించడం లేదు

### వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మండిపాటు



**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాలు కురవక, పంటలు పండక రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే, నీటి విడుదల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా రాయలసీమ ప్రాజెక్టుల పట్ల కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటిని కరవుతో అల్లాడుతున్న రైతులకు అందించాల్సింది పోయి తెలంగాణతో పోటీపడి విద్యుత్ ఉత్పత్తి కోసమే వినియోగించడం దారుణమన్నారు. అవకాశమున్నా పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేయడానికి చంద్రబాబుకు మనసు ఒప్పలేదని విమర్శించారు. సెప్టెంబర్ 15 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో, రానున్న రోజుల్లో రాయలసీమకు నీరు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కరవు భయంకరమైన పరిస్థితులకు దారితీసిందని, మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతంలోనూ తీవ్రమైన అభద్రతా వాతావరణం నెలకొన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 52 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, మొత్తం 688 మండలాలకు గానూ 625 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో తక్కువ వర్షాలు పడతాయని తెలిసినప్పటికీ పంటలకు నీళ్లిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందని, వారి మాటలను నమ్మి ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై వైసిపి అధినేత జగన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని తమ పార్టీ విసిరిన సవాలుకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదని ఆయన ఆరోపించారు.

# నవంబర్‌లో శ్రీవారి పుష్పయాగం

- ఒక్క టికెట్‌పై ఒకే రోజు రెండుసార్లు తిరుమలేశుని దర్శనం



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి క్షణకాలంపాటు దర్శించుకుంటేనే లక్షలాదిమంది భక్తులు ఆత్మసంతృప్తి చెందుతుంటారు. ఇంకా ఆ స్వామిని మళ్ళీమళ్ళీ చూడాలనిపించి భక్తుల మనసు ఉవ్విళ్ళూరుతుంది. నవంబర్‌లో శ్రీవారి ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామికి జరిగే పుష్పయాగం రోజు ఒక్క టికెట్ పొందితే ఒకే రోజు తమ ఇష్టదైవమ్ తిరుమలేశుని రెండుసార్లు దర్శించుకునే అద్భుత అవకాశాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించింది. శ్రీవారి ఆలయంలో నవంబరు 16న పుష్పయాగం జరగనుంది. ఈ పుష్పయాగానికి సంబంధించిన ఆర్జితసేవా టికెట్లను టిటిడి ఈ నెలలోనే విడుదల చేయనుంది. ఈ టికెట్ రూ.700లు చెల్లించి ఇద్దరు గృహస్థ భక్తులకు బుక్ చేసుకునే అవకాశం ఉంది. పుష్పయాగం టికెట్ పొందినవారు నవంబర్ 16న ఉదయం ఆరు గంటలకు తిరుమలలోని సుపథం మార్గం ద్వారా ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో నిర్వహించే స్నపన తిరుమంజనం అభిషేకసేవలో పాల్గొనవచ్చు. ఆ తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. మళ్ళీ అదే రోజు రెండోసారి మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ టికెట్ ఉన్న భక్తులు సుపథం మార్గం క్యూలైన్లలో ప్రవేశించి మలయప్ప స్వామికి నిర్వహించే పుష్పయాగ మహోత్సవంలో పాల్గొంటారు. ఆలయంలోపల మరోసారి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.


# వర్షాల కోసం 30నుండి కారీరిష్టి పర్జన్య శాంతి యాగం



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే తక్కువ వర్షపాతం నమోదైంది. ఉపద్రవాల నుండి ప్రజలను రక్షించడానికి, నీటిసమస్య అధిగమించడానికి దీంతో ధార్మిక సంస్థ టిటిడి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పంటలు పండి, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ నుండి ఐదు రోజుల పాటు ధర్మగిరి వేదపాఠశాలలో వరుణయాగాన్ని నిర్వహించేలా నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వర్షాలు పడి నీటి సమస్య లేకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం ఆధ్వర్యంలో వరుణయాగాన్ని నిర్వహించాలని ముహుర్తాన్ని నిర్ణయించారు. ఇందులో భాగంగా వేదవిజ్ఞానపీఠంలో యాగకర్త, రుత్వికుల సమక్షంలో ఆగస్టు 30, 31, సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో వరుణయాగాన్ని నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిని ప్రార్థిస్తూ తిరుమలలో ఆగస్టు 30 నుండి వరుణయాగం (కారీరి ఇష్టి, పర్జన్య శాంతి) నిర్వహించనున్నారు. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో నిర్వహించనున్న వరుణయాగంతో దేశంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని వరుణ దేవుడిని ప్రార్థించనున్నారు. మేఘాలను ఆకర్షించి కుంభవృష్టి వర్షం కురిసేలా అనుగ్రహించాలని వేదమంత్రాలతో పూజిస్తారు.

## ఎపిని వైసిపి అన్యమత ప్రదేశ్‌గా మార్చారు

### బిజెపి నేత భానుప్రకాశ్ రెడ్డి



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** గత వైసిపి పాలనలో హిందూ ఆలయాలు, విగ్రహాలపై దాడులు చేసి అన్యమత ప్రదేశ్‌గా మార్చారని టిటిడి బోర్డు సభ్యుడు జి. భానుప్రకాశ్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. సనాతన ధర్మాన్ని నాశనం చేసేందుకు ఎవరు యత్నించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. మాజీ ఎంపి విజయసాయిరెడ్డి వైసిపిలో ఉన్నపుడే సనాతన ధర్మం గురించి మాట్లాడి ఉంటే బాగుండేదని అభిప్రాయం వెలిబుచ్చారు. వైసిపి అధినేత జగన్‌పై టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో ధాన్యంతో అలరారే అన్నపూర్ణ వంటి ఆంధ్రప్రదేశ్‌ను అన్యమత ప్రదేశ్‌గా మార్చేశారంటూ దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలు, దేవతామూర్తుల విగ్రహాలపై దాడులు జరిగాయని, విగ్రహాల చేతులను సైతం ఖండించిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతన ధర్మానికి ఎలాంటి హాని కలగకుండా కాపాడేందుకు బిజెపి కంకణబద్ధమై ఉందన్నారు. విజయసాయిరెడ్డి ఆరోజే సనాతన ధర్మం గురించి మాట్లాడి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. వైసిపి నుంచి బయటకు వచ్చాక మాట్లాడితే దాని విలువ తగ్గుతుందని అన్నారు. కాకినాడలో చోటుచేసుకున్న సౌజన్య ‘లవ్ జిహాద్’ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిందని, దేశంలో వేలాది మంది యువతులు ఈ నెట్‌వర్క్‌కు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ దుర్మార్గానికి ఒడిగట్టిన సాధిక్ లాంటి వ్యక్తుల వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకి విజ్ఞప్తి చేశారు.

## ఆలయ అర్చకులు సస్పెన్షన్

- ఉప కమీషనర్ గోగినేని లీలా కుమార్

**పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త:** పెదకాకాని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవాలయానికి సంబంధించిన పలువురు అర్చకులను సస్పెండ్ చేస్తూ దేవాలయం ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. దేవాలయంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారికి సంబంధించిన బంగారపు మంగళసూత్రాలు అదృశ్యమైన వ్యవహారంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. మంగళసూత్రాలు అదృశ్యమైన వ్యవహారంలో బాధ్యతారాహిత్యం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తదితర ప్రాథమిక కారణాలపై ఆ సమయంలో విధుల్లో ఉన్న ఐదుగురు అర్చకులపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. సస్పెండ్ అయిన వారిలో ఉప ప్రధాన అర్చకుడు చదలవాడ జాలయ్య, అర్చకులు పొత్తూరి విజయప్రతాప్, కుందుర్తి విశ్వనాథ్, చదలవాడ రుద్ర గాయత్రి మణికంఠశాస్త్రి, కాంట్రాక్టు అర్చకుడు గర్నెపూడి గిరికుమార్‌లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.

## జగనే వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపం

### మంత్రి సత్యకుమార్ యాదవ్


సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపమని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. ఆయన వెన్నుపోటుపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇతరులకు నీతులు చెప్పే ముందు రాజకీయ చరిత్ర చూసుకోవాలంటూ జగన్‌కు చురకలంటించారు. జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ వ్యవహారంలో వైఎస్ జగన్ వైఖరిపై మంత్రి మండిపడ్డారు. బిసి రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ వైసిపి అధినేతపై మంత్రి సత్యకుమార్ యాదవ్ నిప్పులు చెరిగారు. రిజర్వేషన్లు ప్రకటించడం కాదు.. చట్టబద్ధంగా నిలబెట్టడమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. జగన్ హయాంలో బిసి రిజర్వేషన్లు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయని అన్నారు. కూటమి ప్రభుత్వం బిసిలకు చట్టబద్ధమైన సామాజిక న్యాయం చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. బిసిలను ఓటు బ్యాంకుగా చూసింది జగన్ ప్రభుత్వమేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తు చేశారు. బిసిలను పాలనలో భాగస్వాములుగా చేస్తుంది కూటమి ప్రభుత్వమని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటమిపై జగన్‌లో ఇప్పుడే ఆందోళన మొదలైందంటూ ఎద్దేవా చేశారు. ఓటమికి కారణాలు వెతికే పనిలో జగన్ ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. కూటమి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజల మద్దతు కూటమి ప్రభుత్వానికే ఉందని జగన్ ఆందోళనతో మరోసారి తేలిపోయిందని మంత్రి వివరించారు.

## లొంగిపోయిన హిడ్మా గన్‌మెన్

### మరో ఇద్దరు సహచరులూ... ధ్రువీకరించిన పోలీసులు




**చింతూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:** రంపచోడవరం ఓఎస్‌డి పంకజ్ కుమార్ మీనా ఎదుటి ముగ్గురు మావోయిస్టులు బుధవారం లొంగిపోయారు. ఈ సందర్భంగా చింతూరు ఎఎస్‌పి. కార్యాలయంలో మీడియా సమావేశంలో ఓఎస్‌డి పంకజ్ కుమార్ మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయి మావోయిస్టు పార్టీ ప్లాటూన్ కమిటి సభ్యురాలు ముచ్చికి మంగి, పార్టీ సభ్యులు కణితి లక్ష్మయ్య, కణితి ఎంక లొంగిపోయినట్టు ప్రకటించారు. మావోయిస్టులకు పట్టు తగ్గటం, పోలీసుల గస్తీ, క్యాంప్స్ పెరగటం వల్ల స్వేచ్ఛాగా తిరగలేక లొంగిపోయినట్టు తెలిపారు. లొంగిపోయిన వారికీ సరేండర్, రిహాబిటేషన్ పాలసి ప్రకారం ప్రశాంత జీవితం గడపటానికి ప్రభుత్వం ద్వారా అర్హత ఉన్న అన్ని సౌకర్యాలు అందించబడుతాయని అన్నారు. ఇంకా ఎవరైన అడవుల్లో, దళల్లో తిరుగుతుంటే ప్రశాంత జీవితం కోసం లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగి హిడమాకు అంగరక్షకురాలిగా 2023 వరకు పనిచేసి, ఆరోగ్యం సహకరించక కుంట ఎల్ఓఎస్‌లో చేరిందని తెలిపారు. ఈ సమావేశంలో ఓఎస్‌డితో పాటు దీప, సిఆర్‌పిఎఫ్ బెటాలియన్, చింతూరు సిఐ సిహెచ్ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


## రహదారి లేక ఎన్నాళ్లీ కష్టాలు...!

**పార్వతీపురం మన్యం జిల్లా (కొమరాడ) ఆగస్టు 26 ప్రభాతవార్త:** స్వతంత్రం వచ్చి 8 దశాబ్దాల కాలం పూర్తయిన గిరిజన గ్రామాలలో సరైన రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు గిరిశిఖర గ్రామాలలో ఈ ఒక్కరికి సుస్తి చేసినా డోలిపై కానీ భుజలపై గాని మోసుకుంటూ కిలోమీటర్ల కొలది నడుచుకుంటూ మైదాన ప్రాంతానికి వచ్చి వైద్యం పొందవలసిన దుస్థితి ఉంది. పార్వతీపురం మన్యం జిల్లాలో రోడ్డు మార్గలు లేక గిరిశిఖర గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే చాలు వారి కష్టాలు మరింత రెట్టింపవుతున్నాయి. జబ్బుచేస్తే దవాఖానకు వెళ్లాలంటే కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా కొమరాడ మండలం చోళ్లపదం గ్రామ పంచాయతీ వనధార గ్రామంలో జ్వరంతో ఉన్న యశ్వంత్ అనే బాలుడిని భుజాన మోసుకుని 5 కిలోమీటర్లు నడిచి వెళ్లిన దృశ్యం ప్రతి ఒక్కరిని కదిలించింది. రోడ్డు మార్గం లేకపోవడంతో వాగులు వంకలు దాటుతూ 5 కిలోమీటర్లు నడిచి మైదాన ప్రాంతంలో ఉన్న కూనేరు రాంబద్రపురం హాస్పిటల్‌కు తీసుకువెళ్లి వైద్యం చేయించాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## వ్రతం చేశారు బంగారం మురికి కాలువలో పడేశారు!

**విశాఖపట్నం ఆగస్టు 26 ప్రభాతవార్త:** పండగ పూట ఎంతో భక్తితో అమ్మవారికి అలంకరించిన బంగారు నగలను పొరపాటున పూలతో పాటు డ్రైనేజీ కాలువలో పడేసింది ఓ కుటుంబం. తీరా విషయం తెలుసుకుని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించగా, వారు రంగంలోకి దిగి గంటలపాటు శ్రమించి ఆ నగలను వెలికితీసి అప్పగించారు. విశాఖపట్నంలోని గాజువాకలో జరిగిన ఈ ఆసక్తికర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గాజువాక శ్రీనగర్‌కు చెందిన ఉడుముల రమేశ్, దివ్య దంపతులు ఈ నెల 21న అత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుమారు 8 తులాల బంగారు ఆభరణాలతో అలంకారం చేశారు. ఆనవాయతీ ప్రకారం మూడు రోజుల పాటు నగలను అమ్మవారి వద్దనే ఉంచారు. ఆదివారం (23వ తేదీ) పూజా సామాగ్రిని తొలగించే క్రమంలో రమేశ్.. అమ్మవారికి అలంకరించిన 3 తులాల హారం, కాసులను మాత్రమే తీసి భద్రపరిచారు. అయితే, పూలు, ఇతర పూజా సామగ్రిలో కలిసిపోయిన సుమారు 5 తులాల బరువున్న కంకణం, రెండు గొలుసులు, మూడు ఉంగరాలను ఆయన గమనించలేదు. నిర్మల్యం మొత్తాన్ని ఒక ఎర్రటి వస్త్రంలో చుట్టి, దుర్గా నగర్ సమీపంలోని స్టీల్ ప్లాంట్ రైల్వే బ్రిడ్జి కింద ఉన్న డ్రైనేజీ కాలువలో పడేశారు. ఇంటికి వెళ్ళిన తర్వాత నగలు కనిపించకపోవడంతో వారికి అనుమానం వచ్చింది. వెంటనే కాలువ వద్దకు పరుగులు తీసి వెతికినా ఫలితం లేకపోవడంతో, స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన సీఐ కేశవరావు, సిబ్బందిని రంగంలోకి దించారు. జేసీబీ సహాయంతో కాలువలో నీటి ప్రవాహాన్ని మళ్లించి, వేగాన్ని తగ్గించారు. అనంతరం కాలువలో చెల్లాచెదురుగా పడి ఉన్న నగలను సిబ్బంది ఒక్కొక్కటిగా వెలికితీశారు. ఆ ఆభరణాలను దంపతులకు సురక్షి తంగా అప్పగించారు. పోయాయనుకున్న బంగారం తిరిగి చేతికి అందడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయింది. పోలీసులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పండగలు, పూజల సమయంలో విలువైన వస్తువుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

## అంతా మంచి జరగాలని శ్రీవారి ఆశీస్సులందుకున్నాం



**తిరుమల, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగురాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని, రాష్ట్ర ప్రజలకు అంతా మంచి జరగాలని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని తమిళనాడు ప్రభుత్వ అదనపు కార్యదర్శి డాక్టర్ అముద, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్‌నాయక్, సినీనటుడు సమీర్ హసన్, అపర్ణారావు కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# తిరుపతిలో కుప్పకూలిన నాలుగు అంతస్తుల భవనం

## ముగ్గురు కార్మికులకు గాయాలు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** నిర్మాణంలో ఉన్న పక్క భవనానికి ఆనుకుని ఉన్న పాత భవనం ఉన్నఫళంగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం తప్పింది. నాలుగంతస్తుల భవనానికి బీటలు వారడంతో ఆ ఇంట్లో ఉంటున్న సభ్యులు ఖాళీచేసిన కొన్ని గంటల్లోనే ఈ సంఘటన జరగడం విశేషం. ఈ సంఘటనతో ఏం జరిగిందనే కలకలం రేగింది. తిరుపతి- పద్మావతిపురం ప్రధాన మార్గంలో ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని వాణీనగర్‌లో కలశం బిల్డింగ్ పక్కనే ఈ ప్రమాదం జరిగింది. భవనం కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నూతన భవనం నిర్మాణం కోసం పక్కనే గుంత తవ్వుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గుంత తవ్వకాల్లో భాగంగా భవనం పునాదులు బలహీనపడటంతోనే కూలిపోయింది. భవనం కూలిపోవడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని శిథిలాలను తొలగించే పనులు చేపట్టారు. శిథిలాల కింద ఎవరూ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. నూతన భవన నిర్మాణం కోసం గుంతలు తవ్వడం వల్ల పునాదులు బలహీనపడి, కూలిన భవనానికి బీటలు వారడంతోనే కూలిపోయిందని అధికారులు నిర్ధారణకు వచ్చారు.

## కాకినాడలో దారుణ హత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేక ప్రతినిధి, ఆగస్టు 26 ప్రభాతవార్త:** కాకినాడ నగరం నడిబొడ్డున ఉన్న భానుగుడి సెంటర్‌లో బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల ప్రాంతంలో ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడు కోడమాటి సతీష్ రెడ్డి (30)గా పోలీసులు గుర్తించారు. సతీష్ కాకినాడలో జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. భానుగుడి సెంటర్‌లోని చార్మినార్ టీ స్టాల్ సమీపంలో సతీష్ రెడ్డిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు తెలిసింది. కత్తితో మెడ భాగంలో పొడిచి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. హత్యకు అక్రమ సంబంధం, ఆర్థిక లావాదేవీలు కారణమై ఉండవచ్చన్న కోణంలో కాకినాడ టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పెరుగుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు

### ఇరాన్‌పై మరింత కఠినంగా అమెరికా ఆంక్షలు

**టెహ్రాన్, ఆగస్టు 26:** అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని అమెరికా మరింత పెంచుతోంది. గల్ఫ్ ప్రాంతం లోని ఇంధన సరఫరాలపై ప్రతి కార చర్యలు తీసుకుంటామని ఇరాన్ హెచ్చరిస్తోంది. మరోవైపు, పశ్చిమాసియాలో హోర్ముజ్ జలసంధిపై నియంత్రణ విషయంలో ఇరు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతంలో చోటుచేసుకుంటున్న కీలక ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు మరింత కఠినం చేసింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఆదాయ మార్గాలను దెబ్బతీయడంతో పాటు, టెహ్రాన్‌ అంతర్జాతీయంగా మరింత ఒంటరిచేసే లక్ష్యంతో అమెరికా విస్తృత స్థాయిలో కొత్త ఆంక్షలను అమలు చేస్తోంది. అమెరికా ట్రెజరీ, పెరుగుతున్న ఆర్థిక ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ విలువ మరోసారి రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. దీంతో ఇప్పటికే సంక్షోభంలో ఉన్న ఇరాన్ ఆర్థిక పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. దీంతో ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి.ఇరాన్‌పై ఒత్తిడికి మిత్రదేశాలు కలిసిరావాలని అమెరికా పిలుపునివ్వడంతో పాటు మరింత కఠినతరం చేస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ఇరాన్‌తో ఆర్థిక, ఆర్థిక సంబంధాలను తెంపు కోవాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతోంది. హర్ముజ్ జలసంధిలో కొనసాగుతున్న అంతరాయాల నేపథ్యంలో అమెరికా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల నుంచి మరోసారి భారీగా చమురు విడుదలైంది. దీంతో ఆ నిల్వలు 1982 తర్వాత ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి.

# పార్లమెంట్ పరిధిలో సమన్వయంతో పనిచేద్దాం

## టిడిపి శ్రేణులకు పనబాక లక్ష్మి హితవు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వాలని పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని తెలిపారు. బుధవారం తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన టిడిపి కేడర్ నాయకులతో పార్లమెంట్ కార్యాలయంలో పనబాక లక్ష్మి సమావేశమయ్యారు. పార్లమెంట్ స్థాయి కమిటీలో తిరుపతి పార్లమెంట్ పరిధిలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, తిరుపతి ఇన్‌చార్జ్ జెబి శ్రీనివాస్, పార్లమెంట్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన అభిప్రాయాలు, సూచనలు, సలహాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేరవేయాలని సమావేశంలో చర్చించారు. అలాగే రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, నాయకులు- కార్యకర్తల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయాలని నిర్దేశించారు.

# ఉత్కంఠగా అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో నాలుగురోజులు పాటు జరుగుతున్న అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు పలు జిల్లాల క్రీడాకారుల మధ్య ఉత్కంఠగా సాగుతోంది. ఈ పోటీలు బుధవారం మూడో రోజు అనేక అంశాలపై క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారు. రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఇందులో కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హాకీ, బ్యాడ్మింటన్ జట్లు క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలను తిలకించేందుకు తిరుపతి యువత, విద్యార్థులు భారీగా తరలివస్తున్నారు.సందర్శకులతో తిరుపతి క్రీడా మైదానాలు సందడిగా మారాయి. విజయమే లక్ష్యంగా ఉత్సాహంగా బరిలోకి దిగుతున్న క్రీడాకారులు. ఖో ఖో అండర్ 23క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం మీద 3 పాయింట్స్‌తో విజయనగరం గెలుపొందింది. అండర్ 17 మహిళల విభాగంలో బాస్కెట్బాల్ కాకినాడ జట్టుపై పల్నాడు జిల్లా జట్టు హోరాహోరీగా తలపడగా పల్నాడు జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్ళింది. బాస్కెట్ బాల్ అండర్ 17 బాలికల విభాగంలో గుంటూరు, పశ్చిమగోదావరి జట్టుల క్వార్టర్స్‌లో పోటాపోటీగా తలపడుతూ, తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఖో ఖో అండర్ 23 క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరు మీద 105 పాయింట్స్‌తో అనంతపురం గెలుపొందింది. అండర్ 23 పురుషుల హాకీ జట్టులో విశాఖపట్నం జట్టుపై అనకాపల్లి జిల్లా జట్టు విజయం సాధించింది. హాకీ అండర్ 23 పురుషుల విభాగంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా మూడవ క్వార్టర్స్ ఫైనల్‌లో హోరా హోరీగా తలపడుతూ, తమ ప్రతిభను చాటుకున్నారు. అండర్-17 మహిళల వాలీబాల్ క్వార్టర్ ఫైనల్స్‌లో సత్యసాయి- ఎన్టీఆర్ జిల్లాల జట్ల క్రీడాకారులను శాప్ చైర్మన్ రవి నాయుడు పరిచయం చేసుకున్నారు. అనంతరం మ్యాచ్‌ను ప్రారంభించి, ఇరు జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడాస్ఫూర్తితో ప్రతిభను ప్రదర్శించి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. వాలీబాల్ అండర్ 17 గర్ల్స్ ఎన్టీఆర్ జిల్లా పై విశాఖపట్నం జిల్లా 12 పాయింట్లతో గెలుపొందారు.

# వృద్ధురాలి హత్య కేసు నిందితుల అరెస్ట్

- బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనంకేసు ఛేదనలో పోలీసు డాగ్, సిసి కెమెరాల పుటేజీలు కీలకం



**శ్రీకాకుళం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేట గ్రామానికి చెందిన చింతు చిన్నమ్ముడు(70) హత్య కేసును శ్రీకాకుళం జిల్లా పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి, మృతురాలి వద్ద నుంచి అపహరించిన సుమారు రూ.38 లక్షల విలువైన 24 తులాల బంగారం, 6 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, మృతురాలు హైదరాబాద్‌లో నివసిస్తూ అప్పుడప్పుడు తన స్వగ్రామమైన అల్లాడపేటకు వచ్చి వెళ్తుండేది. ఈ క్రమంలో ఆగస్టు 11న గ్రామానికి వచ్చిన ఆమె, 17న గ్రామంలో జరిగిన కార్యక్రమానికి బంగారు ఆభరణాలు ధరించి హాజరై, అనంతరం ఆర్టీసీ బస్సులో నరసన్నపేటకు చేరుకుంది. అక్కడ సుమారు ఉదయం 11.30 గంటలకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం నిమిత్తం లాయర్ ధనలక్ష్మి ఇంటికి వెళ్లింది. అనంతరం ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో జలుమూరు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో, మృతురాలు ధరించిన బంగారు ఆభరణాలను కాజేయాలనే ఉద్దేశంతో బెండి అచ్యుతరావు, కింతలి ధనలక్ష్మి, గణేష్ తదితరులు పథకం రూపొందించినట్లు పోలీసులు గుర్తించారు. పథకం ప్రకారం మృతురాలిపై దాడి చేసి హత్య చేసిన అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించి, మృతదేహాన్ని గోనె సంచిలో ఉంచి తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మృతదేహాన్ని హిరమండలం మండలం పిండ్రువాడ సమీపంలోని బ్రిడ్జి కింద తంపర కాలువలో పడవేసినట్లు గుర్తించారు. అనంతరం నిందితులు అపహరించిన సొత్తును తమ మధ్య పంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి, హత్యకు దోపిడీ ఉద్దేశం ఉన్నట్లు నిర్ధారించి మర్డర్ ఫర్ గైన్ కేసుగా దర్యాప్తు కొనసాగించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తులో భాగంగా సిసి కెమెరాలు, సాంకేతిక ఆధారాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తు మరియు క్షేత్రస్థాయి సమాచారాన్ని సమన్వయం చేస్తూ పోలీసులు కేసును ఛేదించారు. సిడిఆర్ విశ్లేషణ, ట్రాకర్ డాగ్ సహాయం, కారు ట్రాకింగ్ హిస్టరీ, డ్రోన్, క్లూస్ టీమ్ విశ్లేషణ, స్థానిక సమాచారం సేకరణపై ఆధారాలను సమగ్రంగా విశ్లేషించి నిందితుల కదలికలు, పాత్రను నిర్ధారించి, బుధవారం ఉదయం సుమారు 9.00 గంటల సమయంలో తిలారు రైల్వే స్టేషన్ వద్ద నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.38 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు, నేరానికి ఉపయోగించిన తెల్లని కారు, బజాజ్ పల్సర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

# నేటి నుండి వ్యాసాశ్రమ శతాబ్దిఉత్సవాలు

- వాయిదా వేసుకోవాలని అధికారుల సూచన

**ఏర్పేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త :** ఏర్పేడు మండల కేంద్రంలోని వ్యాసాశ్రమంలో నేటి నుండి వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు పోలీస్ బందోబస్తు అందించాలంటూ ఆశ్రమ కోశాధికారి ఎ.అమర్‌నాథ్‌రెడ్డి జిల్లా ఎస్పిని అభ్యర్థించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశం తరువాత జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఆదేశాల మేరకు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆశ్రమ నిర్వాహకులు శతాబ్దిఉత్సవాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఆశ్రమ పాలకవర్గం పూర్వ విద్యార్థులు, భక్తుల మధ్య యాజమాన్య వివాదాలు పరిష్కారం కాలేదని, గతంలో జరిగిన ఘర్షణ వాతవావరణం పరస్పర ఆరోపణల నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం వున్నందున, ఆశ్రమం నిర్ణయించిన షెడ్యూల్‌లో బందోబస్తు నిర్వహించడం సాధ్యపడదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆశ్రమ నిర్వాహకులు శతాబ్ది ఉత్సవాలను రీషెడ్యూల్ చేసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. పోలీస్ బలగాల లభ్యత గురించి వివరణ ఇస్తూ టిటిడి దేవస్థానం పాలకోత్సవం, నవరాత్రి బ్రహ్మోత్సవాలు, వినాయక చవితి తదితర పండగల బందోబస్తు వున్న కారణంగా ఆశ్రమానికి తగినంత బందోబస్తు కేటాయించడం కష్టమని నిర్ణయిం చారు. ముందస్తు సమాచారం ఇవ్వక ఖరారు చేయడం వల్ల బందోబస్తు ఇవ్వలేమంటూ స్పష్టం చేశారు. కార్యక్రమాలు ఖరారు చేసే ముందు నిర్వాహకులు పూర్తి వివరాలు, భక్తుల సంఖ్య అంచనా అందించాల్సి వుంది. సాధ్యమైనంత వరకు ఆశ్రమం శాంతిభద్రతల దృష్ట్యా వాయిదా వేసుకోవాలని సూచించారు. అయితే ఇరువర్గాలు రెచ్చకొట్టే వ్యాఖ్యాలు ఆరోపణలు చేయరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు రేణిగుంట డిఎస్పి ఏర్పేడు ఎస్‌హెచ్‌ఓలకు కూడా జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# టిటిడి షాపుల టెండర్లలో రసాభాస

**తిరుపతి,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో టిటిడి కేటాయించే దుకాణాల టెండర్లలో రసాభాస చోటుచేసుకుంది. ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచిన టిటిడి ఎస్టేట్ విభాగం ఈ టెండర్లను బుదవారం తెరచి నిబంధనల మేరకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంది. తిరుపతిలో టిటిడికి సంబంధించి శ్రీనివాసం వసతి సముదాయం, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో ఈ దూకాణాలకు ఇటీవల టెండర్లు పిలిచింది. అర్హులైన వ్యాపారులు టెండర్లను దాఖలు చేశారు. టెండర్ల పరిశీలనలో టెండర్ షెడ్యూల్లలో ప్రతి పేజీ లో సంతకం చేయలేదన్న కారణంగా రెండు వందలకు పైగా టెండర్ షెడ్యూల్లు తిరస్కరణకు గురయ్యాయని సమాచారం. టెండర్ నిబంధనల్లో ఎక్కడా ప్రతి పేజీలో సంతకం చేయాలని పేర్కొనలేదని వ్యాపారులు వాపోతున్న. దుకాణాల కేటాయింపుల్లో ఇలా చేయడం మతలబు ఏంటని అధికారులతో వాదనకు దిగారు. దీంతో అక్కడి వ్యాపారులను వెలుపలికి పంపించారు. అలిపిరి, శ్రీనివాసం, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో దుకాణాలకు షీల్డ్ టెండర్లు పిలిచిన టిటిడి దుకాణాల టెండర్లలో వ్యాపారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నడం కారణంగానే కొంత మతలబు జరిగిందనేది తెలుస్తోంది,. ఈవిషయంగా సంబంధిత అధికారులను సంప్రదించడానికి ప్రయత్నించినా స్పందన లేదు.

# దుర్గమ్మ ఆలయంలో నేటి నుండి పవిత్రోత్సవాలు



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 26, ప్రభాతవార్త :** దుర్గమ్మ ఆలయంలో ఈనెల 27 నుండి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సర పవిత్రోత్సవాలు సందర్భంగా గురువారం మొదటి రోజు తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, పవిత్ర మాలాధారఉదయం 8 గంటల తర్వాతే భక్తులకు అమ్మవారి దర్శనం వుంటుందన్నారు. **పవిత్రోత్సవం వివరాలు:** ఆలయంలో నిత్య కైంకర్యాలు, అర్చనలు, పూజలు జరిగే సమయంలో తెలిసి లేదా తెలియక జరిగే దోషాలు, స్పర్శ దోషాలు,లోపాలు,అశుచులు తొలగిపోయి ఆలయ పవిత్రత పరిపూర్ణంగా నిలిచేందుకు ఆగమ శాస్త్రోక్తంగా ప్రతి ఏటా నిర్వహించే విశేష మహోత్సవమే ఈ పవిత్రోత్సవం. రంగురంగుల పట్టు దారాలతో ప్రత్యేకంగా రూపొందించిన పవిత్ర మాలలను ప్రధాన దేవతలకు, పరివార దేవతలకు ధరింపజేసి, హోమ క్రతువులు నిర్వహించడం ద్వారా ఇంద్రకీలాద్రి క్షేత్రానికి విశేషమైన ఆధ్యాత్మిక తేజస్సు సమకూరుతుందని పురాణోక్తి. ఉత్సవాల మొదటి రోజైన ఆగస్టు 27 (గురువారం) తెల్లవారుజామున 3 గంటలకు శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రధాన ఆలయంలో శాస్త్రోక్తంగా సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం శ్రీ అమ్మవారి మూలవిరాట్‌కు అర్చక పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య దివ్యమైన స్నపనాభిషేకం, పవిత్ర మాలాధారణ మహోత్సవాన్ని జరిపిస్తారు. ప్రధాన ఆలయంలో సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, పవిత్రాలంకరణ క్రతువులు పూర్తయ్యేంత వరకు దర్శనాలు నిలిపివేయబడతాయని, ఉదయం 8 గంటల తర్వాతే భక్తులకు శ్రీ అమ్మవారి సర్వదర్శనం కల్పించడం జరుగుతుందని ఇఒ శీనానాయక్ తెలిపారు. పవిత్రోత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ వైదిక హోమాలు, జపాలు,మూల మంత్ర హవనములు తదితర కార్యక్రమాలు దేవస్థానంలో నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మ సేవలో ఎన్నికల అధికారి ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా పవన్ కుమార్ శర్మ, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం దర్శించుకున్నారు.

**ఇంద్రకీలాద్రిపై అన్నప్రసాదం ప్రైవేటీకరణ అవాస్తవం:**
దుర్గమ్మ ఆలయంలో ప్రైవేటుకు ప్రసాదం అనే అంశం అవాస్తవం, నిరాధారమైనదని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇఒ వికె శీనా నాయక్ స్పష్టం చేశారు. భక్తులకు అందించే పవిత్ర అన్నప్రసాద వితరణను ఏ ప్రైవేట్ సంస్థకూ అప్పగించడం లేదని, భక్తులకు అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన, నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదం అందించేందుకు దేవస్థానం ముందుచూపుతో ఆలోచన చేసి అత్యాధునిక స్టీమ్ ఆధారిత వంటశాల పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందని వివరించారు. రూ.36.82 లక్షల దేవస్థాన నిధుల ఆదా తిరుమల తిరుపతి దేవస్థానంలో మెకనైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసిన టెక్నోలాజిక్ ఇంజనీర్స్ ఇండియా ప్రై.లి. సంస్థ ఈ పరికరాల సరఫరా, ఇన్‌స్టాలేషన్ కొరకు రూ. 2,31,82,668/ (జీఎస్టీ, రవాణా ఖర్చులు అదనం) కోట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మందికి పరిశుభ్రమైన వంటశాలలను విజయవంతంగా నిర్వహిస్తున్న అనుభవం కలిగిన హారేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ / అక్షయపాత్ర ఫౌండేషన్ వారు అదే ఆధునిక పరికరాలను కేవలం రూ. 1.95 కోట్లకు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారని, దీని ద్వారా దేవస్థానానికి ఏకంగా రూ. 36,82,668 నిధులు ఆదా అవుతాయన్నారు. ఈ ప్రతిపాదనను ఆలయ ధర్మకర్తల మండలి క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించగా, ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. నిత్యాన్నదాన పథకానికి విరాళం దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,00,150ల విరాళాన్ని విజయవాడకు చెందిన పి యశ్వంత్, కుటుంబ సభ్యులు బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మ ఆలయానికి ఆధునిక ప్రింటర్ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి అత్యాధునిక ప్రింటర్ కం జిరాక్స్ మెషిన్ విరాళంగా ఆర్‌వీ డిజిటల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న శుభ సందర్భంగా సుమారు రూ. 1,01,000 విలువైన అత్యాధునిక ప్రింటర్ కం జిరాక్స్ మెషిన్‌ను విరాళంగా బుధవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామదుగు వెంకట్రావు అందజేశారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# తిరుపతి మేయర్ సీటు కోసం యువత ఉరకలు!

- జీరో బడ్జెట్ రాజకీయాల వైపు చూపు
- యువతకు ప్రాధాన్యమంటున్న ప్రధాన పార్టీలు




**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి మేయర్ పీఠం కోసం రాజకీయ పార్టీల్లో కొత్త తరం నేతలు ఉరకలు వేస్తున్నారు. డబ్బు, అంగబలం కంటే ప్రజాసేవ, యువతతో అనుసంధానం, విద్యార్హతలు, సామాజిక సేవ వంటి అంశాలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈసారి మేయర్ రేసు గతంతో పోలిస్తే మరింత ఆసక్తికరంగా మారనుంది. తమిళనాడు రాజకీయాల్లో కనిపిస్తున్న కొత్త తరహా రాజకీయాల ప్రభావం, జెన్‌జీ ఓటర్ల ప్రాధాన్యం, 'జీరో బడ్జెట్ పాలిటిక్స్'పై పెరుగుతున్న చర్చ యువ ఆశావహుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. డబ్బు తీసుకోకుండా ఓటు వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన పిలుపు కూడా ఈ చర్చకు ఊతమిచ్చింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ యువతకు ప్రాధాన్యతనిస్తుండటం, వైసిపి అధినేత వైఎస్ జగన్ కూడా జెన్‌జీ యువతకు పెద్దపీట వేయాలనే సంకేతాలు ఇవ్వడం తిరుపతిలోని యువ రాజకీయ ఆశావహుల్లో ఆశలు పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే మేయర్ ఎన్నికల్లో కొత్త ముఖాలకు అవకాశం దక్కుతుందా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**మూడు సామాజిక వర్గాల మధ్యే పోటీ:** తిరుపతి రాజకీయాల్లో తొలి నుంచీ ప్రధానంగా రెడ్డి, బలిజ సామాజిక వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూ వచ్చింది. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవుల్లో ఈ సామాజిక వర్గాలకు చెందిన నేతలు పలుమార్లు విజయం సాధించారు. అయితే 2021లో తొలిసారిగా జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిసి-యాదవ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఆర్. శిరీష యాదవ్ మేయర్‌గా ఎన్నిక కావడం కొత్త సమీకరణాలకు తెరతీసింది. వచ్చే ఎన్నికల్లో మేయర్ పదవి కోసం కూటమి పార్టీలతో పాటు వైసిపి,, కాంగ్రెస్ పార్టీల నుండి బలిజ, రెడ్డి, యాదవ సామాజిక వర్గాలకు చెందిన పలువురు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

**కూటమిలో 'మేయర్'పై మిత్రపక్షాల మల్లగుల్లాలు:** 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి తరఫున జనసేన అభ్యర్థి శ్రీనివాసులు విజయం సాధించడంతో ఈసారి మేయర్ స్థానం టిడిపికి కేటాయించాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. అయితే తమకే అవకాశం ఇవ్వాలని జనసేన కూడా కోరుతున్నట్టు సమాచారం. దీంతో మేయర్ సీటు ఎవరికి దక్కాలన్న అంశంపై కూటమిలో అంతర్గత చర్చలు మొదలైనట్టు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కూటమి అధిష్ఠానం మూడు పార్టీల కీలక నేతల అభిప్రాయాలను సేకరించే ప్రయత్నం చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

**అనితా యాదవ్‌కు అనగాని ఆశీస్సులు:** ఈ నేపథ్యంలో టిడివి రాష్ట్ర కార్యదర్శి అన్నా అనితా యాదవ్ పేరు టిడిపి మేయర్ అభ్యర్థిగా ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఎన్నికల్లో వైసిపి నుండి కార్పొరేటర్‌గా గెలిచిన ఆమె డిప్యూటీ మేయర్ పదవిని ఆశించి కొంతమంది కార్పొరేటర్లతో కలిసి టిడిపిలో చేరారు. అయితే ఆ పదవి టిడిపికి చెందిన ఆర్‌సి మునికృష్ణకు దక్కడంతో ఆమెకు మేయర్ అవకాశం కల్పించాలనే అభిప్రాయం పార్టీలోని కొందరు నేతల్లో వ్యక్తమవుతోంది. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ కూడా ఆమెకు అనుకూలంగా ఉన్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో జెసీఐ ఇండియా అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బి. హార్షవర్ధన్ రెడ్డి పేరు కూడా మేయర్ రేసులో వినిపిస్తోంది. ఆయనకు అవకాశం కల్పించాలని ఆయన తండ్రి, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి చంద్రబాబు నాయుడును కోరినట్టు సమాచారం. హార్షవర్ధన్ రెడ్డి ఐదు క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకోవడంతో పాటు ఐఐఎంలో విద్యాభ్యాసం, ఐఐటీలో అంతర్జాతీయ స్థాయి బాధ్యతలు, విఐటీలో పీహెచ్‌డీ వంటి విద్యా, వృత్తిపరమైన నేపథ్యాన్ని కలిగి ఉన్నారు. 20కి పైగా దేశాల్లో పర్యటించిన అనుభవంతో పాటు యువతతో అనుసంధానం, సామాజిక కార్యక్రమాల్లో చురుకుదనం తనకు కలిసొచ్చే అంశాలుగా ఆయన అనుచరులు భావిస్తున్నారు. బలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యా సంస్థల అధిపతి పెనుమాడు ప్రణీత్ కూడా మేయర్ పదవిపై ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. చాలాకాలంగా టిడిపితో అనుబంధం ఉన్న ఆయన నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని ఆశించినా అవకాశం దక్కకపోవడంతో ఇప్పుడు మేయర్ రేసుపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇక మాజీ కార్పొరేటర్ యువనేత నరసింహాచారి కూడా పోటీలో ఉండనున్నారు.

**జనసేనలోనూ యువ ముఖాల వేట:** జనసేనకు మేయర్ స్థానం దక్కితే ఎమ్మెల్యే శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్‌ను రంగంలోకి దించాలనే ఆలోచన ఆయన సన్నిహిత వర్గాల్లో ఉన్నట్టు సమాచారం. యువతను ముందుకు తీసుకురావాలన్న పార్టీ విధానం, భవిష్యత్ నాయకత్వాన్ని ఇప్పటి నుంచే తీర్చిదిద్దాలన్న ఆలోచనతో ఆయన పేరును పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ పేరు కూడా జనసేనలో వినిపిస్తోంది. తిరుపతిలో ఆయనకు ఓటు బ్యాంకు, పట్టుకలిగి ఉండటంతో టివి చర్చల్లో వైసిపి నేతలపై ఘాటైన విమర్శలు చేస్తూ గుర్తింపు పొందిన ఆయనకు పార్టీ అవకాశం ఇస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

**వైసిపిలో అభినయ్ రెడ్డి పేరు:** కూటమి తరఫున అభ్యర్థి ఎవరు అన్నది స్పష్టమైన తర్వాతే తమ అభ్యర్థిని ఖరారు చేయాలని వైసిపి అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. కూటమి నుంచి బలమైన యువ నేతను రంగంలోకి దింపితే అందుకు ధీటుగా యువ ముఖాన్నే బరిలోకి దించాలని ఆ పార్టీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు, మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పేరు వినిపిస్తోంది. గతంలో డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఆ పదవికి రాజీనామా చేశారు. అయితే మేయర్‌గా పోటీ చేస్తే భవిష్యత్తులో ఎమ్మెల్యే అవకాశంపై ప్రభావం పడుతుందన్న సందేహం ఆయన వర్గంలో ఉన్నట్టు తెలుస్తోంది. మాజీ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష యాదవ్ పేరు కూడా మరోసారి పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. గతంలో మేయర్ పదవి జనరల్ మహిళకు కేటాయించినప్పటికీ బిసి వర్గానికి చెందిన శిరీష యాదవ్‌కు అవకాశం కల్పించడం అప్పట్లో రాజకీయంగా సంచలనంగా మారింది. రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ మాకిరెడ్డి పురుషోత్తం రెడ్డి కూడా మేయర్ పదవిపై ఆసక్తిగా ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధినేత జగన్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని కూడా ఆయనకు అనుకూల అంశంగా అనుచరులు భావిస్తున్నారు.

**యువతకే పట్టం కడతారా?:** మొత్తం మీద తిరుపతి మేయర్ ఎన్నిక ఈసారి కేవలం పార్టీల మధ్య పోరుగా గాకుండా కొత్త తరం నాయకత్వానికి పరీక్షగా మారే అవకాశం కనిపిస్తోంది. మూడు ప్రధాన సామాజిక వర్గాల సమీకరణాలు, కూటమిలో టీడీపీ- జనసేన మధ్య సీటు కోసం పోటీ, వైసిపి వ్యూహం, యువతకు పెరుగుతున్న ప్రాధాన్యం.. ఇవన్నీ కలిపి మేయర్ రేసును ఉత్కంఠభరితంగా మారుస్తున్నాయి.
డబ్బు రాజకీయాలకు బదులు సేవ, పాత తరానికి బదులు కొత్త తరం, సంప్రదాయ సమీకరణాలకు బదులు సామాజిక, విద్యా, ప్రజాసేవా నేపథ్యం, ఈ అంశాల్లో ఏది తిరుపతి ఓటర్లను ప్రభావితం చేస్తుందో, చివరికి మేయర్ పీఠాన్ని ఎవరు అధిరోహిస్తారో వేచి చూడాల్సిందే.

ఆట

# సెమీఫైనల్‌కు నార్త్‌జోన్

## 52 రన్స్ తేడాతో వెస్ట్ జోన్ ఓటమి



**బెంగుళూరు:** దులీప్ ట్రోఫీ 4వ రోజున వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ అనూహ్య విజయాన్ని పూర్తి చేసింది. బుధవారం బెంగుళూరులో జరిగిన మ్యాచ్‌లో, నార్త్ జోన్ కేవలం 28 నిమిషాల్లో వెస్ట్ జోన్‌పై 52 పరుగుల తేడాతో విజయం సాధించి 2026-27 దులీప్ ట్రోఫీ సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. 87 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న వెస్ట్ జట్టుకు, చివరి రోజు ఉదయం మూడు వికెట్లు మిగిలి ఉండగా 67 పరుగులు అవసరమయ్యాయి. కానీ ఆ జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. మొదటగా తనుష్ కోటియన్ అవుటయ్యాడు. ఎడమచేతి వాటం స్పిన్నర్ అబిద్ ముస్తాఖ్ వేసిన బంతి పిచ్ అయిన తర్వాత కూడా అదే లైన్‌లో కొనసాగి అతని వికెట్లను పడగొట్టడంతో అతను బోల్తా పడ్డాడు. అబిద్‌తో కలిసి మరో ఎడమచేతి స్పిన్నర్ నిశాంత్ సింధు బౌలింగ్ చేస్తుండటంతో, ఆట లయను దెబ్బతీయడానికి వెస్ట్, శార్దూల్ ఠాకూర్ కంటే ముందుగా ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ తుషార్ దేశ్‌పాండేను పంపాలని నిర్ణయించుకున్నాడు. ముంబై పేసర్ 17 బంతుల పాటు క్రీజులో నిలదొక్కుకున్నాడు. కానీ ఆవేశంతో క్రీజు దాటి బయటకు వచ్చి అబిద్ (60 పరుగులకు నాలుగు వికెట్లు) బౌలింగ్‌లో బంతిని బలంగా బాదబోయాడు. ఆ క్రమంలో బంతి బ్యాట్‌అంచుకు తగిలి స్లిప్‌ఫీల్డర్ చేతిలోకి వెళ్లింది. స్పెషలిస్ట్‌బ్యాటర్ ఉర్విల్ పటేల్ (44) తో శార్దూల్ జత కలిశాడు, కానీ వారిద్దరి భాగస్వామ్యం కేవలం మూడు బంతులే కొనసాగింది. నిశాంత్ బౌలింగ్‌లో ఉర్విల్ స్లాగ్ స్వీప్ ఆడబోయి విఫలమవడంతో లెగ్‌బిఫోర్ గా అవుటయ్యాడు. కేవలం ఒక గంట క్రికెట్ వ్యవధిలోనే, వెస్ట్ జట్టు 195 పరుగులకు మూడు వికెట్ల నుండి 234 పరుగులకే ఆలౌట్ అయి, అద్భుతమైన ఫామ్ నుండి పతనానికి పడిపోయింది.

## మహిళల హాకీ ప్రపంచ కప్..

# నేడు జర్మనీతో భారత్ ఢీ



**నెదర్లాండ్స్:** ఆస్ట్రేలియాతో గోల్ రహిత డ్రాతో సెమీఫైనల్ ఆశలు ఆవిరైన తర్వాత, గురువారం ఆమ్‌స్టెల్వీన్‌లో జర్మనీతో నెదర్లాండ్స్‌లో జరిగే ఐదవ, ఆరవ స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో భారత్ మహిళల ప్రపంచ కప్ ప్రచారాన్ని ఘనంగా ముగించాలని చూస్తోంది. ఫలితంతో సంబంధం లేకుండా, 1974లో నాలుగో స్థానంలో నిలిచిన తర్వాత ప్రపంచ కప్‌లో స్జోర్డ్ మారిజ్నే జట్టు అత్యుత్తమ స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఆమ్‌స్టెల్వీన్‌లో కేవలం ఒకే ఆటలో ఓడిపోయి, ఉన్నత ర్యాంకులో ఉన్న చైనా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలతో డ్రాలు చేసుకున్నప్పటికీ, భారత్ గోల్స్ చేయడంలో వెనుకబడటం విమర్శలకు గురైంది. దీపిక, నవనీత్ కౌర్ చెరో రెండు గోల్స్ చేసినప్పటికీ, షార్ట్ కార్నర్‌ల నుండి అవకాశాలను గోల్స్‌గా మార్చడంలో వారి పేలవమైన ప్రదర్శన చివరికి జట్టుకు నష్టం కలిగించింది. మరోవైపు, భారత రక్షణ విభాగం పటిష్టంగా, ఛేదించడానికి కష్టంగా ఉంది. పేరుమోసిన నెదర్లాండ్స్ దాడి విభాగం సైతం రెండు గోల్స్ చేయడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గురువారం, ప్రపంచ నెం.5 జర్మనీపై కూడా భారత్ ఇదే విధమైన దృఢమైన ప్రదర్శనను పునరావృతం చేయాలని కోరుకుంటుంది. ఇరు జట్ల మధ్య ఉన్న ర్యాంకింగ్ వ్యత్యాసానికి తగినట్లుగా ఒక అద్భుత ప్రదర్శన ఇవ్వాలని జర్మనీ తీవ్రంగా ఆశిస్తుంది.

# యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే సుమిత్ నిష్క్రమణ

**న్యూయార్క్:** భారత నంబర్ 1 సింగిల్స్ ఆటగాడు సుమిత్ నాగల్ ఓటమి చెందాడు. అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న 2026 యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ క్వాలిఫైయింగ్ దశ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. సింగిల్స్ విభాగంలో ఏకైక భారతీయ ఆటగాడైన నాగల్, గంటా 54 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రపంచ 86వ ర్యాంకర్ ఆర్థర్ గియా చేతిలో వరుస సెట్లలో (3-6, 6-7)



ఓటమి పాలయ్యాడు. 29 ఏళ్ల అతను ఈ ఏడాది తన తొలి గ్రాండ్ స్లామ్ ఈవెంట్‌లో పోటీ పడుతున్నప్పటికీ, క్వాలిఫైయింగ్ డ్రాలో అగ్రశ్రేణి ఆటగాడితో జరిగిన తన మొదటి మ్యాచ్‌లోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఆర్థర్ యొక్క మొదటి రెండు సర్వీస్ గేమ్‌లలో తాను సంపాదించిన నాలుగు బ్రేక్ పాయింట్లలో దేనినీ సద్వినియోగం చేసుకోలేక, సుమిత్ తన ఆరంభ అవకాశాలను చేజార్చుకున్నాడు. ఫ్రెంచ్ ఆటగాడు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మ్యాచ్ మిగిలిన భాగంలో మరే బ్రేక్ పాయింట్లు రాకుండా అడ్డుకుని, తన మొదటి మరియు ఏకైక బ్రేక్ పాయింట్‌ను సాధించి తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్ మరింత ఉత్కంఠభరితంగా సాగింది. ఇద్దరు ఆటగాళ్లు బలమైన రిటర్న్‌లు చేస్తూ, అనేక గేమ్‌లను డ్యూస్‌కు తీసుకువెళ్లారు. మొదటి నాలుగు గేమ్‌లలోనే బ్రేక్‌లను మార్చుకున్నారు. గంటసేపు సాగిన పోరాటం తర్వాత, ఆర్థర్ సర్వ్‌పై సుమిత్‌కు సెట్ పాయింట్ లభించినప్పటికీ, దానిని మరోసారి సద్వినియోగం చేసుకోలేక, సెట్‌ను టైబ్రేక్‌కు తీసుకువెళ్లాడు. ఆ తర్వాత ఫ్రెంచ్ ఆటగాడు టైబ్రేక్‌లో అద్భుతంగా రాణించి, దానిని 7-4 తేడాతో సునాయాసంగా గెలుచుకొని, సుమిత్ నాగల్‌పై స్ట్రెయిట్‌సెట్స్ విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.



# స్టార్ ప్లేయర్లు రీ ఎంట్రీకి రెడీ

## అఫ్ఘానిస్థాన్, వెస్టిండీస్ సిరీస్‌లే టీమిండియా లక్ష్యం

**న్యూఢిల్లీ:** గాయాలు, రిహాబిలిటేషన్ కారణంగా జట్టుకు దూరంగా ఉన్న పలువురు స్టార్ ప్లేయర్లు టీమిండియాలోకి రీ ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇందుకు టీమిండియా పరిమిత ఓవర్ల స్టార్ ఆటగాళ్లు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం, భారత్,శ్రీలంక జట్ల మధ్య టెస్ట్‌సిరీస్ జరుగుతుండగా, మరోవైపు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్లేయర్లు వర్కౌట్లు చేస్తూ రీ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టగా, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యా గాయం నుంచి వేగంగా కోలుకుంటూ శిక్షణ పొందుతున్నాడు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, యంగ్ పేసర్ హర్షిత్ రాణా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే, స్పిన్నర్ రవి బిష్ణోయ్, సూర్యాంశ్ షెడ్గేలు ఒకే చోట తీవ్రంగా సాధన చేస్తున్నారు. ఈ ప్లేయర్ల ఫోకస్ అంతా రాబోయే ద్వైపాక్షిక సిరీస్‌లపైనే ఉంది. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న 3 మ్యాచ్ ల టీ20 అంతర్జాతీయ సిరీస్ సమయానికి ఈ వైట్‌బాల్ స్టార్లు పూర్తి ఫిట్నెస్ సాధించాలని చూస్తున్నారు. ఆ తర్వాత అక్టోబర్ లో వెస్టిండీస్ జట్టుతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు ఈ కీలక ఆటగాళ్లందరూ భారత జట్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఆటగాళ్లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇవ్వడం, గాయాల నిర్వహణపై కొన్ని ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో మాట్లాడి క్లారిటీ ఇచ్చారు. ఎంపిక ప్రక్రియలో, ఆటగాళ్ల ఫిట్‌నెస్ నివేదికలలో పూర్తి పారదర్శకత ఉంటుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆటగాడు మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే మరికరిని ఎంపిక చేస్తారని అర్థం. తాము నిందలు వేసేందుకు ఇష్టపడమని, ప్లేయర్లు కోలుకునే పురోగతిని ప్రతి దశలో పర్యవేక్షిస్తూ సెలెక్షన్ కమిటీకి నివేదిస్తామని లక్ష్మణ్ పేర్కొన్నారు. మొత్తానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్టార్ ప్లేయర్ల కఠోర శ్రమ చూస్తుంటే త్వరలోనే భారత వైట్‌బాల్ జట్టు పూర్తి బలంతో మైదానంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది.

# లంకకు తప్పని ఫాలో ఆన్

## గెలుపు ముంగిట భారత్!

**కొలంబో:** కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ పట్టు బిగించి గెలుపు ముంగిట నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంకను 290 పరుగులకు ఆలౌట్ చేసింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసి 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25



పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు.

కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా, శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా, కామిందు మెండిస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండిస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈవికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా, శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.



# 50 వేల ఉద్యోగులపై వోక్స్‌వ్యాగన్ వేటు

**న్యూఢిల్లీ,ఆగస్టు 26:** ఆటో దిగ్గజం వోక్స్‌వ్యాగన్ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. అమ్మకాలు తగ్గడం, చైనా కంపెనీల నుంచి పోటీ పెరగడం, ఉత్పత్తి వ్యయాలు అధికంగా ఉండటంతో భారీ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 50 వేల వరకు ఉద్యోగాలు తగ్గించేముప్పుఉంది. దీంతో జర్మనీలో ఉద్యోగుల ఆగ్రహం తీవ్ర స్థాయికి చేరింది. ఫోక్స్‌వ్యాగన్ ప్రధాన కార్యాలయం ఉన్న వోల్ఫ్స్‌బర్గ్‌లో 10 వేల మందికి పైగా కార్మికులు గుమికూడారు. సంస్థను పోటీకి తగినట్లు మార్చుకోవాల్సిన అవసరం ఉందని సీఈవో ఒలివర్ బ్లూమ్ వారికి చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. బ్లూమ్ ప్రసంగానికి కార్మికుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. కొందరు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 50 వేల ఉద్యోగాల కోతపై యాజమాన్యం చర్చిస్తోంది. ఇందులో సగం వరకు జర్మనీలో ఉండొచ్చని తెలుస్తోంది. స్వచ్ఛంద పదవీ విరమణ, ముందస్తు రిటైర్‌మెంట్, కొత్త నియామకాలపై ఆంక్షల ద్వారా ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని భావిస్తోంది. జర్మనీలోని పలు ప్లాంట్ల భవిష్యత్తుపైనా అనిశ్చితి నెలకొంది. ఒస్నాబ్రూక్ ప్లాంట్‌లో వచ్చే ఏడాది ఉత్పత్తి నిలిచిపోనుంది. మరో నాలుగు ప్లాంట్ల భవిష్యత్తు 2030 తర్వాత ఎలా ఉంటుందన్నది స్పష్టంగా లేదు. ఫోక్స్‌వ్యాగన్‌కు చైనా కార్ల తయారీ సంస్థల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో చైనా కంపెనీలు వేగంగా ఎదుగుతున్నాయి. చైనాలో ఫోక్స్‌వ్యాగన్ అమ్మకాలు కూడా తగ్గాయి. అమెరికా టారిఫ్‌లు, అధిక ఉత్పత్తి వ్యయాలు సమస్యను మరింత పెంచుతున్నాయి. కంపెనీ వ్యయాలు కొంతమంది పోటీదారుల కంటే 30 శాతం అధికంగా ఉన్నాయని బ్లూమ్ తెలిపారు.

# ప్రపంచ ఆర్థికవ్యవస్థలో టగ్‌ఆఫ్ వార్!


## -ఐఎంఎఫ్ ఎండి క్రిస్టలినా జార్జియేవా




**న్యూయార్కు,ఆగస్టు 26:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక భారీ టగ్ ఆఫ్ వార్ స్థితిని ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియేవా వ్యాఖ్యానించారు. ఒకవైపు పశ్చిమాసియాలో ఇంధన సరఫరా ఆటంకాలతో తలెత్తిన ప్రతికూలతలు, మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెట్టుబడుల వెల్లువతో పెరిగిన డిమాండ్ ఈ రెండు పరస్పర విరుద్ధ శక్తుల మధ్య గ్లోబల్ ఎకానమీ నలిగిపోతోందని ఆమె విశ్లేషించారు. జీ20 దేశాల ఆర్థిక మంత్రుల సమావేశానికి ముందు వాషింగ్టన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. పశ్చిమాసియాలో హార్ముజ్ జలసంధి మూసివేత కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని ప్రపంచం ఊహించిన దానికంటే మెరుగ్గానే తట్టుకోగలిగిందని జార్జియేవా తెలిపారు. చమురు, గ్యాస్ నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకోవడం, గల్ఫ్ యేతర దేశాల నుంచి సరఫరాలు పెరగడం, ఇంధన వినియోగం తగ్గడం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం వృద్ధి చెందడం వంటి అంశాలు దీని ప్రభావాన్ని తగ్గించాయని ఆమె వివరించారు. ఏఐ రంగంలో పెట్టుబడుల జోరు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోందని ఆమె నొక్కి చెప్పారు. అమెరికాలో ప్రారంభమైన ఏఐ విప్లవం ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ప్రధాన చోదకశక్తిగా మారుతోంది. ఇతర దేశాలు సైతం డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇంధన ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం భారమై, వడ్డీ రేట్లను తగ్గించకుండా సెంట్రల్ బ్యాంకులు కఠిన వైఖరిని అవలంబించే ముప్పు ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఇంధన దిగుమతులపై ఆధారపడే పేద దేశాలపై రుణ భారం మరింత పెరగవచ్చని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఏఎంసీలో 2% వాటా విక్రయం

**ముంబయి,ఆగస్టు26:** ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో 2 శాతం వాటాను ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ బ్లాక్ డీల్ ద్వారా విక్రయించనుంది. ఈ లావాదేవీ విలువ సుమారు రూ.2,964 కోట్ల నుంచి




రూ.3,122 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ఈ బ్లాక్ డీల్‌లో సుమారు 98.85 లక్షల షేర్లు చేతులు మారనున్నాయి. ఒక్కో షేర్‌కు రూ.2,998-రూ.3,158 ధరను ఆఫర్ ధరగా నిర్ణయించినట్లు సమాచారం. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ముగింపు ధరతో పోలిస్తే ఈ ఆఫర్ ధర సుమారు 2-7 శాతం డిస్కౌంట్‌తో ఉంది. ఇది పూర్తిగా సెకండరీ షేర్ సేల్ కావడంతో కంపెనీ నుంచి కొత్తగా ఎలాంటి షేర్ల జారీ ఉండదు. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ప్రమోటర్ అయిన ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్‌కు కంపెనీలో 34.59 శాతం వాటా ఉంది. 2 శాతం వాటా విక్రయం అనంతరం ఆ వాటా తగ్గనుంది. ఈ విక్రయం ద్వారా వచ్చే మొత్తం కంపెనీకి కాకుండా షేర్లను విక్రయిస్తున్న ప్రమోటర్‌కు చేరుతుంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సంస్థ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 25.5 శాతం పెరిగి రూ.965 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.769 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం 20.2 శాతం పెరిగి రూ.1,745 కోట్లకు చేరింది. బుధవారం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ షేరు 2.1 శాతం తగ్గి రూ.3,222.80 వద్ద ముగిసింది.




# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 26:** దేశీయ ఈక్విటీ సూచీలు బుధవారం నష్టాలతో ముగిశాయి. గరిష్ఠ స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం, అమెరికా జూలై వ్యక్తిగత వినియోగ వ్యయాల ద్రవ్యోల్బణ గణాంకాల కోసం మార్కెట్లు అప్రమత్తంగా ఎదురుచూడటం ఇందుకు కారణమయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలకంగా పరిగణించే రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు రానున్న రోజుల్లో వడ్డీ రేట్లపై ఫెడ్ నిర్ణయాలకు సంబంధించి కొత్త సంకేతాలను అందించనున్నాయి. ఎన్‌విడియా ఫలితాలపై కూడా మార్కెట్ వర్గాలు దృష్టి సారించాయి. ఏఐ రంగంలో వ్యయాలు ఏ స్థాయిలో కొనసాగుతున్నాయి, టెక్నాలజీ ఆధారిత మార్కెట్ ర్యాలీ నిలకడగా ఉంటుందా అనే అంశాలపై ఈ ఫలితాలు స్పష్టత ఇవ్వనున్నాయి. దీంతో ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.44 శాతం పడిపోవడం కూడా సూచీలపై ఒత్తిడి పెంచింది. మరోవైపు ఫైనాన్షియల్ షేర్లు, ప్రైవేట్ బ్యాంకులు లాభపడగా, సిమెంట్, మెటల్ షేర్లు కూడా పురోగమించాయి. ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌కు కొంత మద్దతునిచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 86 డాలర్ల దిగువకు పడిపోయింది. నిఫ్టీ 50 సూచీ 126.80 పాయింట్లు నష్టపోయి 24,207.75 వద్ద ముగిసింది. ఎస్‌అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 183.15 పాయింట్లు తగ్గి 77,472.94 వద్ద స్థిరపడింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు లాభాల్లోనే కొనసాగాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.17 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.56 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,375 షేర్లులాభపడగా, 1,944 షేర్లు నష్టపోయాయి. మరో 231 షేర్లలో ఎలాంటి మార్పులేదు. అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర 2.24 డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 85.03 డాలర్లకు చేరింది. అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్‌కు ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.43 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,62,115 వద్ద నిలిచాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 0.11 శాతం పెరిగి 98.95కు చేరింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.47 శాతం పడిపోయింది. ప్రధానంగా ఇన్ఫోసిస్ 2.10 శాతం, టెక్ మహీంద్రా 1.81 శాతం, విప్రో 1.52 శాతం, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ 1.50 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.31 శాతం, ఎంఫాసిస్ 1.31 శాతం, టీసీఎస్ 1.14 శాతం, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 1.14 శాతం, కోఫోర్జ్ 0.68 శాతం చొప్పున నష్టపోయాయి. ఇతర షేర్లలో అద్వైత్ ఎనర్జీ ట్రాన్సిషన్స్ 3.71 శాతం, ఎంటీఏఆర్ టెక్నాలజీస్ 1.92 శాతం లాభపడ్డాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 1.51 శాతం పడిపోయింది. ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.29 శాతం, సాయి పేరెంటరల్స్ 0.71 శాతం పెరగగా, సుబెక్స్ 0.39 శాతం, ఎన్‌బీసీసీ0.32 శాతం నష్టపోయాయి.



# ఉల్లిధరల నియంత్రణకు కేంద్రం జోక్యం

## రూ.35 సబ్సిడీ ధరకే విక్రయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** దేశవ్యాప్తంగా ఉల్లిపాయల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో గురువారం నుంచి దేశ రాజధాని ఢిల్లీలో కిలో ఉల్లిపాయలను రూ.35 సబ్సిడీ ధరకు విక్రయించనుంది. నగరాల్లో ఉల్లిపాయల రిటైల్ ధరలు కిలోకు రూ.55-60 వరకు చేరాయి. కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం ఈ సబ్సిడీ విక్రయాలను ప్రారంభించనున్నారు. 2026 కోసం ఉత్పత్తి రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న 1.21 లక్షల టన్నుల బఫర్ స్టాక్ నుంచి ఉల్లిపాయలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ సంస్థల ద్వారా రిటైల్ విక్రయాలు చేపట్టనున్నారు. ఎన్‌సీసీఎఫ్ వద్ద ప్రస్తుతం 62 వేల టన్నుల ఉల్లిపాయల బఫర్ నిల్వ ఉంది. ఇందులో నుంచి మహారాష్ట్రలోని నాసిక్ నుంచి 400 టన్నుల ఉల్లిపాయలను కాండా ఎక్స్‌ప్రెస్ ద్వారా ఢిల్లీకి తరలిస్తున్నారు.

కేంద్రీయ భండార్‌కు చెందిన 100 స్టోర్ల ద్వారా ఉల్లిపాయలను విక్రయించనున్నారు. మదర్ డెయిరీకి చెందిన 300 ఔట్‌లెట్ల ద్వారా కూడా విక్రయించేందుకు చర్చలు జరుగుతున్నాయి. రైల్వే రేక్‌ల ద్వారా వచ్చే ఉల్లిపాయలను చండీగఢ్, లూధియానా, వారణాసి తదితర నగరాల్లో కూడా విక్రయించనున్నారు. నాఫెడ్ వద్ద 55 వేల టన్నుల కంటే తక్కువ ఉల్లిపాయల బఫర్ స్టాక్ ఉంది. ఈ సంస్థ కూడా ఢిల్లీతో పాటు కొచ్చి, గువాహటి తదితర ప్రాంతాల్లో ఉల్లిపాయలను విక్రయించనుంది. గత నెల రోజులుగా ఉల్లిపాయల ధరలు గణనీయంగా పెరిగాయి. 25న దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ధర కిలో రూ.44.72కు చేరింది. జూలై 25న ఇది రూ.34.80గా ఉంది. అంటే నెల వ్యవధిలో 28 శాతానికి పైగా పెరిగింది. ఏడాది క్రితం కిలో ఉల్లిపాయ ధర రూ.28.67గా ఉండగా, ప్రస్తుతం 56 శాతం పెరిగింది. పలు మెట్రో నగరాల్లో ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. బుధవారం చెన్నై, కోల్‌కతాలో కిలో ఉల్లిపాయ రూ.60, ఢిల్లీలో రూ.55, ముంబైలో రూ.48, రాంచీలో రూ.38గా నమోదయ్యాయి.

ఏడాది క్రితం ఇదే సమయంలో చెన్నైలో రూ.35, కోల్‌కతాలో రూ.32, ఢిల్లీలో రూ.33, ముంబైలో రూ.32, రాంచీలో రూ.25గా ధరలు ఉన్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లోనూ ధరలు ఇదే స్థాయిలో పెరిగాయి. ఆగస్టు 25న సగటు హోల్‌సేల్ ధర కిలో రూ.36.73గా ఉంది. ఏడాది క్రితం రూ.22.54తో పోలిస్తే ఇది 63 శాతం అధికం. దేశంలో ఉల్లిపాయల ఉత్పత్తి 307.37 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | గురువారం 27 ఆగస్టు 2026 | I



# సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది..

### పురందేశ్వరికి ఘన సత్కారం : ఎంపీ పురందేశ్వరి

**రాజమహేంద్రవరం సిటీ ,ఆగస్టు 26 (ప్రభాతవార్త)** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి గడపకు విస్తృతంగా తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కార్యకర్తల ఉత్సాహం అంకితభావం పార్టీకి ఎంతో బలాన్ని చేకూర్చుందని కలిసికట్టుగా అడుగులు వేద్దాం పార్టీని విజయ పదములో నడిపిద్దాం అని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దశగా ముందుకు సాగాలన్నారు. అనంతరం జాతీయ ఉపాధ్యక్షురాలుగా ఎన్నికైన ఎంపీ పురందేశ్వరిని పూలమాలతో సత్కరించారు. జాతీయ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యకర్తలు నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో రేలంగి దేవి బొమ్మల దత్తు ఎమ్మెస్ కే రాజు కురగంటి సతీష్ కాలపు సత్య సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ నగరం నడి బొడ్డున వ్యక్తి దారుణ హత్య



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేక ప్రతినిధి, ఆగస్ట్ 26 (ప్రభాతవార్త):** కాకినాడ నగరం నడిబొడ్డున భానుగుడి సెంటర్‌లో అర్ధరాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు కోడమాటి సతీష్ రెడ్డి (30)గా పోలీసులు గుర్తించారు. ఆయన జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. భానుగుడి ప్రాంతంలోని చార్మినార్ టీ సెంటర్ సమీపంలో సతీష్ రెడ్డిపై బందుల సాయికిరణ్ (30), అతని స్నేహితులు దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. కర్రతో మెడ భాగంలో పొడిచి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. హత్యకు అక్రమ సంబంధం, ఆర్థిక లావాదేవీలు కారణమై ఉండవచ్చన్న కోణంలో కాకినాడ టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పరిశుభ్రతకు పెద్దపీట.. వార్డుల్లో స్పెషల్ డ్రైవ్

### మున్సిపల్ కమిషనర్ ఎస్టీవీ రాజేశ్వరరావు ప్రత్యేక పర్యవేక్షణ



**పిఠాపురం, ఆగస్టు 26 ( ప్రభాతవార్త )** పిఠాపురం పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంతో పాటు పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచే చర్యలు చేపడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎస్టీవీ రాజేశ్వరరావు స్వయంగా వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్య పనులను పరిశీలిస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పారిశుధ్య సిబ్బంది నిర్వహిస్తున్న పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన సూచనలు, సలహాలు జారీ చేస్తున్నారు. ఏ ప్రాంతంలోనూ చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచిస్తున్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతిరోజూ వార్డుల పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో క్రమం తప్పకుండా పర్యటిస్తూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ పరిశుభ్రత సాధ్యమవుతుందని కమిషనర్ ఎస్టీవీ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్ల నుంచి వెలువడే చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని, రోడ్లపై, కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరిస్తే పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దవచ్చన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలతో సిబ్బందిలోనూ బాధ్యత మరింత పెరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరించి పరిశుభ్రమైన పిఠాపురం నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది.

## జగన్‌ను కలిసిన జమ్మలమడక నాగమణి



**కాకినాడ రూరల్, ఆగస్టు 26(ప్రభాతవార్త):** రాఖీ పౌర్ణమి సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఒక ప్రకటనలో జమ్మలమడక నాగమణి మాట్లాడుతూ తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక గా రాఖీ పండుగ జరుపుకోవడం జరిగిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని వైసీపీ నాయకులు, కార్యకర్తలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## ఓ.ఎస్.డి. ఎదుటి ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు



**చింతూరు ఆగష్టు 26 ప్రభాత వార్త.** రంపచోడవరం ఓ. ఎస్. డి. పంకజ్ కుమార్ మీనా ఎదుటి ముగ్గురు మావోయిస్టులు బుధవారం లొంగిపోయారు. ఈ సందర్భంగా చింతూరు ఏ. ఎస్. పి. కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓ. ఎస్. డి. మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ సిద్ధాంతలకు విసిగిపోయి మావోయిస్టు పార్టీ ప్లాటూన్ కమిటి సభ్యురాలు ముచ్చికి మంగి, పార్టీ సభ్యులు కణితి లక్ష్మయ్య, కణితి ఎంక లొంగిపోయినట్టు ప్రకటించారు. మావోయిస్టులకు పట్టు తగ్గటం, పోలీసుల గస్తీ, క్యాంప్స్ పెరగటం వల్ల స్వేచ్ఛాగా తిరగలేక లొంగిపోయినట్టు తెలిపారు. లొంగిపోయిన వారికీ సరేండర్ మరియు రెహాబిటేషన్ పాలసి ప్రకారం ప్రశాంత జీవితం గడపటానికి ప్రభుత్వం ధ్వారా అర్హత ఉన్న అన్ని సౌకర్యాలు అందించబడుతాయని అన్నారు. ఇంకా ఎవరైన అడవుల్లో, దళల్లో తిరుగుతుంటే ప్రశాంత జీవితం కోసం లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగి హిడమాకు అంగరక్షకురాలిగా 2023 వరకు పనిచేసి, ఆరోగ్యం సహకరించక కుంట ఎల్ ఓ ఎస్ లో చేరిందని తెలిపారు. ఈ సమావేశంలో ఓ ఎస్ డి తో పాటు దీప ఏ కె 42 సి ఆర్. పి. ఎఫ్ బెటాలియన్, చింతూరు సి ఐ. సి హెచ్ గోపాలకృష్ణ, ఎస్ ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



## చిర్రయానంలో క్షుద్ర పూజలు కలకలం !!!!

### క్షుద్ర పూజలకు కోసం బలి ఇచ్చేందుకు చిన్నారిని తీసుకొచ్చారని స్థానికుల ఆరోపణ!!



**కాట్రేనికోన, ఆగస్టు 26, (ప్రభాత వార్త)** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రాయనం గ్రామం సముద్రతీరంలో కాలభైరవుని ఆలయ సమీపంలో దట్టమైన నరుగుడు, తుమ్మ చెట్లు ప్రాంతంలో క్షుద్ర పూజలు చేస్తున్నారని, బలి ఇచ్చేందుకు చిన్నారిని త్యాగానికి తీసుకువెళ్లారని గ్రామస్తులు ఆరోపిస్తూ పేర్కొన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిర్రాయనం సముద్రతీరం కాలభైరవుని ఆలయం సమీపంలో క్షుద్ర పూజలు చేసేందుకు తాంత్రిక పూజలు చేసే ఒక మహిళతో పాటు సుమారు 8 మంది వ్యక్తులు మంగళవారం రాత్రి 11 గంటలకు ఎర్టీగా కొత్త కారు, మోటారు సైకిల్‌పై చేరుకున్నారని తెలిపారు. ఆలయం నుంచి సుమారు అర కిలోమీటరు దూరంలో సముద్రపు తోటలు, తుమ్మ చెట్లు ఉన్న తీర ప్రాంతంలో తాంత్రిక పూజలు చేసేందుకు వచ్చిన మహిళతో పాటు మిగతావారు మోటర్ సైకిల్‌పై రావడంతో, స్థానికంగా చెరువుల వద్ద ఉన్న ఇద్దరు వ్యక్తులు వీరిని గమనించి ఇక్కడకు ఎందుకు వచ్చారని నిలదీశారు. ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి తనది కోతుల చెరువు అని, మల్లడి ధన కిషోర్ మీకు తెలుసా అని స్థానికులను ప్రశ్నించారు. ఇక్కడి నుంచి వెళ్ళిపొండని వారు తెలపగా తుమ్మచెట్ల పొదల్లో ఉన్న మరికొంతమంది చీకట్లో పరుగులు తీశారు. వారితోపాటు ఓ బాలికను చూశామని స్థానికులు తెలిపారు. క్షుద్ర పూజలు చేయడానికి వచ్చారని అనుమానంతో మిగిలిన గ్రామస్తులకు సమాచారం తెలియజేయగా మరింత మంది అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తులంతా కలిసి మీరు ఎక్కడ ఎందుకు వచ్చారు అని నిలదీశారు . పారిపోయిన వారి వివరాలు తెలపాలని అడిగారు. బాలికను ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. తనకు పూజ నిమిత్తం రూ. 15 వేలు ఇచ్చారని సదరు మహిళ తెలిపింది .వీరిపై అనుమానంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చి వారిని అప్పగించారు. పోలీసులు కారుతో పాటు వారిని స్టేషనకు తరలించారు. గుప్త నిధులు, క్షుద్ర పూజలు చేసి బాలికను బలి ఇచ్చేందుకు ఎక్కడ తీసుకు వచ్చారని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. వారిని తాము గుర్తించడంతో బాలికతో పాటు అసలు వ్యక్తులు పరారయ్యారని వారు తెలిపారు. దీనిపై బుధవారం సముద్ర ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా అక్కడ కనిపించిన పూజ సామాగ్రితో స్థానికుల అనుమానం మరింత బలపడింది .తుమ్మ చెట్లు పొదల మధ్యన కొత్త దుస్తులు, రెండు పారలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, చాకు ,ముగ్గు పేళాలు, పేడ తదితర సామాగ్రి అంతా ఉంది .పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఎప్పుడు ప్రశాంతంగా ఉండే తమ గ్రామంలో ఇటువంటి క్షుద్ర పూజల కలకలం జరగడం గ్రామస్తులను మరింత భయాందోళనకు గురి చేస్తుందని స్థానికని తెలిపారు. దీనిపై ఎస్సై అవినాష్ ను వివరణ కోరగా దర్యాప్తు చేపట్టి వాస్తవాలు తెలితే కేసు నమోదు చేస్తామని తెలిపారు.







## 30న వకుళామాత అన్నదాన భవనం ప్రారంభం...

### భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు ...

### డిప్యూటీ కమిషనర్,ఈఓ, నల్లం సూర్య చక్రధర్రావు







**ఆత్రేయపురం, ఆగస్టు,26,(ప్రభాత వార్త)** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్మాణంలో ఉన్న వకుళామాత అన్నదాన భవనం పూర్తి కావడంతో, ఈ నెల 30 తేదీన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వకుళ మాత అన్నదాన భవన నిర్మాణ పనులు, భక్తులకోసం చేపడుతున్న శ్రీనివాసం భవన నిర్మాణ పనులనునిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న ఆదివారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తో వకుళామాత అన్నదాన భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తారని, వకుళామాత అన్నదాన భవనం ప్రారంభం అయితే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. వకుళామాత అన్నదాన భవనం నిర్మాణం తుది దశకు చేరుకుందని అధికారులు వివరించారు. భక్తులకు నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించే లక్ష్యంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.అదేవిధంగా భక్తుల వసతి సౌకర్యాల కోసం నిర్మిస్తున్న శ్రీనివాసం భవన పనులను కూడా డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించేలా పనులను పూర్తి చేయాలని సూచించారు.

## కత్తిపూడి లో కళ్యాణ మండపానికి స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే ఎంపీ

### కళ్యాణ మండపాలకు ఎంపీ నిధులు



**శంఖవరం,ఆగస్టు 26, ప్రభాతవార్త** రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో నూతన కళ్యాణ మండపాలు నిర్మాణానికి ఎంపీ నిధులు కేటాయించడం జరుగుతుంది. దీనిలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కత్తిపూడి, శరభవరం, లింగంపర్తి గ్రామాల్లో నూతన కళ్యాణ మండపాలు నిర్మించడానికి ఎంపీ నిధులు మంజూరయ్యాయి. బుధవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ బాబి పార్టీ శ్రేణులతో కలిసి కత్తిపూడి, శరభవరం, లింగంపర్తి గ్రామాల్లో పర్యటించి నూతన కళ్యాణ మండపాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమం కూటమి ప్రభుత్వంతో నేసాధ్యమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతుంది అని అన్నారు. పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వివాహాలు, శుభకార్యాలు జరిగేలా ఎంపీ ల్యాండ్స్ నిధులతో కొత్త కళ్యాణ మండపాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, సత్య ప్రభ కృషితో కత్తిపూడి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని శివ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, గాబు కృష్ణమూర్తి, సుభాష్, శివ, సాధనాల లక్ష్మీ బాబు, కేలంగి జనార్ధన్, పిర్ల అప్పారావు, కొయ్య రవణ, వెంకటరమణ, కరణం సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## గోకవరం వద్ద రూ.75 లక్షల విలువైన

# లిక్విడ్ గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్ట్.. కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం
- మరో ముగ్గురి కోసం పోలీసుల గాలింపు

**గోకవరం: ఆగష్టు 26 ప్రభాత వార్త** మండల కేంద్రమైన గోకవరం శివారు తంటికొండ ఆర్చ్ వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.75 లక్షల విలువైన 6 కిలోల లిక్విడ్ గంజాయి (గంజాయి ఆయిల్/హాష్ ఆయిల్) పట్టుబడింది. ఈ ఘటనకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఉత్తర మండల డీఎస్పీ సీహెచ్. జీవన బుధవారం వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు గోకవరం ఎస్సై వి.ఎన్.వి. పవన్ కుమార్ తన సిబ్బందితో కలిసి గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 6 కిలోల లిక్విడ్ గంజాయితో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు, గ్లామర్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసును కోరుకొండ సీఐ ఎస్.వి.వి.ఎస్. మూర్తి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు. నిందితుల పై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.



**అరెస్టయిన నిందితులు**

సపుర హంతల్ (34) -- ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ మండలం బరదబండ గ్రామం. జాదవ్ యోగేష్ (26) -- హైదరాబాద్, తెలంగాణ. రాహుల్ ముస్తాపురా (36) -- హైదరాబాద్, తెలంగాణ. అముదాల వినయ్ ఏ నల్లోడు (22) -- లాలాచెరువు సెంటర్, రాజమహేంద్రవరం.



**పోలీసులను తప్పించుకునేందుకు పక్కా ప్రణాళిక**

విచారణలో నిందితులు లిక్విడ్ గంజాయిని ఒడిశా ప్రాంతం నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలించి విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడైనట్లు డీఎస్పీ తెలిపారు. పోలీసులకు అనుమానం రాకుండా ముందుగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులను పంపి పోలీసుల కదలికలను గమనిస్తూ, వారి వెనుక కారులో లిక్విడ్ గంజాయిని తరలించేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఈ కేసులో పరారీలో ఉన్న లింగు ఖిల్లా, ప్రశాంత్ ముస్తాపుర, సంబ్రా ఖిల్లా ఏ సమురా కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు కొనసాగుతోందన్నారు. గంజాయి సరఫరాలో మరికొందరి పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

**నిందితులపై గతంలోనూ కేసులు**

ప్రధాన నిందితుడు సపుర హంతల్‌పై రంపచోడవరం, వై.రామవరం పోలీస్ స్టేషన్లలో గతంలో ఎన్‌డీపీఎస్ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. జాదవ్ యోగేష్, రాహుల్ ముస్తాపురాపై తెలంగాణలోని అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ కేసు ఉన్నట్లు వెల్లడించారు.

అముదాల వినయ్‌పై గండేపల్లి, బొమ్మూరు, రాజానగరం పోలీస్ స్టేషన్లలో దొంగతనం, ఎన్‌డీపీఎస్, ఇతర కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

600 కిలోల గంజాయి స్వాధీనం

గత ఏడాది నుంచి ఇప్పటివరకు గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 7 కేసుల్లో సుమారు 20 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు 600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి వినియోగిస్తున్న సుమారు 20 మందికి ర్యాపిడ్ టెస్ట్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించి, కౌన్సెలింగ్, డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు.

గంజాయి నిర్మూలన లక్ష్యంగా గోకవరం పోలీస్ స్టేషన్ పరిధితో పాటు తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన అక్రమ కార్యకలాపాల సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారాన్ని అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు

## వీబిజిరామ్ జి (ఉపాధిహామీ) ద్వారా

# జీడిమామిడి సాగు లేనట్లేనా..

### సాగు అంచనాలు కాగితాలకే పరిమితం.. టెండర్లతో కాలయాపన

**రాజవొమ్మంగి, ఆగస్టు 26, ప్రభాతవార్త** గిరిజన ప్రాంతంలో గిరిజనులు ఆర్థికాభివృద్ధి చెందాలనే లక్ష్యంతో మొట్టమొదటి జీడిమామిడి తోటలు పెంపక కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టి అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. నందమూరి తారక రామారావు పేరు దక్కుతుంది. కాని నేడు జీడిమామిడి సాగుకు గిరిజన రైతులు ఆశక్తి చూపించినా అధికారులు కాలయాపన చేశారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. పోలవరం నూతన జిల్లాలో ఈ ఏడాది 2026..27 సం. వీబిజి రామ్ ద్వారా 3,700 ఎకరాల్లో జీడిమామిడి, పామాయిల్, రబ్బరు, జాఫ్రా, కొబ్బరి, ఇంకో ఐదు రకాల పంటల సాగుకు లబ్ధిదారులు ముందుకు రావడంతో వారి జాబితాను జిల్లా స్థాయి అధికారులు ముందు ఉంచారు. వీటిలో సుమారు 1,000 ఎకరాలు జీడిమామిడి ఉంది. సమస్య ఇక్కడే మొదలు అయ్యింది. జీడిమామిడి మొక్కలను గిరిజన రైతులకు అగస్టు నెల మొదటివారంలో ఇవ్వాల్సి ఉంది. ఆగస్టు నెలాఖరు వచ్చినా మొక్కలు ఇస్తారనే ఆశను గిరిజన రైతులు వదులుకున్నారు.



**టెండర్లుతో జాప్యం...కాలం అయ్యిందన్న రైతాంగంలి**

జీడిమొక్కలు సకాలంలో అందించాలంటే ముందుగా అధికారులు కార్యాచరణ చేపట్టాలి. నెలరోజులు క్రితం ఐ. టి. డి. ఏ కు రైతులు జాబితా చేరింది. మొక్కలు సరఫరాకు పదులు సంఖ్యలో నర్సరీలు వారు పోటీ పడి చివరకు కొంత మంది మిగిలారు. వీరంతా రాజకీయ పైరవీలకు సిద్ధం కావడంతో టెండర్ ప్రక్రియకు అధికారులు వెళ్ళారు. టెండర్ కూడా ఎక్కువమంది పాల్గొన్నా చివరకు నిబంధనలు ఇద్దరుని గుర్తించినా మొక్కలు సరఫరా కార్యరూపం దాల్చలేదు.

**మొక్కలు ఇస్తారనే ఆశతో పొలాల్లో..**

మొక్కలు ఇస్తారనే ఆశతో పొలాల్లోమొక్కలను నాటడానికి గిరిజన రైతులు గోతులు తీసుకొని ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కాకూడదనే అధికారులు ఆలోచన మంచిదే కాని గిరిజన రైతులకు కాలం దాటిన తరువాత ఇచ్చే మొక్కలు వల్ల ఒరిగేది ఏమీ లేదన్న విషయం వాస్తవం.



**అధికారులు నిర్ణయాలతో ఆగిన పథకం**

రంపచోడవరం నియోజకవర్గం ను ప్రత్యేక జిల్లా, గుర్తేడు ప్రత్యేక మండలం చేసి గిరిజనులను ఒక అపారమైన విశ్వాసం పెరిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనితీరు ఇలాంటి పనులు వల్ల రెట్టింపు చెడ్డపేరు ప్రభుత్వానికి వస్తోందని పలువురు అంటున్నారు. ఎల్ ని నో ప్రభావంతో ఇప్పటికే వరి సాగు విస్తీర్ణం తగ్గింది. కనీసం జీడి వనాలు సాగు చేద్దామన్నా అధికారులు మోక్షం లభించలేదు. ఈ విషయాలపై జిల్లా పిడి ని ఫోన్ లో వివరణ కోరడానికి ప్రభాతవార్త ప్రయత్నం చేయడం జరిగింది.

## వైభవపేతంగా ర్యాలి శ్రీ జగన్మోహనుడు , శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి శ్రవణ నక్షత్ర మాస కళ్యాణం...



**ఆత్రేయపురం, ఆగస్టు 26,(ప్రభాత వార్త)**అతి పురాతన పుణ్యక్షేత్రంగా విరాజల్లుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయంలో బుధవారం శ్రవణ నక్షత్ర మాస కల్యాణాన్ని ఆలయ అర్చకులు కమనీయంగా జరిపించారు. ఈ సందర్భంగా కంకణధారణ, మాధోపక్షాలన, కన్యాదానం, మధుపర్కప్రాశన, సూత్రధారణ, యజ్ఞోపనేతధారణ, తలంబ్రాలు, క్రతువును పండితులు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ కార్య నిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు లు స్వామి వారికి అమ్మ వాళ్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీ స్వామి వారి అమ్మవార్ల కళ్యాణం ఉత్సవం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. శ్రీ స్వామి వారి తదుపరి మాస కళ్యాణం సెప్టెంబర్ –23. న నిర్వహించనున్నారు. కావున భక్తులు వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానాం, ఆరోగ్యం, వ్యాపారం మొదలగు కోరికల కొరకు శ్రీ స్వామి వారి మాస కళ్యాణంలో పాల్గొనవలెను. కావున భక్తులు 99113 34733 నంబరునకు సంప్రదించి ఆన్లైన్ ద్వారా రుసుం రూ.750/– లు చెల్లించి పూజనందు పాల్గొవాలని, ప్రసాదం పోస్టు ద్వారా పంపిస్తామని. ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు లు తెలిపారు. అలాగే ఆత్రేయపురం లో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం లో శ్రవణ నక్షత్ర మాస కల్యాణం ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి పవన్ తేజ దీక్షితులు, సాయి పవన్, రవికృష్ణ నేతృత్వంలో కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ స్వామివారికి అమ్మవార్లకు ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణ రాజు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని వాడపల్లి వీర వెంకట విక్రమాదిత్య వర్మ, భాను వెంకట పద్మావతి, లలితాప్రియాంక, వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయం మేనేజర్ గోరింట వినయ్ కుమార్ రాజు తగు ఏర్పాట్లు చేశారు.

## వాడపల్లి వెంకన్న ను దర్శించుకున్న కొవ్వూరు ఎమ్మెల్యే దంపతులు...

**- శ్రీవారిని దర్శించుకున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి దంపతులు...- నిత్యాన్న పథకానికి రూ 50/- వేలు విరాళం..**




**ఆత్రేయపురం, ఆగస్టు,26,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేలాది మంది భక్తులతో పోటెత్తింది. ఉదయం మేలుకొలుపు శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనా మావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు నిత్యాన్నదానంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి చేసిన ఏడు వారాల మొక్కును పూర్తి చేసుకుని, అష్టోత్తర పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు .శ్రీ స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు లు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. విశాఖపట్నం కంచపు సన్యాసిరావు, సత్యవతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ. 50000/– వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు లు శ్రీ స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

## సేవయే పరమావధిగా బతికిన తల్లి మదర్ తెరిసా 116వ జయంతి సందర్భంగా ప్రత్యేక నివాళులు




**అడ్డతీగల, ఆగస్టు 26, ప్రభాతవార్త** స్థానిక మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న మదర్ తెరిసా విగ్రహం వద్ద గుల్లాల సురేష్ బాబు ఆధ్వర్యంలో ఆమె 116వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జె. వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. మదర్ తెరిసా సమాజంలోని పేదలు, అనాథలు, రోగులకు అపారమైన సేవలు అందించారని, ఆమె చూపిన సేవా దృక్పథానికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు చోడిశెట్టి సుబ్బారావు మాట్లాడుతూ, మదర్ తెరిసా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మదర్ తెరిసా 1910 ఆగస్టు 26న యుగోస్లేవియాలో జన్మించారని, ఆ తర్వాత భారతదేశానికి వచ్చి కోల్‌కతాను కేంద్రంగా చేసుకుని పేదలు, నిరాశ్రయుల సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తుచేశారు. 1950లో మిషనరీస్ ఆఫ్ చారిటీని స్థాపించి ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలను విస్తరించారని తెలిపారు. ఆమె అందించిన అసమాన సేవలకు గాను 1979లో నోబెల్ శాంతి బహుమతి, 1980లో భారతరత్న పురస్కారాలు లభించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సీనియర్ కార్యకర్త కుప్పల జయరాం, గుల్లల సురేష్ బాబు, చాగంటి ఆదినారాయణ, కాల కృష్ణ, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల మండల ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి,ఎంఎంఎస్ నూతన కమిటీల నియామకం



**అడ్డతీగల, ఆగస్టు 26, ప్రభాతవార్త** ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఎంఎస్, ఇన్చార్జి మోర్త బుజ్జిబాబు మాదిగ ఆధ్వర్యంలో, జిల్లా సీనియర్ నాయకులు వేమగిరి అర్జున్ మాదిగ సారథ్యంలో అడ్డతీగల మండల నూతన కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సంఘ బలోపేతానికి, వర్గీకరణ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. నూతన కార్యవర్గం వివరాలు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అడ్డతీగల మండలం అధ్యక్షులు డోకుబుర్ర నాగేశ్వరావు మాదిగ అధికార ప్రతినిధి సవరపు సురేష్ మాదిగ మాదిగ శ్రామిక శక్తి అడ్డతీగల మండలం అధ్యక్షులు ఏడిద వీర్రాజు మాదిగ ?అధికార ప్రతినిధి కొమ్ముకూరి అబ్బులు మాదిగ ?మాదిగ మహిళా సమాఖ్య అడ్డతీగల మండలం ?అధ్యక్షురాలు కెంపు రత్నం మాదిగ అధికార ప్రతినిధి వేమగిరి సూర్యకుమార ?ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ బాధ్యులకు పలువురు నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, మాదిగల హక్కుల సాధనకు నూతన కమిటీలు నిరంతరం అందుబాటులో ఉంటాయని ఎన్నికైన బాధ్యులు పేర్కొన్నారు.

# జగన్ ను కలిసిన పాపారావు



**గండేపల్లి, ఆగస్టు 26. ప్రభాతవార్త** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బూత్ కమిటీల విభాగం కార్యదర్శిగా నియమితులైన గండేపల్లి మండలం పి నాయకశీపల్లి గ్రామానికి చెందిన మలిరెడ్డి పాపారావు మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు కీలక బాధ్యతలు అప్పగించినందుకు జగన్మోహన్ రెడ్డికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ మంత్రి తోట నరసింహం మరియు పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీలకు పాపారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మలిరెడ్డి పాపారావు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. రానున్న రోజుల్లో బూత్ స్థాయిలో పార్టీని మరింత శక్తివంతం చేయడానికి, వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నా వంతు కృషిని అంకితభావంతో అందిస్తాను అని పేర్కొన్నారు.

## రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

**-ఎమ్మెల్యే గిడ్డి..- రూ.6.05 కోట్లతో రహదారుల అభివృద్ధి..**



**అంబాజీపేట, ఆగస్టు 26,(ప్రభాతవార్త):** గ్రామీణ ప్రాంతాలలో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సిసి,బీటీ రోడ్ల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ ఏపీఆర్ ఆర్ఎస్ పి పథకంలో భాగంగా నియోజకవర్గానికి రూ. 17.67కోట్ల నిధులు మంజూరు అయ్యాయని వాటిలో అంబాజీపేట మండలానికి రూ.6.05 కోట్లు కేటాయించామన్నారు. వాటి ద్వారా ఇసుకపూడి తురకల దొడ్డిలో రూ.1.36 కోట్లతో సీసీ, బీటీ రోడ్డు, మాచవరం శివాలయం నుండి గ్రామపంచాయతీ సమీపంలోని వినాయక గుడి రోడ్డు రూ.54 లక్షలతో బీటీ రోడ్డు, ఇరుసుమండ ఇందిరానగర్ లో రూ.71 లక్షలతో బీటీ రోడ్డు,కె.పెదపూడి చిన బీరవారిపేటలో రూ.1.19 కోట్లతో బీటీ రోడ్డు, ఉమ్మన గరువులో రూ. 81 లక్షలతో బీటీ రోడ్డు,నందంపూడి లో రూ.64 లక్షలతో బీటీ రోడ్డు,తొండవరం జాంబవానిపేట హైస్కూల్ రోడ్డు రూ. 80 లక్షలతో రహదారుల నిర్మిస్తున్నామన్నారు. పంచాయతీ రాజ్ నుండి విడుదలైన ప్రత్యేక నిధులతో భారత గత నిర్మాణాలు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యేకు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బి.చినబాబు,ఎంపీడీవో బి.మమత, డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కె వి వి సత్యనారాయణ,వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు,మట్టపర్తి బాలభారతి, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు అరిగెల బలరామ్మూర్తి,సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు,టిడిపి, జనసేన, బిజెపి మండల శాఖల అధ్యక్షులు గూడాల ఫణి,దొమ్మేటి సాయికృష్ణ, కురసా అంజిబాబు, నాయకుడు గణపతి వీర రాఘవులు,మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, కొర్లపాటి ఢిల్లీ, పత్తి దత్తుడు, గుమ్మడి నాగమణి, రవణం రాము, వాకపల్లి దొరబాబు,పేరాబత్తుల దొరబాబు,క్రాప దుర్గారావు,జోగి కృష్ణ చైతన్య, కొప్పినీడి ఈశ్వరరావు, కముజు శ్రీనివాసరావు, అయ్యగారి శ్రీనివాస్,కొప్పినీడి సాయి సూర్య,కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## యానాంలో ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



**యానాం, ఆగస్టు 26: (ప్రభాతవార్త)** యానాం జామియా మసీదు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, ప్రేమ సందేశాలను ప్రజలకు చాటిచెప్పారు. వేడుకల్లో జామియా మసీదు కమిటీ సభ్యులు, మత పెద్దలు, యువత, చిన్నారులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించి, ప్రజలందరూ శాంతి, సామరస్యంతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.

## జగ్గంపేట వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా మదర్ థెరిస్సా జయంతి వేడుకలు:



**జగ్గంపేట, ఆగస్టు 26 (ప్రభాతవార్త )** మానవసేవే మాధవసేవగా భావించి అనేక సేవా కార్యక్రమాలు అందించిన అమృతమూర్తి, దయామయి మదర్ థెరిస్సా జయంతి వేడుకలు వాకర్స్ హెల్త్ క్లబ్ (జగ్గంపేట) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగ్గంపేట వాకర్స్ క్లబ్ ఫౌండర్, మాజీ జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు( కొండబాబు) మాట్లాడుతూ మానవతా మూర్తి, మానవసేవే మాధవసేవగా భావించే మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఒక పవిత్రమైన సేవా కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ఆమె సమాజానికి అందించిన అసమాన త్యాగాన్ని, పవిత్ర సేవలను స్మరించుకుంటూ ఆమె చూపిన కరుణా మార్గంలో పయనించడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం రోగుల ఆరోగ్యం, సంతోషం కొరకు ఆకాంక్షించడం, సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే సందేశాన్ని వ్యాప్తి చేయడం, మదర్ థెరిస్సా సేవానిరతిని ఆదర్శంగా తీసుకుని ఇటువంటి సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలోవాకర్స్ క్లబ్ ఫౌండర్, మాజీ జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) వెచ్చ నాగసత్య ఎం సురేష్, చంద్రమౌళి వెంకట శాస్త్రి, రాజేష్ పొట్టి రాజేష్:వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో పాల్గొన్న శాసనసభ్యులు వనమాడి కొండబాబు:



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి ఆగస్టు 26 (ప్రభాతవార్త)** మహమ్మద్ ప్రవక్త జన్మదినం (మిలాద్–ఉన్–నబీ) సందర్భంగా కాకినాడ పట్టణం నందు ముస్లిం సోదరులు నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు మిలాద్ ఉన్ నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మసీద్ ఇమాముకు సాలువ వేసి సత్కరించి, ముస్లిం సోదరులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ సర్వమానవాళి శ్రేయస్సు కోసం, శాంతిని నెలకొల్పేందుకు కృషిచేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అని, సాటివారి పట్ల ప్రేమ, దయను కలిగి ఉంటూ శాంతియుత సమాజాన్ని నెలకొల్పడానికి జీవితకాలం కృషిచేసిన ప్రవక్త జన్మదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి ఖాన్, ఎం ఎ తాజద్దీన్, ఎస్ కె రహీమ్, ఎండీ అన్సర్, సయిద్ ఆలీ, అన్వర్, ఖాదర్ అలీ ఖాన్, సాయిద్, కరీముల్లా, ఫసల్, జమీల్, బాషా, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

## కూనమిల్లిపాడు లో భారీ అన్నదానం



**కె గంగవరం,ఆగస్టు 26, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం దంగేరు కూనమిల్లిపాడు (పెదపాటి) గ్రామంలో వేంచేసినటువంటి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో పలు గ్రామాల నుండి ప్రజలు వేలాది సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దంగేరు ఎంపిటిసి కొప్పిశెట్టి లక్ష్మణ్ స్వామి లతోపాటు గెద్దాడ చంద్రరావు ,నీల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ప్రసాద్,కంచి జీవన్,వడ్లపాటి శివకృష్ణ, కొప్పిశెట్టి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి పాలకవర్గాలు కృషి చేయాలి

**- ఎమ్మెల్యే మద్దిపాటి**



**గోపాలపురం, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారికి ప్రత్యామ్నాయంగా అవసరమైన సహకారం అందిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బుధవారం మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు అధ్యక్షతన నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు, పంటల విక్రయ సమయంలో ఇబ్బందులు లేకుండా మార్కెట్ యార్డుల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డు పరిధిలో పుంత రోడ్లు, లింకు రోడ్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి అందించాలని పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. రైతులు పంటలను మార్కెట్ యార్డులకు సులభంగా తరలించేందుకు రహదారి సదుపాయాలు ఎంతో కీలకమన్నారు. రహదారులతో పాటు విద్యుత్, తాగునీరు, పరిశుభ్రత, శీతలీకరణ తదితర వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల సంక్షేమంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. గోపాలపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,700 మంది లబ్ధిదారులకు రూ.14 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ సాయం అందించినట్లు తెలిపారు. రైతులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించేలా పీఏసీఎస్‌లు, ఏఎంసీలు, రైతు సంఘాలు సంయుక్తంగా పనిచేసేలా ప్రణాళిక సిద్ధం చేసి ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, ఏఎంసీ కార్యదర్శి సుబ్బరాజు, సూపర్‌వైజర్ ఎం. కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## అయోర్టిక్ డిసెక్షన్‌కు అపోలో ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

**-62 ఏళ్ల మహిళకు పునర్జన్మ, కాకినాడ అపోలో వైద్యుల ఘన విజయం**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** కాకినాడ అపోలో ఆసుపత్రిలోఅయోర్టిక్ డిసెక్షన్‌కు అరుదైన గుండె రక్తనాళాల్లో రెండు బ్లాకులతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 62 ఏళ్ల మహిళకు కాకినాడ అపోలో ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్సను విజయవంతం చేసి పునర్జన్మ ప్రసాదించారు. బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో తొలిసారిగా ఈ తరహా క్లిష్టమైన శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. సుమారు 8 గంటలపాటు శ్రమించి దెబ్బతిన్న అయోర్టా భాగాన్ని కృత్రిమ గ్రాఫ్ట్‌తో భర్తీ చేయడంతో పాటు రెండు రక్తనాళాలకు బైపాస్ శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం ఐసీయూలో ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందించి మహిళను కోలుకునేలా చేయడం జరిగిందన్నారు. కార్డియోథొరాసిక్ సర్జన్ డా. పుష్యమి వేములపల్లి మాట్లాడుతూ అయోర్టిక్ డిసెక్షన్ అత్యంత ప్రమాదకరమైన అత్యవసర పరిస్థితి అని, తీవ్రమైన ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రిని ఆశ్రయించాలని సూచించారు. కార్డియాలజిస్ట్ డా. తంగెళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సకాలంలో వ్యాధిని గుర్తించి, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, అనస్థీషియా, క్రిటికల్ కేర్ విభాగాల సమన్వయంతో చికిత్స అందించడం వల్లే రోగి ప్రాణాలను కాపాడగలిగామని తెలిపారు. అపోలో సీఓఓ డా. గణేష్ మాట్లాడుతూ కాకినాడలోనే ఇలాంటి క్లిష్టమైన గుండె, ప్రధాన రక్తనాళ శస్త్రచికిత్సలకు ఆధునిక వైద్య సదుపాయాలు అపోలో ఆసుపత్రిలో అందుబాటులో ఉండటం గర్వకారణమన్నారు.

## అభయహస్తాలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



**పిఠాపురం, ఆగస్టు 26 ( ప్రభాతవార్త)**పిఠాపురం పట్టణంలోని చింతా వారి వీధిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ గణపతి, సహిత సీతారామాంజనేయ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు, దాతలు తమ మొక్కుబడులలో భాగంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఠాపురానికి చెందిన సమయ మంతుల శివశంకర్ ప్రసాద్, అనంతలక్ష్మి దంపతులు ఆలయంలోని మహాలక్ష్మి, లక్ష్మీగణపతి, శ్రీరాముల వారికి పూజలు నిర్వహించి, అభయహస్తాలను సమర్పించారు. దాతలు సమర్పించిన అభయహస్తాలను ఆలయ అర్చకులు కాశీ విశ్వనాథ శాస్త్రి, నిర్వాహకుల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం దాత కుటుంబ సభ్యులను ఆలయ నిర్వాహకులు హాలో ఘనంగా సత్కరించి పెద్ద ప్రసాదాలను అందజేశారు. భక్తులపై దైవానుగ్రహం, రక్షణ కలగాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి పద్మ బుజ్జి, కోరుమిల్లి సూర్యనారాయణ, చింతా వెంకటేశ్వరరావు, వంగలపూడి సత్యనారాయణ, కొత్తపల్లి వీర రామ రాఘవ, దేగల సత్తిబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాలతో మొహమ్మద్ ప్రవక్త జయంతి వేడుకలు



**మామిడికుదురు.ఆగస్టు 26(ప్రభాతవార్త)** ఇస్లాం మత వ్యవస్థాపకులు మొహమ్మద్ ప్రవక్త జయంతి వేడుకలను మామిడికుదురు మండల పరిధిలోని ముస్లింలు బుధవారం ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మామిడికుదురు ఇన్నా ఫతహనా సున్నీ జామియా మసీదులో మధ్యాహ్నం ఖురాన్ పఠనం అనంతరం మీలాద్ జరిగింది. ఈ మీలాద్ లో పలువురు కవులతో పాటు స్థానికులు ఖసీదాలను ఆలపించారు. మత ప్రభోదకులు మొహమ్మద్ సాదిక్ అన్వర్ రజ్వి మొహమ్మద్ ప్రవక్త జయంతి గాధను ముస్లింలకు వివరించారు. మీలాద్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని "మీలాదునబీ ముబారక్ "అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు కమిటీ అధ్యక్షులు మసూద్ మొహిద్దీన్(బాజన్నీ)ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. మసీదు కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ మీలాద్ లో సయ్యద్ రూహీ బాఖరీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. మొహమ్మద్ మొహిద్దీన్(కిష్వర్),అబ్దుల్ కలాం,ఎండివై షరీఫ్,షేక్ కరీముల్లా, జహంగీర్,అలీషా,రఫీ తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి..నీతిపూడి



**మామిడికుదురు.ఆగస్టు 26(ప్రభాతవార్త)** మదర్ థెరిస్సా పేదలు,రోగులు, నిస్సహాయకులకు అండగా నిలిచి అంతర్జాతీయ కీర్తి పొందారని న్యాయవాది నీతిపూడి గణపతిరావ ు(గణపతి) కొనియాడారు. బుధవారం మదర్ థెరిస్సా 117 వ. జయంతి సందర్బంగా నగరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న విగ్రహానికి గణపతిరావు ఆధ్వర్యంలో స్థానిక పెద్దలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం మదర్ థెరిస్సా సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ,కందాల వెంకటేశ్వరరావు, చిక్కం శ్రీనివాస్,గెద్దాడ వెంకట సుబ్బారావు,శంకర్,పంచాయతీ కార్యదర్శి పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి



**దేవీపట్నం ఆగస్టు 26 ప్రభాత వార్త.** జర్నలిస్టుపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ దేవిపట్నం ప్రెస్ క్లబ్ సభ్యులు స్థానిక ఎస్ ఐ కు వినతి పత్రం అందజేశారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలానికి చెందిన విశాలాంధ్ర విలేఖరి పందిరిపల్లి గోవింద్ పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు టి. ఉదయ్ వైస్ ప్రెసిడెంట్ బొంతు చక్రి,లంక పోసిరావు, కట్టుమూరి వీరబాబు, కొమరం రాంబాబు, పాక సన్నీ పలువురు మీడియా మిత్రులు పాల్గొన్నారు.


## మహిళా మార్టులో రూ. కోటి ఏమైంది

**-మత్స్యకారులకు బోటు ఇంజన్లు, బండ్లు ఎవరిచ్చారు- సర్వసభ్య సమావేశంలో నిలదీత**



**యు.కొత్తపల్లి, ఆగస్టు 26(ప్రభాతవార్త)** :మహిళా సంఘాల సభ్యుల నుంచి సేకరించి ఉప్పాడ మహిళా మార్టు లో పెట్టుబడిగా పెట్టిన రూ. కోటి రూపాయలు ఏమయ్యాయి అంటూ కొండెవరం, ఉప్పాడ ఎంపీటీసీ సభ్యులు దుళ్ళ సత్తిబాబు, మేరుగు ఎల్లాజీ నిలదీసారు. ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన ఎంపీడీవో లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు మండల స్థాయి అధికారులు గైర్హాజర్ కావడం గమనార్హం. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి అధికారులు లేకపోవడంతో అవాక్కవడం వారి వంతైంది. ముఖ్యంగా మత్స్యశాఖ, వెలుగు, నీటి పారుదల శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాకపోగా, ఐసిడిఎస్ తరపున అంగన్‌వాడీ కార్యకర్త హాజరవడంపై విమర్శలు వినిపించాయి. ఇటీవల మత్స్యకారులకు 100 బోటు ఇంజన్లు 40 శాతం ప్రభుత్వ రాయితీతో వచ్చాయంటున్నారని మిగిలిన 60 శాతం సొమ్ము ఎవరు సర్దుబాటు చేసారు, మత్స్యకార మహిళలకు వ్యాపారం నిమిత్తం మంజూరైన 30 బండ్లు ఏ ప్రాతిపదికన ఇచ్చారంటూ నిలదీసారు. ఎంపిటిసిలకు ఎటువంటి గౌరవం, ప్రోటోకాల్ లేకుండా చేసారంటే ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఎంపీటీసీ సభ్యులకు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీ కుమార్, కో ఆప్షన్ సభ్యులు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు చెట్టుబత్తిని సురేష్ కుమార్, మాదిరెడ్డి దొరబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అరబిందో సిబ్బంది కాలానుగుణ మార్పులను అధిగమించాలి




**యు.కొత్తపల్లి, ఆగస్టు 26(ప్రభాతవార్త)** :అరబిందో ఫార్మా సంస్థలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కాలానుగుణంగా వచ్చే మార్పులను అధిగమించాలని అరబిందో ఫార్మా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ యు.ఎన్.బి రాజు అన్నారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం పొన్నాడలో ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ)లో బుధవారం ప్రత్యేక మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ (ఎండీపీ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'ఆరో అస్త్ర' పేరిట ఆరు నెలల ప్రత్యేక శిక్షణలో ఉద్యోగుల నిర్వహణ, నాయకత్వ, వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరచుకుని సమర్థవంతంగా వినియోగించుకోవడం మార్పులు, సవాళ్లను అధిగమించడం వంటి అంశాలు ఈ శిక్షణలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా హోల్ టైమ్ డైరెక్టర్ ఎం.వి.రామకృష్ణ, లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సీనియర్ జనరల్ మేనేజర్ సుహాస్ రామ్, ఐఐఎఫ్‌టీ కాకినాడ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ రవీంద్ర సారథి, ఐఐఎఫ్‌టీ ఢిల్లీ ప్రతినిధి ప్రొఫెసర్ వెంకటేశం మురుగేశం, ఎండీపీ డివిజన్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధార్థ శంకర్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

# సఖినేటిపల్లి మండలంలో పలు రోడ్లకు శంకుస్థాపన...-ఎమ్మెల్యే దేవ..



**సఖినేటిపల్లి ఆగస్టు 26, ప్రభాత వార్త**డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గము నేడు సఖినేటిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.12.17 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 10 రోడ్ల అభివృద్ధి పనులకు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ పలు శంకుస్థాపనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, ప్రజలకు సురక్షితమైన రహదారి సౌకర్యం కల్పించడం లక్ష్యంగా ఈ పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ తెలిపారు. వి.వి.మెరక ఆర్‌డబి రోడ్డు నుంచి చావిడి పిల్లి వారి గ్రూప్ వరకు 2.273 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.25 కోట్లతో శంకుస్థాపన, మోరిపోడు, బట్టేలంక, చింతలమోరి, గొంది ఆర్‌డబి రోడ్డు నుంచి మోరిపోడు మీదుగా బట్టేలంక లిమిట్స్ వరకు 1.911 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.05 కోట్లతో శంకుస్థాపన, శృంగవరప్పాడు గ్రామంలో మలికిపురం, కేశవదాసుపాలెం ఆర్‌డబి రోడ్డు నుంచి దొండవాటి వారి గ్రూప్ వరకు 1.410 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.30 కోట్లతో శంకుస్థాపన, అంతర్వేదికర సడక్ రోడ్డు నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్ మీదుగా బీచ్ వరకు 2.10 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.73 కోట్లతో శంకుస్థాపన, అంతర్వేదికర సడక్ రోడ్డు నుంచి అంతర్వేదికర నల్ల వారి గ్రూప్ వరకు 2.10 కి.మీ. మేర నిర్మించనున్న బీటీ రోడ్డుకు రూ.1.62 కోట్లతో శంకుస్థాపన, రామేశ్వరం జిల్లా పరిషత్ రోడ్డు నుంచి బళ్ల శ్రీరాములు ఇంటి మీదుగా గుడిమూల గోదావరి రేవు రోడ్డు వరకు 1.440 కి.మీ. మేర నిర్మించనున్న రహదారికి రూ.1.08 కోట్లతో శంకుస్థాపన, సఖినేటిపల్లిలంక కేవీఎస్ రోడ్డు నుంచి చింతా వారి పేట సీసీ రోడ్డు వరకు 0.900 కి.మీ. మేర నిర్మించనున్న రహదారికి రూ.39 లక్షలతో శంకుస్థాపన, అప్పనరాములలంక ఆర్‌డబి రోడ్డు నుంచి కొత్తలంక హరిజనవాడ వరకు 2.131 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.17 కోట్లతో శంకుస్థాపన, అప్పనరామునిలంక గ్రామంలో రావూరి వారి మెరక, గ్రామ పంచాయతీ కార్యాలయం మీదుగా ఆర్‌డబి రోడ్డు నుంచి ఆర్‌డబి రోడ్డు వరకు 1.300 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.04 కోట్లతో శంకుస్థాపన, అంతర్వేదిపాలెం గ్రామంలో కేవీఎస్ రోడ్డు నుంచి మోరి, గొంది ఆర్‌డబి రోడ్డు వరకు, అంతర్వేదిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ మీదుగా 2.112 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.54 కోట్లతో శంకుస్థాపనలో పాల్గొన్నారు.రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే దేవ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాష్ట్ర బి సి కోఆపరేటివ్ ఫైనాన్స్ డైరెక్టర్ గుబ్బల ఫణి కుమార్, ఎంపీపీ వీరా మల్లిబాబు, పిఏసీఎస్ ఛైర్మన్ రావూరి సూర్యనారాయణ,మాజీ సర్పంచ్ లు సుబ్బరాజు, బల్రె శ్రీను, బిజెపి నేత మాలే శ్రీనివాస్ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

## -భారీగా బంగారం, వెండి, నగదు స్వాధీనం



**రావులపాలెం, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో జరిగిన భారీ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు దాసరి మహేష్ (23)ను అరెస్ట్ చేసి సుమారు 451.476 గ్రాముల బంగారం, 493.10 గ్రాముల వెండి, రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామానికి చెందిన మిద్దె పార్వతి బొబ్బిలిలో తన కుమారుడి ఇంటికి వెళ్లిన సమయంలో ఇంట్లో చోరీ జరిగిందని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్రేయపురం పోలీసులు జూలై 24న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడిని గుర్తించిన పోలీసులు మంగళవారం ర్యాలి రామాలయం వద్ద అరెస్ట్ చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్‌కుమార్ ఆదేశాలతో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర పర్యవేక్షణలో కొత్తపేట ఎస్‌డీపీవో సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో సీఐ జి. రమేష్‌బాబు, ఎస్ఐ ఎస్. రాము సిబ్బందితో కలిసి కేసును ఛేదించారు. పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# విజయమే లక్ష్యంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



**వి.ఆర్.పురం, ఆగస్టు26, (ప్రభాతవార్త):** స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైసిపి పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని, ఆ పార్టీ మండల ఉపాధ్యక్షులు బంధం.రాజు పిలుపు నిచ్చారు. బుధవారం రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని సోమలగూడెం గ్రామంలో ఆ పార్టీ నాయకులు మాడి.ముత్యాలరావు అధ్యక్షతన వైసిపి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో రాజు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇప్పటి నుండే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. చిన్నమట్టపల్లి మాజీ సర్పంచ్, ఆ పార్టీ సీనియర్ నాయకులు పిట్టా రామారావు మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతి పంచాయతీ నుండి అభ్యర్థిని బరిలో నిలుపుతామన్నారు. వైసిపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత స్థానిక నాయకత్వందేనని చెప్పారు. ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేస్తే, భారీ మెజారిటీతో అధిక స్థానాలను గెలుచుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కోటం.జయరాజు, ఆస.లక్ష్మణరావు, పుల్.ధర్మరాజు, గంపెసంపల్లి.చైతన్య, కుంజ.నాగేశ్వరరావు, రమేష్, సోల.వీర్రాజు, మేకల.నరసింహారావు, ఆస.గోపాలరావు, ముత్యాల.సింగరాజు, మురళి.సోడి, మడివి.నారాయణ, సవలం.దుర్గయ్య, సోడి.దుర్గాప్రసాద్, ఉయక.రాజబాబు, కుంజ.రవి, సరియం.ముత్తయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# 28 తేదీ లోపు ఓటర్లు జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే చెప్పండి



**రాజవొమ్మంగి, ఆగస్టు 26. ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో గల 19 పంచాయితీలకు సంబంధించి ఓటర్లు జాబితాను రాజవొమ్మంగి మండలపరిషత్ కార్యాలయ నోటీసు బోర్డులో ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు ఏర్పాటు చేశారు. ఈ నెల 28 తేదీ లోపు ఎస్. సి, ఎస్టీ, బి. సి. ఓటర్ల ముసాయిదా జాబితా అన్ని సచివాలయాలు వద్ద అందుబాటులో ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఓ బి. విజయ్ కుమార్, పంచాయితీ అభివృద్ధి అధికారులు జి. మహేష్, జి. సతీష్, యన్. ధర్మేంద్ర, ఎంపిడిఓ కార్యాలయ మనోహర్ పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా కార్మిక శాఖలో 36 వేల క్లెయిములు పెండింగ్

## -ఈనెల 4న క్వారీ సెంటర్‌లో ధర్నా.. చలో అమరావతి హెచ్చరిక-ఆర్థిక ఇబ్బందుల్లో బాధిత కార్మిక కుటుంబాలు.. నిర్మాణానికి నోచుకోని కార్మిక భవనం



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 26: ప్రభాతవార్త,** రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా కార్మిక శాఖ పనితీరు మాత్రం మారడం లేదని, ప్రభుత్వం--అధికారుల మధ్య సమన్వయ లోపంతో కార్మికుల సంక్షేమం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన కార్మికులకు సంబంధించిన సుమారు 36 వేల క్లెయిములు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలోనూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ ఈ క్లెయిములు పరిష్కారం కాకపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య అధ్యక్షుడు బోజ్జ రామకృష్ణ మాట్లాడుతూ కార్మిక సంక్షేమ కార్డుల నమోదు కోసం పోర్టల్ సంవత్సరాలుగా సక్రమంగా పనిచేయడం లేదని విమర్శించారు. కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు, వివాహ పథకాలు, గర్భిణీలకు ఆర్థిక సహాయం వంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆరోపించారు.కార్మిక సంక్షేమ బోర్డులో కోట్లాది రూపాయలు నిల్వ ఉన్నప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో శిక్షణ ఇస్తున్నా టూల్ కిట్లు అందించడం లేదని పేర్కొన్నారు.రాజమహేంద్రవరం నగరంలోని భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన పది యూనియన్లలో వందలాది మంది సభ్యులు ఉన్నప్పటికీ వారికి కార్మిక భవనం లేకపోవడంతో కార్యకలాపాలు నిర్వహించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ హయాంలో మంజూరైన రూ.కోటిలో రూ.65 లక్షలు పునాదులకే ఖర్చయ్యాయని, మిగిలిన రూ.35 లక్షలతో కనీసం షెడ్ నిర్మాణం చేపట్టాలని కోరారు.కార్మిక భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెల 4న క్వారీ సెంటర్‌లో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి, అనంతరం చలో అమరావతి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో హరీష్, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# కాట్రేనికోన కళాకారులకు స్వర్ణ నంది అవార్డులు



**కాట్రేనికోన ఆగస్టు 26 (ప్రభాతవార్త)** గ్లోబల్ ఫైన్ ఆర్ట్స్ యోగ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ శ్రీమల్లెపూల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కళావైభవ మహోత్సవ పురస్కార వేడుకల్లో కాట్రేనికోనకు చెందిన కళాకారులు పుష్ప సురేష్ శర్మ, వట్టూరి కామేశ్వరరావులకు చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో కళా వేంకట దీక్షితులు వేదికపై స్వర్ణ నంది అవార్డులు ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ శర్మ మాట్లాడుతూ తమలాంటి ఎంతో మంది కళాకారులకు వారధిగా రధసారధిగా ఉంటూ సన్మాన సత్కారాలుతో బాటు స్వర్ణ రజిత నందిలను ఇస్తూ కళాకారుల కోసం అనునిత్యం అనేక కార్యక్రమాలను చేపడుతున్న శ్రీమల్లెపూల వెంకటరమణ సేవలను కొనియాడుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ అవార్డులు అందజేస్తూ ఆశీస్సులు తెలిపారు సినీ నటుడు కె.వి.ఎల్ నరసింహారావు డైరెక్టర్ రమేష్ ఉప్పు జూనియర్ ఎన్.టి.ఆర్ కోటగిరి చంద్రశేఖర్ డాక్టర్ కీరసాగర్ దంపతులు పాల్గొన్నారన్నారు.

# బంగారు షాపు యజమానులకు పోలీసుల హెచ్చరిక



**రావులపాలెం, ఆగస్ట్ 26 (ప్రభాతవార్త) :** ఇటీవల కాలంలో దొంగిలించబడిన బంగారు వస్తువులను కొందరు బంగారు షాపు యజమానులు కొనుగోలు చేస్తున్నట్లు వస్తున్న సమాచారం నేపథ్యంలో రావులపాలెం పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. బంగారు నగలు, వస్తువులు విక్రయించేందుకు వచ్చే వారి వద్ద తప్పనిసరిగా బిల్లులు పరిశీలించాలని సూచించారు. బిల్లులు లేకుండా బంగారం కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్లులు లేని బంగారంతో ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రావులపాలెం టౌన్ సీఐ జి రమేష్ బాబు సూచించారు.

# దుళ్లలో ఘనంగా మదర్ థెరీసా జయంతి వేడుకలు



**కడియం, ఆగస్టు 26 ( ప్రభాతవార్త)** కడియం మండలం దుళ్ల గ్రామంలో మదర్ థెరీసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లో ఉన్న మదర్ థెరీసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పరస్పరం తినిపించుకున్నారు. 'థెరీసా అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మదర్ థెరీసా అందించిన సేవలను కొనియాడారు. ఆమె చూపిన మార్గాన్ని అనుసరిస్తూ సేవా తత్వాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు తాతపూడి బాబీ, ఈదర నందబ్బు, గుర్రపు కొండయ్య మాస్టారు, సూరపురెడ్డి భరత్, కట్టుంగ నాగరాజు, చిత్తూరి వెంకన్న చౌదరి, మాడా బాబూరావు, యర్రా సత్యనారాయణ, తోకల వీర రాంబాబు, థెరీసా సేవా సంస్థ అధ్యక్షుడు చందన సత్తిబాబు, సభ్యులు తొట్టా సత్తిబాబు, కవిలి సతీష్, మిద్దె వీరబాబు, షేక్ మాబు, పుత్సల శ్రీను, ఇమ్మంది సతీష్, పచ్చిపులుసు సుందరబాబు, పచిగోళ్ల వెంకటేశ్వరరావు, మాడా సుబ్బు, దుబాయ్ సత్తిబాబు, యర్ర పోసియ్య తదితరులు పాల్గొన్నారు.

# కూనవరంలో వీధి కుక్కల స్వైర విహారం...!

## ఇద్దరు చిన్నారులను గాయపరచిన వీధి కుక్కలు



**కూనవరం, ఆగస్టు 26, ప్రభాతవార్త :** కూనవరం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. టేకులబోరు గ్రామంలో బుధవారం రోజున ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులను వీధి కుక్కలు గాయపర్చగా వారు భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉదయం యడ్ల అశోక్ కుమార్తె లావణ్య (3), యడ్ల ముత్యాలు కుమారుడు హాని (1), వీధిలో ఆడుతుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో ఇరువురు చిన్నారులకు గాయాలు కావడం జరిగింది. గాయపడిన ఇద్దరు చిన్నారులను కోతులగుట్ట ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఇద్దరు చిన్నారులు ఇరువురి అన్నదమ్ముల సంతానం కావడం గమనార్హం.ఇదిలా ఉండగా గత కొంత కాలంగా వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోవడం, దారిన పోయే వారిపై దాడికి పాల్పడడం జరుగుతుంది. రాత్రి వేళల్లో బయటకు రావాలన్నా ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కలను నిర్మూలించాలని అక్కడి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# జగన్ తీరుకు - సవాల్ విసిరిన జ్యోతుల నెహ్రూ

## ఏకగ్రీవంగా ఎన్నికైన చిన్న పంచాయతీకి ఐదు లక్షలు పెద్ద పంచాయతీకి పది లక్షలు నజరానా:



**జగ్గంపేట, ఆగస్టు 26 (ప్రభాతవార్త )** జగ్గంపేట స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి మంగళవారం ప్రెస్ మీట్ లో మాట్లాడిన తీరు దొంగే దొంగ దొంగ అన్నట్టుగా ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో ప్రజలందరూ ప్రత్యక్షంగా చూశారని అన్నారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, వేసిన నామినేషన్లను బెదిరించి, కిడ్నాప్ లు చేసి విత్ డ్రా చేయించడం అందరం చూశామని అన్నారు. ఈ రోజు జగన్ ఎన్నికలు పారదర్శకంగా జరిగితే మనదే విజయం అంటూనే, రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో అభ్యర్థులను నిలబెట్టకపోయినా, సరిగా పని చేయకపోయినా 2029 ఎన్నికల్లో ఇన్ చార్జ్ లుగా ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థులకు సీట్లు ఇవ్వనని చెప్పడం ఆయన నియంతృత్వానికి నిదర్శనమని అన్నారు. అందుకే ప్రజలు గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని అన్నారు. ఈ రోజు ఒక టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా నీకు నేను సవాల్ విసురుతున్నా, ఎక్కడా నీలాగా పోలీస్ యంత్రాంగాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని నామినేషన్ వేయకుండా అడ్డుకోమని, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజాస్వామ్యం పైన, సెక్యులరిజం పైన నమ్మకం ఉన్న వ్యక్తి అని అన్నారు. జగన్ పరామర్శల పేరుతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాడని, బాధితులను పరామర్శించడం కాకుండా రౌడీలను, గుండాలను, బాధితులను ఇబ్బందులకు గురి చేసిన వారిని పరామర్శిస్తూ వైసీపీ గుండాలతో విధ్వంసం సృష్టిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అనేకమంది సీనియర్లు జగన్తో తిరుగుతూ వారి భవిష్యత్తును, వారి చరిత్రను సర్వనాశనం చేసుకుంటున్నారని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే ప్రభుత్వాలు ఆ గ్రామాలకు నజరానా ఇచ్చి అభివృద్ధికి సహకరిస్తున్నాయని, దానిని కూడా జగన్ వ్యతిరేకిస్తున్నాడని అన్నారు. నీకు అంతగా పోటీలు పెట్టాలని ఉంటే నువ్వు కొట్టేసిన 43 వేల కోట్లలో కొంత సొమ్ము గ్రామాలకు ఇచ్చి అభివృద్ధి చెయ్యాలని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయని, జగన్ కనే పగటి కలలు నిజం కావని అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఏకగ్రీవమైన గ్రామాలకు చిన్న గ్రామాలకు ఐదు లక్షలు, పెద్ద గ్రామాలకు పది లక్షలు ఇస్తామని అన్నారు. స్థానిక సంస్థల్లో అన్ని వర్గాలకు న్యాయం చేయాలని, మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయం చేస్తున్న ఘనుడు జగన్ అని అన్నారు. మన ప్రాంతంలో సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, నాండ్ల చిరంజీవి జీను మణి బాబు తదితరులు పాల్గొన్నారు.

# సి. ఐ. ఎఫ్ ఆఫ్ లైన్ రుణ వసూళ్ల పై ప్రధానంగా దృష్టి. డి. పి. ఎం. సన్యాసి నాయుడు.

## -కొత్త రుణాలు మహిళా సంఘ సభ్యులకు ఇవ్వలేని స్థితిలో రాజవొమ్మంగి మండలం.



**రాజవొమ్మంగి, అగస్టు 26, ప్రభాతవార్త** పోలవరం జిల్లాలో గల 12 మండలాల్లో 474 గ్రామసమాఖ్యలు పరిధిలో 9076 గ్రూపుల్లో 90, 159 మంది సభ్యులు ఉన్నారని జిల్లా డిపియం ఐ. బి. సన్యాసినాయుడు అన్నారు. 2005 సం. నుండి సి. ఐ. ఎఫ్ రుణాల్లో ఆఫ్ లైన్ ఇవ్వడం జరిగిందన్నారు. అప్పులు సొమ్ములు వసూళ్లపై ప్రధానంగా దృష్టిని సారించామని అన్నారు. 2025..26 సం, 2026..27 సం. లో భాగంగా 12 మండలాల్లో రూ. 6 కోట్ల 86 లక్షల 98 వేల 320 లు సి. ఐ. ఎఫ్ రుణాన్ని 1,231 మంది సభ్యులకు ఇవ్వడం జరిగిందన్నారు. మండల మహిళా సమాఖ్య లో నిల్వ ఉంటే ఆ సొమ్ములు సెర్ప్ నోడల్ ఖాతాను మార్పు జరుగుతుందన్నారు. ఏ ఒక్క ఋణం కావాలన్నా సెర్ప్ నుండి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 10 వి. ఓ లు పరిధిలో సి. ఐ. ఎఫ్ రుణాలు బకాయిలు వల్ల కొత్తగా రుణాలు ఇవ్వడానికి వీలు లేకుండా ఉందన్నారు. 10 వి. ఓ ల్లో మొండి బకాయిలు వల్ల 49 వి. ఓ లు కొత్త రుణాలను పొందలేక పోతున్నారని వివరించారు. ఉన్నతి పథకంలో వడ్డీ లేని రుణాలకు కూడా ఇవ్వలేని విధంగా రాజవొమ్మంగి మండలంలో పరిస్థితి ఉందన్నారు. శ్రీనిధి, సి. ఐ ఎఫ్ రుణాలు చెల్లింపు లేక కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న పి. ఎం. ఇ. ఎఫ్. ఇ ఋణం పొందటానికి అవకాశం లేదన్నారు. ఈ పథకంలో ఒక సభ్యురాలుకు రూ. 10 లక్షలు ఋణంలో రూ. 3.50 లక్షలు సబ్సిడీ ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఏ. పి. ఎం. మద్రి లక్ష్మి, డిపియం ఐ. బి. సన్యాసినాయుడు, ఏ. పి. ఎం. ఫైనాన్స్ సత్యప్రసాద్, శ్రీనిధి మేనేజర్లు వేణు, సాయికిరణ్, సీసీ లు రామకృష్ణ, లింగమ్మ, చిలకమ్మ, సూర్యనారాయణ, శ్రీరామ్మూర్తి, సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

# అగ్ని బాధితులకు అండగా తాళ్లరేవు లయన్స్ క్లబ్.



**తాళ్లరేవు, ఆగష్టు 26( ప్రభాత వార్త):** ఇటీవల మండలంలోని తాళ్ళరేవు సంత మార్కెట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కట్టా ఆదినారాయణ, శ్రీ కురంగేశ్వర లయన్స్ క్లబ్ అధ్యక్షులు చిట్టూరి చలపతి ఆధ్వర్యంలో సాయం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన ఇళ్లను క్లబ్ ప్రతినిధులు బుధవారం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మూడు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 25 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడంలో సంతృప్తి ఉంటుందని ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్ పర్సన్ చోడే మాలతి వసుంధర, జోన్ చైర్ పర్సన్ పొన్నాడ పేరయ్యరాజు, జీవిటి టీమ్ శ్రీనివాసరెడ్డి, సతీష్ రాజు, దత్తాత్రేయ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధికి కృషి.

# అసోసియేషన్ నూతన కార్యవర్గం స్పష్టం



**తాళ్లరేవు, ఆగష్టు 26( ప్రభాతవార్త ):** మండలంలో ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి అందరి సమన్వయంతో పని చేస్తామని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కు ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బోమిడి బాలసుబ్రమణ్యం (బాలు), గౌరవ అధ్యక్షులు ధూళిపూడి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దున్నా శ్రీకాంత్ లను సభ్యులు ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎన్నికైన ప్రతినిధులు తెలిపారు. జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, తదితరులు నూతన కార్యావర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం. భీమశంకర్, బోనం శ్రీనివాస్, బివిఎ కుమార్, పితాని బాల వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన జెండా ధ్వంసం.. చర్యలకు డిమాండ్



**పిఠాపురం, ఆగస్టు 26 ( ప్రభాతవార్త )**కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం పిఠాపురం మండలం నవకండ్రాడ గ్రామంలో జనసేన జెండా దిమ్మెను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం జరిగింది. ఈ దుశ్చర్యపై ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన జనసేన జెండా దిమ్మెను ధ్వంసం చేసిన ఘటనను పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ ఘటనపై జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వెన్నా జగదీష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జెండా దిమ్మెను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి, ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.జనసేన పార్టీ జెండాను అవమానించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. రాజకీయ భేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలోనే వ్యక్తం చేయాలని, పార్టీ ఆస్తులు, జెండాలు, దిమ్మెలను ధ్వంసం చేయడం సరికాదన్నారు. ఇటువంటి ఘటనలను జనసేన శ్రేణులు సహించబోవని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి నిందితులను గుర్తించాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా మదర్ థెరిసా జయంతి



**సీతానగరం, ఆగస్టు 26, (ప్రభాతవార్త)** :సీతానగరంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పెదపాటి రమేష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ మదర్ థెరిసా చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెందుర్తి దేవదాసు, వలవల వెంకటరాజు, అధికారి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# సహజ జీవనయానాంతో వ్యాధులు దూరం..

## -హెచ్ఐవి,ఎయిడ్స్ పై జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ అవగాహన..



**అంబాజీపేట, ఆగస్టు 26,(ప్రభాతవార్త):** సహజ జీవనయానాంతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చుని జన కల్యాణ్ ఐటీ ప్రాజెక్టు మేనేజర్ జి.శ్రీను అన్నారు.రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,దిశా జనకళ్యాణ్, లింక్ వర్కర్స్ చేంజెస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రేమానందం బుర్రకథ టీం చే ఇంటెన్సిఫైడ్ ఐఈసి కాంపెయిన్లో భాగంగా హెచ్.ఐ.వి,ఎయిడ్స్,టీబీ పై అవగాహన కార్యక్రమంను బుధవారం వారపు సంత, స్థానిక బస్ స్టేషన్ ప్రాంతాలలో నిర్వహించారు.హెచ్.ఐ.వి,ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, వ్యాధి సోకకుండా తీసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను బుర్రకథ రూపంలో ప్రకటించారు.హెచ్.ఐ.వి,ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా సమాజములో అందరూ కలసి జీవించాలన్నారు.అలానే చెడు వ్యసనాలకు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలు చెబుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ ఎ.రాధా నరసింహం, ఆశ వర్కర్స్ జి. ఎల్.నరణమ్మ,ఎస్.రత్నకుమారి,జనకళ్యాణ్ టి ఐ ప్రాజెక్ట్ సంస్థ సిబ్బంది ఎం.వి.జ్యోతి లింక్ వర్కర్ సిబ్బంది, కేర్-సపోర్ట్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా బాల మందిర్ లో మదర్ తెరిసా జయంతి

## -రోగులకు పండ్లు పాలు పంపిణీ



**కొత్తపేట, ఆగస్టు 26, (ప్రభాతవార్త)** మండల పరిధిలోని కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలు లో మదర్ థెరీసా నూట పదహారవ జయంతి సందర్భంగా పాఠశాలలో మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో గల మదర్ థెరీసా విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా మదర్ థెరీసా వృద్ధులకు కుష్టు రోగులకు అనాధలకు చేసిన సేవలు గురించి రామోజు శేఖర్ తెలిపారు విద్యార్థులు గవర్నమెంటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా సుమారు ఏభై మంది రోగులకు పాలు పండ్లు ల రొట్టెలు పంచారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు ఎన్ శివరత్నం ఉపాధ్యాయుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# ఆసాంఘిక శక్తులకు అండగా జక్కంపూడి సోదరులు

## -తనపై హత్యాయత్నం నిందితులను అరెస్టు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష -మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బర్ల బాబురావు



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 26: ప్రభాతవార్త,**నగరంలో గంజాయి, పేకాట, మద్యం, పబ్బులు వంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తూ, అసాంఘిక శక్తులకు వైసీపీ నాయకులు జక్కంపూడి రాజా, గణేష్ లుఅండగా ఉంటున్నారని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, తెలుగుదేశం నాయకులు బర్ల బాబురావు ఆరోపించారు. బుధవారం ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తాను తెలుగుదేశం పార్టీ నాయకుడిగా వైసిపి నాయకులు చేస్తున్న దురాగతాలను, అరాచకాలను బహిరంగంగా ఎండగట్టడం తో జక్కంపూడి సోదరులు తనపై కక్ష పెంచుకున్నారని అన్నారు. అందులో భాగంగానే మంగళవారం రాత్రి తన ఇంటి పరిసరాల్లోకి జక్కంపూడి గణేష్ ముఖ్య అనుచరుడు రాజేష్ పెట్రోలు సీసాలతో వచ్చి తన కారు చుట్టూ తిరుగుతూ తాను బయటకు వస్తే చంపేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. దీనిపై ఫోటోలు, సాక్ష్యలతో ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్లో రాత్రి ఫిర్యాదు చేశానని తెలిపారు. రెండు వారాల్లోగా నిందితులను అరెస్టు చేయాలని లేదంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఈ సంఘటనను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లానని జిల్లా ఎస్పీతో మాట్లాడటం జరిగిందన్నారు. గంజాయి డ్రగ్స్ పేకాట నిలయంగా జిల్లాను మార్చేసిన జక్కంపూడి గణేష్ జక్కంపూడి రాజా జక్కంపూడి రామ్మోహన్ రావు వారసత్వాన్ని అందిపుచ్చుకొని అసాంఘిక శక్తులుగా పెంచి పోషించే సెంటర్ గా సెటిల్మెంట్ కేంద్రం గా మారారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు బర్ల బాబురావు ఆరోపించారు. నేరచరిత్ర కలిగిన జక్కంపూడి గణేష్ జక్కంపూడి రాజాలు డి ఎస్సీ లో అవకతవకలు ఉన్నాయని లోకేష్ ను రాజీనామా చేయాలని వీళ్లు చేసే ఉద్యమాలలో నిజాయితీ ఉందా అని ప్రశ్నించారు. తనపై చేస్తున్న భౌతిక దాడిని ఖండిస్తూ జిల్లాను వారి గుప్పెట్లో పెట్టుకుంటూ మత్తు పదార్థాలకు గంజాయి, పేకాట, డ్రగ్స్ భూ దందాలకు అడ్డాగా మరల్చారన్నారు. అసాంఘిక శక్తులతో ధర్నాలు చేసే చరిత్ర వీరిదని వీళ్ళ తల్లిదండ్రులు కేజీ బియ్యం కోసం సంచి పట్టుకుని ఇంటింటికి తిరిగిన చరిత్ర వీరిదన్నారు. తెలుగుదేశం అధిష్టానం వైసీపీ నాయకులతో వేదికలు పంచుకోవద్దని చెప్తుంటే, వైసిపి గణేష్ పబ్ ప్రారంభానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు వెళ్లడం ఎంతవరకు సమంజసమనిఅన్నారు. నగర తెలుగుదేశం ప్రజాప్రతినిధులు వైసిపి జక్కంపూడి సోదరులతో అంట కాగుతున్నారని, ఐమాక్స్ థియేటర్లో మెడికో ప్రియాంక ఘటన వెనుక వీరి పాత్ర ఉందని ఆరోపించారు.ప్రియాంక మృతికి కారణమైన నిందితులు జక్కంపూడి పబ్ లోనే తాగారని మద్యం సేవించలేదని డ్రగ్స్ తీసుకున్నారని ఆరోపించారు అటువంటి అసాంఘిక శక్తులను జక్కంపూడి గణేష్ సోదరులు సిటీ ప్రజా ప్రతినిధి అండగా నిలిచారని అందుకే తాను బయట పెట్టనంతవరకు ఘటన బయటకు రాలేదని అన్నారు. ఈ ఘటన పైన జక్కంపూడి సోదరుల అసాంఘిక కార్యకలాపాల పైన వారి వెంట తిరిగే సంఘవిద్రోహశక్తులపైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps